సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No: APTEL / 2015 / 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి | ఆదివారం 24 ఏప్రిల్ 2016 సంపుటి : 1 సంచిక 30 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

## రాజధానిని
# చట్టప్రకారం నిర్మించాలి

యూరోపియన్ కమిషన్‌లో ఏపీ డైరెక్టర్, ఆమ్నేస్టీ ఇంటర్నేషనల్ కన్సల్టెంట్, పీపుల్స్ వాచ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మల్లెల శేషగిరిరావుతో రాజధాని వార్తలు జరిపిన ఇంటర్వ్యూ...

రాజధాని ప్రతినిధి, రాయపూడి



**ప్రశ్న : నవ్యాంధ్ర రాజధాని ప్రాంతమైన రాయపూడి గ్రామస్తులైన మీకు ప్రభుత్వం రాజధానినిఈ ప్రాంతంలో నిర్ణయించడంతో ఎలాంటి అనుభూతి కలిగింది...?**

**జవాబు** : నేను చాలా సంతోషించాను... ఈ ప్రాంతంలో ప్రజలు చాలా అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంది. వీరి జీవనశైలిలో విస్తృతమైన మార్పులు రాబోతున్నాయని ఆనందిస్తున్నాను...

**ప్రశ్న : అయితే 29 గ్రామాల ప్రజల సహాయ సహకారాలు ప్రభుత్వానికి అందిస్తారా ?**

**జవాబు** : తప్పకుండా అందిస్తాము...అయితే ప్రభుత్వం కూడా రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలి. అన్నీ చట్ట ప్రకారం జరగాలి. రాజధాని ప్రాంతం మృత నగరంగా ఉండకూడదు. అంటే రాజధాని ప్రాంతం స్వయం సమృద్ధిని సాధించాలి. దానికోసమే మా తపన...

- రాజధానిని స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలి
- భూ సమీకరణ పారదర్శకంగా లేదు
- భూములిచ్చిన రైతులకంటే రియల్టర్లే ఎక్కువ మంది ఉన్నారు
- స్థానిక రైతు కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యం అందించాలి
- ఉద్యోగాల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలి
- రైతులంతా కలసి ఉంటేనే అభివృద్ధి ఫలాలను అందుకోగలం
- ప్రముఖ లాయర్ మల్లెల శేషగిరిరావు

**ప్రశ్న : మృత రాజధాని నగరం అంటే ఏమిటి ?**

**జవాబు** : ప్రపంచంలో చాలా రాజధానులు ఉన్నాయి. అయితే అమెరికా, చైనా, మలేషియాలా తన కాళ్లపై తాను నిలవాలి. అమెరికాలోని డెట్రాయిట్ నగరాన్ని చూడండి... దాని ప్రధాన ఆదాయ వనరు ఫోర్డ్ కార్ల కంపెనీయే... ఎప్పుడైతే అక్కడ ఫోర్డ్ కంపెనీ తన ఉత్పాదనలు ఆపేసిందో ...ఆ సిటీలో ఉద్యోగాలు లేవు. ఇళ్లు నిరుపయోగం అయ్యాయి. అలాగే కాలేజీలు ...ఇప్పుడది క్రైమ్ సిటీగా మారింది... తాత్కాలిక ఆదాయవనరులు కాకుండా శాశ్వత ఆదాయ వనరులతో ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష.

**ప్రశ్న : పంట నష్టపోయిన రైతుల మాటేమిటి ?**

**జవాబు** : రాష్ట్ర ప్రభుత్వం రూ. 9 కోట్లు ఖర్చు చేసి రాజధాని ప్రాంత యువతకు వృత్తి విద్యానైపుణ్యాలలో శిక్షణ నిచ్చింది. ఇది మెచ్చుకోతగ్గ విషయం...

**ప్రశ్న : రాజధాని ప్రాంతంలో భూసమీకరణపై మీ అభిప్రాయం ?**

**జవాబు** : ప్రభుత్వం భూమిని సమీకరణం చేసి నోటిఫికేషన్

2 లో

### ఏజన్సీ గిరిజన గ్రామాలు, దళితుల నివాస ప్రాంతాల
# నూరుశాతం అభివృద్ధే ఆశయం

- నియోజకవర్గంలోని గ్రామాల్లో వీధులన్నింటినీ సి.సి. రోడ్లుగా మారుస్తాం..
- నియోజకవర్గంలో పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకం..నిర్మాణం జరగటంతో నా జన్మకు సార్థకత...
- నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో పోలవరం నుంచి కొయ్యలగూడెం, టి.నర్సాపురం మండలాలు విడిపోవచ్చు...
- తూర్పు గోదావరి, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో ఎస్.టి. రిజర్వుడు నియోజకవర్గాలు నాలుగుకు పెరగవచ్చు.
- రాజధాని ప్రతినిధితో పోలవరం ఎం.ఎల్ ఏ. శ్రీనివాసరావు ముఖముఖీ..



**అన్నంరెడ్డి సుబ్బారావు-రాజధాని ప్రతినిధి- కొయ్యలగూడెం :**

పోలవరం నియోజకవర్గంలోని గిరిజన ఏజన్సీ గ్రామాలను, దళితుల నివాస ప్రాంతాలను నూరుశాతం అభివృద్ధి పరచటమే తన ఆశయమని, మిగిలిన అన్ని గ్రామాలలోని వీధులన్నింటినీ సి.సి. రోడ్లుగానీ నిర్మిస్తామని స్థానిక ఎం.ఎల్.ఏ, శాసనసభలో ఎ.పి.ఎస్.టి. సంక్షేమ సంఘం చైర్మన్ మొడియం శ్రీనివాసరావు చెప్పారు. రాజానగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన రాజధాని ప్రతినిధితో 'ముఖముఖీ'గా మాట్లాడారు. తన ఆశయాలకు నెరవేర్చటానికి వీలుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుష్కలంగా నిధులను ఇస్తున్నారని ఆయన చెప్పారు. తాను ఇక్కడ ఎం.ఎల్.ఏ. గా ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో తమ నియోజకవర్గం నుంచే గోదావరి నీటిని కృష్ణానదిలో అనుసంధానం చేయడం, పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ఏడారికాలంలో పూర్తి చేసి రెండు, నదులను అనుసంధానం చేయటం, పోలవరం ప్రాజెక్టు 2018 నాటికి పూర్తి కానుండటం తన అదృష్టమన్నారు. వాటితో పాటు తన పేరుకు కూడా చరిత్రలో నిలిచిపోతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ బృహత్తర బహుళప్రయోజన పథకాలు నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసేందుకు పుష్కలంగా నిధులను ఇచ్చి పనులను వేగవంతం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు

4 లో

## ఈ వారం రాజధాని

- ఈ నెల 14న విజయవాడ రూరల్ మండలం జక్కంపూడిలో ఎన్.టి.ఆర్. గృహనిర్మాణ పథకానికి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి
- రాజధాని గ్రామాలలో 14న ఘనంగా జరిగిన అంబేద్కర్ జయంతి
- విజయవాడలో కన్నుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం
- ముస్లిం రిజర్వేషన్ల పరిరక్షణకు సహకరిస్తాం : జగన్
- రాజధాని గ్రామాలలో పెరుగుతున్న ట్రాఫిక్‌ని పట్టించుకోని అధికారులు
- రాజధాని గ్రామాలలో ఆగిన భూముల విక్రయాలు
- విజయవాడ పండ్ల మార్కెట్‌లో భారీగా కార్బైడ్‌తో పండిన పండ్లు తిని ప్రజలు ఆనారోగ్యానికి గురువుతున్నా పట్టించుకోని అధికారులు
- కోనసీమ రైల్వేలైన్‌కు జులైలో శంకుస్థాపన
- అమరావతి నిర్మాణంపై మాలేషియా ఆస్తకి
- విజయవాడ రైల్వే స్టేషన్లో ఉచిత వైఫై సేవలు
- 50 లక్షల మార్కు దాటిన ఈ - బ్రిక్స్
- రాజధాని ప్రాంతంలో తగ్గిపోతున్న నీటి నిల్వలు
- అమరావతిలో ప్రారంభం అవుతున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)
- ప్రపంచబ్యాంకును రూ.6,600 కోట్ల రుణం కోరిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
- నిర్మాణమవుతున్న ప్రకాశం బ్యారేజి దిగువ పనులు
- శరవేగంగా సాగుతున్న దుర్గ గుడి ఫ్లైవోవర్ పనులు
- తాత్కాలిక సచివాలయానికి సందర్శకుల తాకిడి
- నూతన రాజధాని గ్రామాల్లో తాగునీటి కష్టాలు
- తుళ్ళూరు మండల ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాల లేమి
- 21న బుద్ధ జయంతి
- జపాన్‌లో భూకంపం.. 10 మంది మృతి

### మొడియం శ్రీనివాసరావుకు.. ఎం.ఎల్.సి. షరీఫ్‌లకు
# మంత్రి వర్గ విస్తరణలో చోటు దక్కేనా...?

**అన్నంరెడ్డి సుబ్బారావు- రాజధాని ప్రతినిధి - కొయ్యలగుడెం :**

రాష్ట్ర మంత్రివర్గం విస్తరణపై జిల్లా ప్రజలలో ఆసక్తి, ఉత్కంఠ నెలకొంది. రాజకీయ పరిస్థితులను చర్చలను గమనిస్తే మంత్రి వర్గం విస్తరణలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న చంద్రబాబు తనయుడు నారా లోకేష్‌కు కేబినేట్‌లో చోటు, కీలక శాఖ ఖాయమని, పార్టీ ప్రముఖులు చెబుతున్నారు. 2014 జూన్ 8న ముఖ్యమంత్రి ఆయన కేబినేట్‌లోని మిగిలిన 19 మంది మంత్రులు పదవీ ప్రమాణం చేశారు. గడిచిన 22 నెలలుగా మంత్రి మండలి విస్తరణ జరగలేదు. గిరిజన సంక్షేమ శాఖ, ముస్లిం మైనారిటీల సంక్షేమం, వక్ఫ్‌శాఖలకు ఆయా వర్గాల నుంచి మంత్రులు లేరు. క్షత్రీయ సామాజిక వర్గం నుంచి కూడా మంత్రి వర్గంలో చోటు దక్కలేదు. కీలకమైన విద్యుత్, న్యాయం, పరిశ్రమలు, వాణిజ్యం, మౌళిక సదుపాయాలు, వాణిజ్య పన్నులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి ప్రధాన శాఖలకు మంత్రులు లేరు. దాదాపు అయిదారు ప్రధాన శాఖలు ముఖ్యమంత్రి అధీనంలోనే ఉండగా, మరికొన్ని ఇతర మంత్రుల అధీనంలో ఉన్నాయి. ప్రస్తుతం చంద్రబాబు కేబినేట్‌లో సి.ఎం.తో పాటు ఐదుగురు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు, నలుగురు కాపు సామాజిక వర్గం వారు, ఆరుగురు బి.సి. వర్గాలకు చెందినవారు, ఇద్దరు రెడ్డి సామాజిక వర్గం వారు ఉన్నారు. వైశ్య సామాజిక వర్గానికి చెందినవారు ఒకరు, ఎస్.సి. సామాజిక వర్గాల వారు ఇద్దరు రాష్ట్ర కేబినెట్‌లో ఉన్నారు.



మొడియం శ్రీనివాసరావుకు



ఎం.ఎల్.సి. షరీఫ్

రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్ర అసెంబ్లీలోని మొత్తం శాసనసభ్యుల సంఖ్యలో 15 శాతానికి మించకుండా మంత్రి మండలి కూర్పు ఉండాలని సీనియర్ ప్రజా ప్రతినిధులు, రాజకీయ పండితులు చెబుతున్నారు. ఆ విధంగా చూస్తే మంత్రి మండలిలో గరిష్ఠంగా మరో ఏగురుకి చోటు దక్కే అవకాశం ఉందని లెక్కలు కడుతున్నారు. లోకేష్‌కు మంత్రి పదవి ఖాయమైనట్లయితే మరో ఆరుగురుకి మంత్రి పదవీ అదృష్టయోగం పట్టవచ్చునని అంటున్నారు. రాష్ట్రంలోని ఎనిమిది ఎస్.టి. రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాలలో పశ్చిమగోదావరి జిల్లా పోలవరం ఎస్.టి. రిజర్వుడు నియోజక వర్గం ఒక్కదాని నుంచే అధికార తెలుగు దేశం పార్టీ అభ్యర్థి ఎం.ఎల్.ఏ.గా విజయ సాధించారు. మొడియం శ్రీనివాసరావు 15 వేల ఓట్ల అధిక్యతతో ఇక్కడ గెలపొంది తెలుగుదేశం పార్టీకి ఏకైక ఎస్టీ శాసనసభ్యుడుగా ఉన్నారు. తొలి మంత్రి వర్గం కూర్పులో ఆయనకు స్థానం దక్కవచ్చని జిల్లా వాసులు, పోలవరం నియోజకవర్గం ప్రజలు, గిరిజన సంఘాల వారు ఆశించారు. కానీ అప్పుడు వారి ఆకాంక్ష నెరవేరలేదు. త్వరలో జరిగే కేబినేట్ విస్తరణలో శ్రీనివాసరావు గిరిజన సంక్షేమ శాఖ దక్కే అవకాశం ఉందని షెడ్యూలు, తెగల సంఘాల నాయకులు ఆకాంక్షిస్తున్నారు. రాష్ట్రంలోని షెడ్యూల, తెగల, సంఘాల నాయకులు, ప్రతినిధులు అందరూ కలిసి కొద్ది నెలల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసి పోలవరం ఎం.ఎల్.ఏ. ఎం. శ్రీనివాసరావుకు మంత్రి వర్గ విస్తరణలో చోటు కల్పించాలని కోరినట్లు ఆ వర్గాల ప్రతినిధులు కొందరు చెప్పారు. ఎనిమిది ఎస్.టి. నియోజకవర్గాలలో ఒక్క నియోజక వర్గంలో మాత్రమే తెలుగుదేశం ఎం.ఎల్.ఏ. గెలిచారని, ఇక్కడ గెలిచిన శ్రీనివాసరావుకు కాకుండా ఎస్.టి. ఎం.ఎల్.సి.గా ఉన్న సుధారాణికి మంత్రి పదవిస్తే గిరిజనులలో అధికార పార్టీపై విశ్వాసం సన్నగిల్లే పరిస్థితులు ఏర్పడవచ్చునని గిరిజన సంఘాల నాయకులు చంద్రాబాబు దృష్టికి తీసుకువెళ్ళినట్లు చెబుతున్నారు. ఎం.ఎల్.ఏ. శ్రీనివాసరావుకు ఎ.పి. గిరిజన సంక్షేమ శాసనసభ కమిటీ చైర్మన్ పదవిని ఇచ్చినప్పటికీ గిరిజన వర్గాలలో సంతృప్తి కలగలేదని చెబుతున్నారు. ఇక ముస్లిం మైనారిటీ వర్గాల నుంచి తెలుగుదేశం పార్టీ తరపున ఎవరూ. ఎం.ఎల్.ఏలుగా గెలవలేదు. అందువల్లనే తొలి మంత్రి వర్గం కూర్పులో ముస్లింలకు చోటు దక్కలేదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నాటి నుంచి పార్టీ సభ్యుడిగా, సేవకుడిగా, పార్టీకి అత్యంత విశ్వసనీయుడిగా ఉంటున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ముస్లిం నేత ఎం.ఏ. షరీఫ్‌కు పార్టీ ఎం.ఎల్.సి. పదవిని ఇచ్చింది. ఇప్పుడు మంత్రివర్గం విస్తరణ జరిగితే షరీఫ్‌కే మంత్రి పదవి దక్కవచ్చునని జిల్లాకు చెందిన ముస్లిం వర్గాల వారు ఆశగా ఎదురు చూస్తున్నారు. దెందులూరు ఎం.ఎల్.ఏ., ప్రభుత్వ చీఫ్ విప్ చింతమనేని ప్రభాకర్‌రావుకు, క్షత్రియ సామాజికవర్గానికి చెందిన ఉండి. ఎం.ఎల్.ఏ. కలవపూడి శివకు కూడా మంత్రి వర్గ విస్తరణలో చోటుదక్కవచ్చని జోరుగా చర్చలు జరుగుతున్నాయి. మంత్రి వర్గ విస్తరణలో షరీఫ్‌కు, శ్రీనివాసరావుకు ఇద్దరికి చోటు దక్కితే, ప్రస్తుతం ఉన్న ఇద్దరు మంత్రులతో కలిపి జిల్లాలో నలుగురు మంత్రులు అవుతారు. అలా ఒకే జిల్లాకు ఏకంగా నాలుగు మంత్రి పదవులు ఇస్తారా అనే అంశంపై కూడా పార్టీ సీనియర్ నాయకులు తర్కించుకుంటున్నారు. ఏమో.. ఏమైనా జరగవచ్చు.. ఎలాగైనా జరగవచ్చునని అధికార పార్టీ వర్గాలలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి.

# ఉప సభాపతి
## మండలి బుద్ధ ప్రసాద్



"కొందరు పదవులకోసం ప్రయత్నాలు చేస్తుంటారు. కొందర్ని పదవులే వెదక్కుంటూ వస్తాయి" మండలి బుద్ధప్రసాద్‌ని కూడా పదవులే వెదక్కుంటూ వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా బుద్ధప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనల మేరకు జూన్ 19వ తేదీ సాయంత్రం బుద్ధప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారు. ఉపసభాపతి పదవికి దాఖలైన దరఖాస్తు ఒక్కటే కావటంతో జూన్ 23న ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సభాపతి ప్రకటించారు.




### ఏప్రిల్ 16 నుంచి 24 వరకు విభిన్న రుచులు ఆస్వాదించే
# భోజన ప్రియులకు గేట్‌వేలో విందు

**రాజధాని ప్రతినిధి- విజయవాడ :** విభిన్న రుచులు ఆస్వాదించే ఆహార ప్రియులకు దక్షిణ భారత వంటకాల చెఫ్ మణికొండన్ గేట్‌వేలో నోరూరించే వెజ్, నాన్‌వెజ్ రుచులను పరిచయం చేస్తున్నారు. చెన్నైకు చెందిన చెఫ్ అందించే..

స్టార్టర్స్ : కీరాయ్ వడాయ్, మసాల పునుగులు, ఫ్రైడ్‌ఉర్గాపొడి ఇడ్లీ, మిరపకాయ్ బజ్జీ, కోరి ఫీ రోస్టు, కనేకెంపు, కోడికైమ ఉండలు, కర్యారి మీన్ వరివల్

**సూప్స్ :** కీరాయ్ వడాయ్, తక్కలీ తులసీ చారు, చిట్టినాడ్ నందు రసం, నాటుకోడి రసం, విరుదునగర్ కర్రీ చారు, నందు రసం,

**వెజ్ :** ఎన్నాయ్ కత్రికాయ్ కొజంబి, ఉరియల్ రోస్టు, మిరపకాయ మొక్కజొన్న ఇగురు, పిల్లజొన్న మిర్యాలు

5 లో

# రాజధాని వార్తలు
కలం

## ఇదే నా నివాళి...?

అంబేద్కర్‌ను ఆకాశానికి ఎత్తని రాజకీయ నాయకుడు లేరంటే అతిశయోక్తికాదు. ఆయన 125 వ జయంతి ఉత్సవాల సందర్భంగా అధికార, రాజకీయనాయకుల హడావుడి అంతా ఇంతా కాదు. ప్రధాని నరేంద్రమోడీ ఏడాది పొడవునా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు జరుపుతామని వాగ్దానం చేయగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి 125 అడుగుల ఎతైన విగ్రహం ఏర్పాటును ప్రస్తావించారు. నిజానికి ప్రపంచ వ్యాప్తంగా జాతుల పట్ల ప్రదర్శిస్తున్న వివక్షలకు సరైన సమాధానం బాబాసాహెబ్ ఆలోచనా విధానం, అందుకు తగ్గ రాజ్యాంగ రచన. అందువల్ల దీన్ని రచించిన బాబాసాహెబ్‌ను మన దేశనాయకులు ఎప్పుడో ప్రపంచ దేశాలకు పరిచయం చేయాల్సి ఉండాల్సింది.. అయితే ఆయా వర్గాలను ఓట్ల బ్యాంకులుగా చూస్తున్న మన రాజకీయం నాయకులు సంకుచితంగానే వ్యవహరించారని చెప్పక తప్పదు. అయితే వారంతట వారేతెలుసుకొని ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ వర్సిటీలు ఆయన125 జయంతి ఉత్సవాలను నిర్వహించడం ముదావహం. కాగా అధునాతన సమసమాజ నిర్మాణ దార్శనికుడి స్ఫూర్తిని నింపుకొని భరత జాతిని జాగృతం చేసి ఒకే జాతిగా రూపొందించే చర్యలు భారత ప్రభుత్వం ఇంతవరకు ప్రకటించక పోవడం విచారకరం. దళితులపైనా, మైనార్టీల పైనా దేశవ్యాప్తంగా దాడులు జరుపుతుంటే, వారంతా తీవ్రమైన అభద్రతాభావానికి గురవుతున్నారు. వారికి భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం వారి ఆహార నియమాలపై వేశభాషలపై నిరంతరం వ్యాఖ్యానాలు చేస్తూన్నా పెదవి విప్పడం లేదు. అణగారిన, అల్పసంఖ్యాక వర్గాల దేశభక్తికి అనుక్షణం పరీక్షకు గురిచేస్తూ వారిమాటే చెల్లుబాటు చేసుకుంటున్నవారిని కట్టడిచేసిన పాపాన పోలేదు. ప్రశ్నించిన వారిని పరదేశం పొమ్మని రాచిరంపాన పెడుతున్నవారిని ఒక్కమాటైనా అనకుండా ఏనిముషం ఏమి జరుగుతుందోనన్న భయకంపితుల్ని చేస్తున్న ప్రభుత్వాలు ఆ మహాత్ముడిని నోటి మాటలతో, ఆర్భాటాలతో స్తుతిస్తున్నాయి కాని ఆయన మార్గానికి, ఆదర్శాలకు బహుదూరంగా ఉన్నాయనటానికి ఇదే నిదర్శనం.. మహిళల హక్కుల కోసం ఆయన హిందూకోడ్ బిల్లు ప్రవేశపెడితే లోకసభలో ఆ బిల్లు పాస్ కావక పోవడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. కాని అనేక సంవత్సరాలుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు మాత్రం ఎన్నేళ్లయినా అలాగే పడిఉంది. రాష్ట్రంలో దళితులను ఉన్నత వర్గాలు ఊచకోత కోస్తే , అనేక సంవత్సరాలు కోర్టుల్లో తిరిగినా పేదల పక్షాన న్యాయం నిలువలేదు. ఈ నేపథ్యంలో హైకోర్టు కేసును కొట్టివేయగా, సుప్రీంకోర్టుకు ప్రభుత్వం అప్పీలు చేయడానికి ఎన్నో ఆందోళనలు చేపట్టవలసి వచ్చింది. ఈ దేశంలో దళితుడిగా పుట్టటమే ఒక శాపం అంటూ తన ఆశల్ని కలల్ని అకస్మాత్తుగా అంతం చేసుకొని ఈ లోకం నుంచి వెడలిపోతే ఈ ప్రభుత్వాలు సానుభూతిని కూడా చూపలేదు. అందరూ చదువుకోవాలి. చదువుతోనే అభివృద్ధి, అజ్ఞాన తొలగింపని అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు పెడితే... డబ్బున్న మారాజులంతా వారి పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపి ఉన్న స్కూళ్లను మూసివేత దిశగా నడుపుతున్నారు. అంతేకాదు సాక్షాత్ ముఖ్యమంత్రి చదివితే ఉన్నత ప్రమాణాలు కలిగిన ప్రైవేటు స్కూళ్లలో చదవాలి. ప్రభుత్వ స్కూళ్ల మురికి బుద్ధులే వస్తాయంటూ సెలవిచ్చారు. మరి ఆయన చదివిన పాఠశాల ఏదో...మరొక సందర్భంలో ఎవరైనా దళితుడిగా పుట్టాలనుకుంటా అన్నారు. అంటే ఏమిటి ? వీరి మనస్సుల్లోనే అసమానతలు ఉన్నప్పుడు ప్రజల్ని వీరు ఎలా మార్చగలుగుతారు? రాజధాని ప్రాంతంలోని ఎసైన్డ్ భూములు కేవలం దళితులకు మాత్రమే చెందాల్సి ఉంది. అయితే దానికి కూడా సవరణలు చేసి లంకభూములను కూడా ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసే విధంగా మార్పులు చేయడం గమనించదగ్గ విషయం. సోషలిస్టు, సామ్యవాద, ప్రజాస్వామ్య పద్ధతులు ప్రస్తుత రాజకీయ నాయకుల్లో కొరవడ్డాయి. బూజుపట్టిన మనువాద సిద్ధాంతాలను నేటి పాలకులు మళ్లీ తెరపైకి తెస్తున్న విషయం తెలియందికాదు... బ్రాహ్మణవాదం, పెట్టుబడీ విధానానికి అంబేద్కర్ బద్ధ శత్రువు. అవి రెండూ సామ్యవాదానికి వ్యతిరేకంగా ఆయన పరిగణించేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వాలు పెట్టుబడీ విధానానికి పెద్దపీట వేస్తూ ఆయన ఆశయాలతూట్లు పొడుస్తూ ఏడాది పొడవునా జయంతి ఉత్సవాలు జరపడం, ఆయనకు 125 అడుగుల విగ్రహం నెలకొల్పడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి అవుతుందా ?

విజ్ఞులంతా దీనిపై ఆలోచించాలి... నిబద్ధత గల రాజకీయనాయకులు ఈ దేశ సార్వభౌమత్యం కోసం, ప్రగతికోసం ఆయన ఆశయాల సాధనకోసం కృషిచేయాలి. 125 కోట్ల మంది ప్రజలను సంపూర్ణ భారతీయులుగా తయారు చేయడమే మనముందున్న కర్తవ్యం. అదే మనం అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి.

## పూడిక తొలగింపుతో భూగర్భ జలవనరులు అభివృద్ధి

### ఎం.ఎల్.ఏ. మొడియం శ్రీనివాసరావు

**అన్నంరెడ్డి సుబ్బారావు -రాజధాని ప్రతినిధి- కొయ్యలగూడెం :** చెరువులలో పూడిక తొలగించడం వల్ల భూగర్భజలాలు వృద్ధి చెంది, వర్షాలు కురుస్తాయని పోలవరం ఎం.ఎల్.ఏ. ఎం.శ్రీనివాసరావు అన్నారు. కొయ్యలగూడెం యర్రంపేట- సంత చెరువులో నీరు -చెట్టు పథకంలో పూడిక పనులను ఉగాది రోజున ఆయన ప్రారంభించారు. రూ.9.80 లక్షలు నిధులు సంత చెరువులో పూడికతీత పనులకు మంజూరైనట్లు ఆయన చెప్పారు. జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు చింతల వెంకటరమణ, పోలవరం ఎ.ఎం.సి. చైర్మన్ పాదేపల్లి రామారావు, స్థానిక సర్పంచ్ గన్నమని కిరణ్మయి, అధికారి పార్టీ నాయకులు గన్నమని సాయిబాబు, మార్ని శ్రీను, గన్నమని రామ్మోహనరావు చెరుకూరి గోపాలరావు పాల్గన్నారు.

## విద్యుదాఘాతంతో గృహిణి మృతి

**రాజధాని ప్రతినిధి :** తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతానికి గురై షేక్ షాజిదా బేగం అనే గృహిణి మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు దిగ్భ్రాంతికి గురైనారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాజిదా బేగం మృతితో ఆమె భర్త, పిల్లల రోదనలు స్థానికులను కలచివేసింది.

## రాజధాని గ్రామాలలో పశుగ్రాసం కొరత

**రాజధాని ప్రతినిధి :** రాజధానిని ప్రకటించిన తర్వాత భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు వాటిని సాగు చేయకపోవడంతో, పంట భూములు బీడువారుతున్నాయి. ఈ క్రమంలో తీవ్రమైన ఎండ వేడి వలన పంట భూముల సాగు జరగక పశువులకు పచ్చిగడ్డి కరువైంది. రాజధాని గ్రామాలలో పశువులు పచ్చిమేత లేక అస్థి పంజరాలుగా మారుతున్నాయి. ఈ గ్రామాలలో ఒకప్పుడు పంట భూముల్లో తిరుగుతూహాయిగా జీవనం సాగించిన పశువులకు ఆహారం కరువైంది. గ్రామాల్లో వేల సంఖ్యలో ఉన్న పశువులను ఏం చేయాలో తెలియక రైతులు పశువులని అమ్ముకుంటున్నారు. పాడి పంటలపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉంది. పశువులకు మేత లేక పాలు సరిగ్గా ఇవ్వక పాడి పశువులపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

## మీ ఆరోగ్యం - మీ చేతుల్లో

### ఆరోగ్యానికి, డాక్టర్‌కి ఉన్న సంబంధం

ఆరోగ్యం


డా॥ మంతెన సత్యనారాయణ రాజు

"ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్" అంటారు. అంటే రోగం వచ్చాక తగ్గించుకునే దాని కంటే రోగం రాకుండా ముందే జాగ్రత్తగా ఉండటం మంచిదని దాని అర్థం. రోగమంటూ ఒక్కసారి వచ్చిందంటే ఆరోగ్యంగా బతకడమే మార్గం ఆరోగ్యంగా బతకడానికి డాక్టర్‌తోగానీ, హాస్పిటల్‌తోగానీ, పనిలేదు. జంతువులన్ని ఆరోగ్యంగా జీవిస్తున్నాయి. అవి ఆ ఆరోగ్యాన్ని పొందడానికి ఏ వైద్యుల సహాయం, ఏ హాస్పిటల్ సహాయం తీసుకుంటున్నాయి? ఈ వాస్తవం తెలియక చాలామంది ఇష్టం వచ్చినట్లు అన్నీ తినడం, తాగడం చేసి, ఏదన్నా రోగం వస్తే వైద్యం చేయడానికి వైద్యులున్నారు కదా అనుకుంటూ, ఆరోగ్యాన్ని చేతులారా పాడుచేసుకుంటూ ఉంటారు. అసలు ఆరోగ్యనికి, డాక్టర్‌కు ఆరోగ్యానికి, హాస్పిటల్స్‌కు సంబంధం ఉంటుందా? లేదా? అని ఆలోచిస్తే అసలు డాక్టర్‌కి ఆరోగ్యానికి సంబంధం లేదు. అనారోగ్యంతో ఉన్నవారే డాక్టర్‌ను సంప్రదిస్తారు. రోగిని బాధిస్తున్నా పూర్తిగా ఆ బాధ పోనప్పటి నుండి మళ్ళీ ఏ బాధ రానంతకాలం మనం డాక్టర్ ముఖం చూడం. ఒకసారి బాధలు వచ్చి తగ్గాక, మీరు ఇంటివద్ద ఏమని ప్రార్థిస్తుంటారో తెలుసుకదా! దేవుడా! నేను జీవితంలో హాస్పిటల్ పాలుకాకుండా, డాక్టర్ల చుట్టూ తిరగకుండా ఆరోగ్యంగా, చల్లగా ఉండేటట్లు చూడు తండ్రీ.. నీ కొండకు నడచి వచ్చి మరీ గుండు కొట్టించుకుని, హుండీలో లక్షరూపాయలు (డాకట్టర్లకు ఇచ్చేబదులు నీకే) వేస్తానని ప్రార్థిస్తుంటారు. నిజానికి డాక్టర్లు, హాస్పిటల్స్ ఆరోగ్యాన్ని ఇచ్చేటట్లయితే మీరు హాస్పిటల్స్‌కి, డాక్టర్ల వద్దకు వెళ్ళేట్లు చేయి దేవుడా, డాక్టర్లకు లక్షలిస్తానని ప్రార్థించడం చేయాలి. రోగికి పూర్తి ఆరోగ్యం డాక్టర్ల వల్ల, హాస్పిటల్స్ వల్ల రాదని వైద్యులందరికీ తెలుసు. ఈ విషయం ప్రజలకే తెలియడం లేదు. ఆరోగ్యం అనేది డాక్టర్ల చేతిలో ఉన్నదనే అపోహల్లో ఉంటున్నారు. నాలుగు లక్షలు బ్యాంక్‌లో డిపాజిట్ చేసుకుంటే ఆరోగ్య రక్షణకు అది సరిపోతుందనుకుంటున్నారు. ఆరోగ్యమనేది ఒకరు ఇస్తే వచ్చేది కాదు, మనం పుచ్చుకునేది కాదు, డబ్బులు పోసి కొనుక్కునేది అంతకంటేది కాదు. అలా వైద్యులు ఆరోగ్యాన్నిచ్చేవారైతే, మనకు ఇవ్వకపోతే ఇవ్వకపోయారు, కనీసం డాక్టర్ అని నమ్ముకొని ఆయన్ని పెళ్ళి చేసుకున్నందుకు వాళ్ళ ఆవిడకు ఆరోగ్యం ఇవ్వగలుగుతున్నారా? లేదే! అందాకా ఎందుకు, వాళ్ళ సొంతానికైనా పూర్తి ఆరోగ్యాన్ని ఆ మందులు, హాస్పిటల్, వైద్యశాస్త్రం వల్ల అందించుకోగలుగుతున్నారా? అదీ లేదే! చివరికి వాళ్ళకి బి.పి.లు, షుగర్‌లు, కీళ్ళ నొప్పులు, గుండెజబ్బులు వస్తూనే ఉంటాయి కదా! పైగా షుగర్ స్పెషలిస్టుగా పనిచేస్తూ ఎన్నో వేలమందికి షుగరు రోగానికి ఉపశమనాన్ని కలిగించే డాక్టర్‌గారి కన్నా ఆ జబ్బు రాకుండా ఏమన్నా ఉంటున్నదా అంటే, శుభ్రంగా వచ్చేస్తున్నది. మరి వారి కుటుంబాలకే ఆరోగ్యం గ్యారెంటీ లేనప్పుడు మరి మీకెవరిస్తారు? అందుచేత ఆరోగ్యం అనేది డాక్టర్లు ఇచ్చేదికాదు. వారు ఇచ్చేది రోగాల నుండి ఉపశమనము లేదా విముక్తి మాత్రమే. ఆరోగ్యం ఇంకొకరు ఇచ్చేది కాదని ఇప్పటికైనా తెలిసింది కదా! మరి మన ఆరోగ్యం ఎవరి చేతుల్లో ఉందో తెలుసుకుందాము.

5. వైద్య విధానాల వల్ల మేలు

హాస్పిటళ్లు పెరగటం అనాగరిక లక్షణం అని మహాత్మాగాంధీ అన్నారు. అయినా అవి పెరుగుతూనే ఉన్నాయి. అవి ఇలా పెరగడానికి కారుకులెవరు అంటే, మనమే. మనకు శరీరంపై సరైన అవగహన లేక, సరైన నియమాలు పాటించక ఆరోగ్యాన్ని చేతులారా పాడు చేసుకుని అనేక రకాల రోగాలతో అవస్థలు పడుతున్నాము.

ఈ అవస్థల నుండి రక్షించడానికి వివిధ వైద్య విధానాలు కనిపెట్టారు. మనము ఎంతెంత ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటూ ఉంటామో అంతంత వైద్య విదానాలు, వైద్యులు పెరుగుతూ ఉంటాయి. మన మన ఆరోగ్యము ఎంతగా దిగజారి పోయిందంటే ఎన్ని ఆధునిక పరికరాలు, మందులు కనిపెట్టినా, ఎంతమంది మేధావు లైన డాక్టర్లు మనమీద తమ వైద్యాన్ని ప్రయోగి స్తున్నా లంగనటువంటి మొండిరోగాలు మనలో రోజు రోజుకి ప్రత్యక్షమవుతున్నాయి.

వారు ఎంత చేసినా ఒక రోగం తగ్గి ఇంకొక రోగం వస్తూనే ఉంటుంది. అందుకే అన్ని రోగాలు చూడటం ఒకరితరం కాకపోయేసరకి ఒక్కొక్క జబ్బుకి కొంతమంది స్పెషలిస్టులు తయారవ్వాల్సి వచ్చింది. షుగరు స్పెషలిస్టు, గుండె స్పెషలిస్టు, నరాల స్పెషలిస్టు వగైరా వగైరా. కొన్ని సంవత్సరాల క్రితం వరకూ మామూలు డాక్టర్లుకు తగ్గని రోగం స్పెషలిస్టు దగ్గరికి వెళ్తే తగ్గి బాగుపడి వచ్చేవారు. ఇపుడు సందు సందుకీ ఒక స్పెషలిస్టు వచ్చినా రోగుల సంఖ్య తగ్గడం లేదంటే ఎవర్ని అనుకోవాలి? రోగుల్ని డాక్టర్లు తయారు చేయడం లేదు కదా.

( మిగాత వచ్చేవారం )

స్వస్తిశ్రీచాంద్రమానేన శ్రీ దుర్ముఖినామ సంవత్సరం

## నాడీ జ్యోతిష్యం

12 రాశుల ఫలితాలు
**ఏప్రిల్ - 17 - 23**

ఆకుల వేణునాథ్ సిద్ధాంతి
cell : 9032450197

**మేషరాశి :** 07 నుండి 13 సం॥ వయస్సువారికి - విద్యాభ్యాసం బాగుంటుంది.. దైవభక్తి క్రియల్లో తాతగారి నైపుణ్యం కనపడుట, బాలికలకు అమ్మమ్మ నాయనమ్మ తేజం కనిపించుట. భవిష్యత్‌కు ఆలోచనలు, అదృష్టం వరించుట. అధైర్యం ఉన్న ఆత్మస్థిరంతో బాలబాలికలు అనుకూలిచుకొనుట.

**వృషభరాశి :** 14 నుండి 20 సం॥ వయస్సువారికి ఆందోళన, ఆతురత, టెన్షన్స్, మాటలగారడీ, సాంకేతికంగా పనులు నిర్వహించుట. ఆర్థిక విషయాలపై ఎక్కువ ఆలోచించి భవిష్యత్ పునాదులు వేయుట. బాలికలు ఆత్మస్థిర్యంతో నిదానంగా ఆలోచించి గురి పులించుట. ప్రభుత్వ ఉద్యోగాలు అధికారుల వల్ల దైవక్రియలు వల్ల వ్యవహార జయం లాభించుట, శుభకార్యములు.

**మిధునరాశి :** 21 నుండి వయస్సు వారికి అనేక మానసిక టెన్షన్స్. తద్వారా మాయోప వేషధారణ. శత్రు,రుణ రోగ భయంలేదు అన్న మాటే కాని అన్ని రకాలుగా. వ్యతిరేకతలు. గిల్లి గిల్లించు కొన్నంత పని. స్త్రీలు మాత్రం నిదానం, రహస్యం, గుమ్మనంగా ఉండుట. ప్రతి కార్యములు సాధించుకొనుట. ప్రభుత్వ అధికారులు బంధుమిత్రులు అండదండలతో అంతా సంతోషంగా ఉండుట.

**కర్కాటకరాశి :** 27 నుండి 32 సం॥ వయస్సువారికి వివాహాది శుభకార్యములు వల్ల లాభములు. శత్రు, రుణ, రోగ భయం లేకుండుట. పైకి మానసిక టెన్షన్స్ ఉన్నప్పటికీ గుండె నిబ్బరం చేసుకొని ఆత్మస్థైర్యంతో వ్యవస్థలో అందరూ అనుకూలించుకుంటూ తమస్థితి తాము తెలుసుకొని గుమ్మనంగా ప్రతి కార్యములు సాధించుకొని ప్రశాంత తంగా ఉందురు.

**సింహరాశి :** 33 నుండి 39 సం॥ వయస్సువారికి అన్నిరకముల సర్వసుఖ సంపద. గృహ,వాహన అదృష్ట లాటరీ యోగంలా జీవితం భార్యాభర్తలకు అన్యోన్యదాంపత్య సుఖశాంతులు అనుభవించెదరు. పురుషులు పౌరుషం, స్త్రీలు గుమ్మనం, నిదానం రహస్యం చాకచక్యంతో కుటుంబ సుఖశాంతులు పొందుట. నిల్వధనప్రాప్తి, అంతర్గత: సంతృప్తి చెందుదురు.

**కన్యరాశి :** 40 నుండి 45 సం॥ వయస్సువారికి బంధుమిత్ర సపరివారంతో విరోధములు. తద్వారా లేనిపోని అపనింద అవగాహన భంగములు. తల్లి తండ్రుల విరోధము..మాయ మోసము గురి అగుట. అత్మస్థైర్యంతో జీవనపోరాటం చేసి నిలబడుట. కొన్ని సందర్భములలో సంతానం వ్యతిరేకతలు స్వార్థంతో కొంత పౌరుషంతో ఉండవచ్చు.

**తులరాశి :** 46 నుండి 52 సం॥ వయస్సువారికి. అన్ని విధాలుగా సుఖ శాంతులు. ఒక్కొక్కరికీ అవినాభావ సంబంధములతో శుభ దర్శ కార్యాచరణములు చేయుట. గుమ్మనంగా, నిదానంగా రహస్యంగా అందరూ అన్ని రకముల కార్యములు నేరవేర్చుకొనుట. స్త్రీలకి అనుకూలతలు. ఎక్కువ పురుషులకు కృషితో నాస్తి దుర్భిక్షం. భార్య అనుకూలతలను బట్టి సంతోషము.

**వృశ్చికరాశి :** 53 నుండి 58 సం॥ వయస్సువారికి కుటుంబంలో చికాకులు. భార్యాభర్తలకు ఆందోళన, టెన్షన్స్ ఆతురతతో తడపాటు, నిర్ణయాలు అంతా బాగుంటే బంధుమిత్ర సపరివారంతో విరోధములు. ఆర్థిక పరిస్థితుల కోసం అందరి పోరాటం. మే స్త్రీలకు ప్రయోజనాలు ఎక్కువ. పురుషులకు మిశ్రమ ఫలితాలు. అంతర్గత: అందరు ఆకుర్షించుకొనుట.

**ధనస్సురాశి :** 59 నుండి 65 సం॥ వయస్సువారికి నిల్వధనం. దైవభక్తి దానధర్మక్రియలు, ప్రతిఒక్కరినీ ఆత్మస్థైరంతో కుటుంబ వ్యవస్థని కాపాడుకొనుట. మాట చలామణితో వ్యవహారాలు సర్ధుబాటు చేయుట. చిన్నచిన్న అవకతవకలు ఉన్న పెద్దవారు తాత ముత్తాతల గుర్తుపెట్టుకుని గౌరవించి సర్ధుమణుగుట వల్ల సంతోష జీవితము.

**మకరరాశి :** 66 నుండి 72 సం॥ వయస్సువారికి ఆరోగ్య విషయంలో ఆందోళన, ఆతురతతో పాటు, పొత్తికడుపు, హెడ్ పవర్ బలహీనం, దృష్టిలోపం అంతర్గత:లో శరీరం ఆరోగ్య లోపం, దైవభక్తి దాన ధర్మక్రియల వల్ల కొంత ఉపశమనం. నకశిఖ పర్యంతం శరీరం అంతా దోషం. ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యం కాపాడుకొనుట. పురుషులకు బలహీనం. స్త్రీలకు కొంతమందికి ఉపశమనం.

**కుంభరాశి :** కుటుంబ వ్యవస్థలలో చేయువృత్తి యందు ప్రతి విషయంలో తల్లి తండ్రీ సలహాలు తీసుకొని ప్రతి ఒక్కరి అండదండలతో గుట్టుగా రహస్యంగా మెత్తగా ఎంత టెన్షన్స్ ఉన్నప్పటకీ సర్వ కార్యాలు చక్కదిద్దుకొనుట. కొన్ని సందర్భములలో అంతర్గత: భయం ఉన్నప్పటికి నోటి చలామణితో కార్యనిర్వహణ చేయుదురు.

**మీనరాశి :** స్త్రీలు ధైర్యసాహసాలు ప్రకటించుట. అంతర్గత: భార్యాభర్తలు నిల్వధనం, సంతృప్తి, పురుషులకు మానసిక టెన్షన్స్. స్త్రీలకు సంతాన విషయంలో చికాకులు. తల్లి తండ్రులకు భూ సంబంధమైన సోదర, బంధుమిత్రుల వల్ల సమస్యలు ఉంటాయి. వ్యక్తి ఎలా ఉన్న అంతర్గత: ప్రతి విషయంలో చికాకులే. నిదానంగా కార్య సానుకూలతలు పొందుదురు.

### రాజధానిని

## చట్టప్రకారం నిర్మించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రచురించి, సర్వేనెంబర్ల సరిహద్దులను మార్కింగ్ చేయాలి. అయితే ఇది పారదర్శకంగా జరగలేదు. రైతులకిచ్చే ప్లాట్ల రేట్లు కోట్లలో ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇది కేవలం ఊహాజనితం మాత్రమే..రైతులకు ఇంచుమించుగా 2.50 లక్షల ప్లాట్లు రావాల్సి ఉంది. ప్రభుత్వం అభివృద్ధికి తీసుకున్న భూమిలో కార్యాలయాలు, ఉన్నత భవనాలు నిర్మించి వారు వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటారు... ఇది రైతులకు పిడుగుపాటు...

**ప్రశ్న : ఎందుకు అలా అంటున్నారు ?**

**జవాబు :** రైతులు ఇచ్చిన రెండు పంటల భూములకు ఏడాదికి రూ.30 వేలు, జరీభూములకు రూ.50 వేలు ఇస్తున్నారు. ఈ డబ్బులతో రైతుల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు తమ ప్లాట్లలో కట్టడాలు నిర్మించడం అసాధ్యం.. అంతేకాకుండా అప్పటికి ఏజెన్సీలు చట్టబద్ధంగా విధించే యూజర్ చార్జీలను భరిస్తూ ప్రభుత్వం రైతులకిచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేసుకోవడం జరగని పని.

**ప్రశ్న : ఎసైన్డ్ ల్యాండ్ కలిగిన రైతుల పరిస్థితి ఏమిటి ?**

**జవాబు :** ఎసైన్డ్ ల్యాండ్ ప్రభుత్వం తీసుకోదలిస్తే 2014లో కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సాధారణ రైతులకు ఇచ్చే పరిహారాన్నే ఇవ్వాల్సి ఉంది.

**ప్రశ్న : సింగపూర్ కంపెనీలు రాజధాని నిర్మాణం చేపట్టేముందు కేంద్రం నుంచి కోరుతున్న హామీ మాటేమిటి ?**

**జవాబు :** రాష్ట్ర పునర్విభజన చట్టంలో భాగంగా నిధులు ఇస్తాం కాని ఎటువంటి హామీలు ఇవ్వమని కేంద్రం స్పష్టం చేసింది.

**ప్రశ్న : సింగపూర్ కంపెనీ కన్‌స్ట్రక్షన్లు లాభదాయకమేనా ?**

**జవాబు :** సింగపూర్ కంపెనీలు రాజధాని నిర్మాణం చేసి పోర్టులను అభివృద్ధి చేస్తే ఆయా దేశాలకు సరకులు ఎగుమతి దిగుమతుల ద్వారా సుంకాలు గణనీయంగా రాబట్ట వచ్చు. దాన్ని మనం మౌలిక సదుపాయాల కోసం, ప్రజోపకార్యాల కోసం వినియోగించవచ్చు. అయితే వీటిన్నింటిపై సమగ్ర చర్చ అవసరం. ప్రభుత్వం ఒంటెత్తు పోకడను విడనాడి అందరినీ కలుపుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ప్రశ్న : రైతులకు ప్లాట్ల కేటాయింపుపై మీ అభిప్రాయం ?**

**జవాబు :** ఢిల్లీలో పొలాలను ఇచ్చిన రైతులకు 60 శాతం, ప్రభుత్వానికి 40 శాతం భూమిని కేటాయించడం జరిగింది. ఈ లావాదేవీల కోసం ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం ఢిల్లీ డెవలప్‌మెంట్ సంస్థను ప్రారంభించారు. మన ప్రభుత్వం కూడా ఇలాంటి సంస్థను ప్రారంభిస్తే పారదర్శకంగా ఉంటుంది.

**ప్రశ్న : సీఆర్‌డీఏ యూజర్ చార్జీలు విధిస్తుందా ?**

**జవాబు :** సీఆర్‌డీఏకి యూజర్ చార్జీలు విధించే అధికారంలేదు. అలాగే స్థానిక సంస్థలు కూడా తమ అధికారాల్ని కోల్పోతాయి. ఒక విధంగా చెప్పాలంటే రాజధాని ప్రాంతంలో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడుతుంది. రాజధానిని నిర్మించిన సంస్థలే గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తాయి.

**ప్రశ్న : రైతుల పరిస్థితి ఏమిటి ?**

**జవాబు :** చిన్న సన్నకారు రైతులు ప్లాట్లు అభివృద్ధి చేసుకోలేక అమ్ముకు పోతారు. నిజానికి ఇది ధనవంతుల రాజధానిగా మారిపోబోతోంది.

**ప్రశ్న : మాస్టర్ ప్లాన్ ఏ విధంగా ఉంది ?**

**జవాబు :** మాస్టర్‌ప్లాన్‌లో పార్కులకు, ఆటస్థలాలకు, 10 శాతం, రోడ్లకు 30, సామాజిక మౌలికసదుపాయాలకు 5 శాతం, పేదల ఇళ్లకు 5 శాతం షెడ్యూల్ 4 ప్రకారం ఇస్తామన్నారు. కాని పేదలకు ప్రభుత్వం కట్టి ఇవ్వవలసిన ఇళ్ల కేటాయింపులకు స్థలాల కేటాయింపు జరగలేదు.

**ప్రశ్న : 75 లక్షల మందికి ఆవాసంగా రాజధాని నగరం అభివృద్ధి చేస్తామంటున్నారు...అంతటి మౌలిక సదుపాయాలు ఉంటాయా ?**

**జవాబు :** నిజానికి ఇక్కడ నీటి సౌలభ్యత తక్కువే అని చెప్పాలి. 75 లక్షల మందికి 30 టీఎంసీల నీరు కావాలి. మనం నాగార్జున సాగర్ 180 టీఎంసీల నీటిని నాగార్జున సాగర్‌నుంచి డెల్టాకు కేటాయిస్తారు. దీనిలో 100 నుంచి వర్షపునీరు కాగా, 80 సాగర్ డ్యాం నుంచి వస్తుంది. వర్షాలు పడకపోతే ఈ కేటాయింపులు కష్టం. ముఖ్యమంత్రి ఈ సమస్యను పరిష్కరించేందుకు గోదావరి,కృష్ణానదులను అనుసంధానం చేస్తామంటున్నారు. అలా అయితే బ్రజేశ్, బచావత్ ట్రిబ్యునల్స్ ప్రకారం మనం సరిహద్దు రాష్ట్రాలకు నీటిని ఇవ్వవలసి ఉంటుంది. కాబట్టి అదీ కష్ట సాధ్యం.

**పశ్న : ప్రభుత్వ నోటిఫికేషన్ తర్వాత పొలాలు అమ్ముడైపోయాయి అది సరైన పద్ధతేనా ?**

**జవాబు :** నిజానికి రాజ్యాంగాలోని 31ఏ ప్రకారం ల్యాండ్ ఎక్విజేషన్ జరగాలి. అయితే అలా జరగలేదు. ఇక్కడ ప్రభుత్వానికి భూములిచ్చిన రైతుల కంటే ఎక్కువ మంది రియల్టర్లే ఉన్నారు. అలాగే నోటిఫికేషన్‌తో పాటు ప్రభుత్వం ప్లాన్ కూడా ఇవ్వాలి. అదేమీ జరగలేదు.

**ప్రశ్న : నిజానికి ఈ ప్రాంతం భూకంప ప్రాంతం అన్నారు, అలాగే పంట భూముల్లో భారీ కట్టడాలకు అనువుగా ఉంటుందా ?**

**జవాబు :** ఈ ప్రాంతంలో భూకంప తీవ్రత 3వ రేంజ్‌లో ఉందిని రామకృష్ణ కమిటీ హెచ్చరించింది. అలాగే ఇక్క డి భూమి లూజుగా ఉండటంతో కట్టడాలకు బీటలు వారడం మామూలే... కాగా మన ముఖ్యమంత్రి టెక్నాలజీ పెరిగింది పటిష్టంగా ఉంటుంది, అనుమానాలకు తావు ఇవ్వద్దు అంటున్నారు. నిజానికి ప్రకృతికి అన్నిసార్లూ సాంకేతికతే సమాధానం కాదు... ముందు జాగ్రత్తతో వ్యవహరించవలసిన అవసరం ఉంది.

**ప్రశ్న : తాత్కాలిక సచివాలయ భవనం జూన్‌కు పూర్తవుతుందా ?**

**జవాబు :** యుద్ధ ప్రాతిపదికన కట్టినా భవన ఆకారం మాత్రమే పూర్తవుతుంది. లోపల ఇంటీరియల్ పనులకు చాలా సమయం తీసుకుంటుంది. ప్లాస్టింగ్ , అల్మరాలు, వైరింగ్, ఫ్లోరింగ్ సమయం ఎక్కువ తీసుకుంటుంది... ఒకసారి ఉద్యోగులు పనికి ఉపక్రమించిన తర్వాత ఈ పనులు చేయడం కుదరదు. నిజానికి ఈ పనులు డిసెంబరుకు గాని పూర్తికావు....

**ప్రశ్న : ప్రపంచంలో ఇంతవరకు ఇలాంటి నిర్మాణాలు చేసిన సంస్థలు ఎన్ని ?**

**జవాబు :** ప్రపంచవ్యాప్తంగా ఇంతవరకు 500 ఎకరాల్లో ఐదేళ్లలో నిర్మాణాలు పూర్తి చేసిన సంస్థ ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు..

5,343 ఎకరాల్లో కట్టడమంటే ఎలా ఉంటుందో మీరే ఊహించండి...

**ప్రశ్న : ఎంతమంది రైతులకు ప్రభుత్వం ప్లాట్లు ఇవ్వవలసి ఉంది?**

**జవాబు :** సుమారు రెండున్నర లక్షల ప్లాట్లను ప్రభుత్వం రైతులకు కేటాయించవలసి ఉంది.

**ప్రశ్న : భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ఏం చేయాలని కోరుకుంటున్నారు ?**

**జవాబు :** స్థానిక రైతు కుటుంబాలకు ఉచిత విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించి స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత నివ్వాలి.

**ప్రశ్న : రైతు సంక్షేమ కార్యక్రమాలు ఏమైనా చేపడుతున్నారా ?**

**జవాబు :** రాజధాని ప్రాంతంలోని 22 వేల మంది రైతులకు కలసి ప్రభుత్వం 50 ఎకరాలు కెటాయించాలని మేము కోరుతున్నాం... 'క్యాపిటల్ రీజియన్ ఫార్మర్స్ ఫెడరేషన్'ద్వారా ఆ స్థలాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించి ఆర్థిక వనరులను సమకూర్చుకొంటాము. ఒక్కొక్క రైతుకీ మేము రెండు సభ్యత్వ కార్డులు ఇచ్చి, వారికి లోన్లు, ఆర్థిక సాయం చేయాలను కుంటున్నాం...

**ప్రశ్న : రైతుల కోసం లాయర్‌గా మీరిచ్చే సలహా ఏమిటి ?**

**జవాబు :** భూములిచ్చిన రైతులు సమైఖ్యంగా ఉంటేనే రాజధాని భాగస్వామ్యులుగా అభివృద్ధి ఫలాలను అందుకోగలం... లేకుంటే మన అవకాశాలను ఇతరులు అందిపుచ్చుకుంటారు. దీని విషయంలో రైతులంతా జాగరూకతతో వ్యవహరించాలి.

**రాజధాని వార్తలు : చాలా మంచి విషయాలు చెప్పారు... ధన్యవాదాలు ...మళ్లీ కలుస్తాం...**

# పల్లెల్లో విద్యా వెన్నెల

# జానీ మూన్



మహిళలు... అందునా ముస్లిం యువతులు చదువుకు చాలా దూరంలో ఉంటారు. పల్లెల్లో చదువు ప్రాధాన్యత తెలిసేది అంతంత మాత్రమే... సాదా సీదా కుటుంబంలో పుట్టినప్పటికీ డిగ్రీ చదివి భర్త ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చి ...ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థినుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ జానీమూన్ గురించి ఈ వారం తెలుసుకుందాం...

సామాన్య కుటుంబంలో ఒక అన్న తమ్ముడు మధ్యలో నేను పుట్టానన్న జానీమూన్, నాన్నకు చదవటం రాయడం వచ్చు. నాన్న మెకానిక్ పనులు చేసేవారు. ఆడపిల్లనయినప్పటికీ నన్ను మానాన్న చదువుకు దూరం చేయలేదు. నేను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లోనే నా విద్యాభాసాన్ని కొనసాగించానన్నారు. డిగ్రీ రెండో సంవత్సరంలో నాకు మా మేనత్త కొడుకు అబ్దుల్ గఫార్‌తో పెళ్లయ్యింది. ఆయన బీటెక్ (ఐటీ) చదివారు. పెళ్లికి ముందు ఐదేళ్లు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేశారని జానీమూన్ చెప్పారు. పెళ్లయిన తర్వాత మా వారు నా చదువుకు అడ్డు చెప్పలేదు. దాంతో నేను కాలేజీకి వెళ్లి డిగ్రీ(బీఎస్సీకంప్యూటర్స్) పూర్తి చేశానని తెలిపారు. మహిళలు ముందుకు రావాలంటే చిన్నతనంలో తండ్రి, పెళ్లయిన తర్వాత భర్త ప్రోత్సాహం తప్పని సరన్నారు. అదృష్టవశాత్తూ నాకు ఆ రెండూ లభించాయని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

మా నియోజకవర్గం బీసీ మహిళలకు కేటాయించబడింది. నాకు పోటీగా ఒకే ఒక మహిళ నిలిచారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిగ్రీ చదివిన నన్ను ఎన్నికల్లో పోటీ చేయటానికి టికెట్ ఇచ్చారు. దాంతో నా నియోజక వర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటును అభ్యర్థించానన్నారు. అంతకు ముందు అక్కడ పంచాయితీకి ఎన్నికయిన మార్తమ్మకు ఎన్నికల ప్రచారానికి కూడా మేము ఇంటింటికీ తిరగడం మాకు మేలు చేసిందన్నారు. గ్రామీణ మహిళగా మైనార్టీ, అణగారిన వర్గాల విద్యార్థులకు చదుకోవడంతో ఉన్న అవకాశాలు, మారిన జీవన విధానం గురించి ఎక్కడికి వెళ్లినా నా ప్రసంగాల్లో తెలియచేస్తున్నానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రస్తుతం గ్రామీణులు కూడా చదువ విలువ తెలుసుకుంటున్నారని మరీ ముఖ్యంగా నన్ను చూసిన మా నియోజక వర్గంవారు ఇప్పుడు వారి ఆడపిల్లలను కూడా ఉత్సాహంగా బడికి పంపుతున్నారన్నారు. జిల్లా మొత్తంమీద 59 లక్షల మంది పదవ తరగతి విద్యార్థులు ఉన్నారని, చంద్రన్న విద్యాపథకంలో భాగంగా డీఈఓ సహకారంతో మెటీరియల్ ఉచితంగా అందచేశామన్నారు. అంతే కాకుండా జిల్లా పరిషత్ స్కూళ్లలో చదివే వారికి సాయంత్రం పూట స్నాక్స్ అందించామన్నారు. అంతకు ముందు దీనికోసం రెండురూపాయలు కేటాయించగా ఆతరువాత ఐదు ప్రస్తుతం ఏడు రూపాయలు కేటాయించి వారికి సాయంత్రం చదువుకునే సమయంలో అరటి పండు, లేదా వేరుశనగ ఉండలు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేశామని ఎన్ఆర్ఐల సహాయంతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంపొందిస్తామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచుతున్నామన్నారు.

తమకు ఒక బాబు, పాప ఉన్నారని, పిల్లల ఆలనా పాలన అమ్మ,అత్తయ్య చూసుకుంటున్నారన్నారు. అయితే పాప ఇప్పుడిప్పుడే తెలుసుకుంటుందని బయటకు వెళుతుంటే ఏడుస్తుందని చెబుతున్నప్పుడు అందరు ఉద్యోగస్తుల, లేదా పదవుల్లోని అమ్మల్లాగే పిల్లలను మిస్ అవుతున్నామన్న అపరాధ భావం ఆమె గొంతులో తొంగి చూసింది. ఏది ఏమైనా... పల్లె పడుచుల్ని విద్యావంతుల్ని చేయడంలో అలుపెరుగని పోరాటం చేస్తున్న ఆమెకు రాజధాని వార్తలు గుడ్‌లక్ చెబుతుంది....

### మే కల్లా అన్ని శాఖల్లో బయోమెట్రిక్

## పూర్తి కావచ్చిన ఉద్యోగుల రిజిస్ట్రేషన్

**రాజధాని ప్రతినిధి-గుంటూరు :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ఇకపై బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టం (బీఏఎస్) ద్వారా హాజరు వేయనున్నారు. డిజిటల్ ఇండియాలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులలో జవాబుదారీతనం పెంచేందుకు బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా అటెండెన్స్ పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించి అన్ని రాష్ట్రాల వారు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. దీనిలో జిల్లా వారీగా అన్ని రాష్ట్ర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల వివరాలు నమోదు చేసే బాధ్యతను నేషనల్ ఇన్ఫర్‌మేటిక్స్ సెంటర్‌కు అప్పగించారు. రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయిలోని అన్ని శాఖల అధికారులు కూడా బీఏఎస్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఎన్ఐసీ అధికారులను సంప్రదించాలని నెలరోజుల క్రితం ఉత్వర్వులు జారీ చేశారు. కార్యాలయంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉద్యోగులకు వెబ్‌సైట్‌లో సిబ్బంది వివరాలు అప్‌లోడ్ చేసే విధానాన్ని ఎన్‌పిసీ అధికారులు అవగాహన కల్పించారు. కార్యాలయం హెచ్‌వోడిని నోడల్ అధికారిగా రిజిష్టర్ చేసి నమోదులు, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు యూజర్ నేమ్, పాస్‌వర్డు కేటాయించారు. ఉద్యోగి అధార్ కార్డుల నంబరు అందించిన వెంటనే అతని వివరాలు, ఫొటో, ఫింగర్‌ప్రింట్స్ వెబ్‌సైట్ అప్లికేషన్‌లోకి చేరుతాయి. కార్యాలయంలో ఆ ఉద్యోగి హోదా తదితర వివరాలను నోడల్ అధికారి అమోదించడంతో ఉద్యోగి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది. జిల్లాలోని ఆయా శాఖల పరిధిలోని ఉప కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందిని నోడల్ అధికారే రిజిష్టర్ చేయవచ్చు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని 25 శాఖల ఉద్యోగులు తమ వివరాలను నమోదు చేసుకున్నారు. డీఆర్‌డీఏ, డీఎంహెచ్‌వో, డీపీవో, జెడ్పీల్లో ఇప్పటికే బయోమెట్రిక్ విధానంలో ఉద్యోగుల హాజరు నమోదు చేస్తున్నారు. బయోమెట్రిక్ మిషన్లు కొనుగోలు చేసిన వెంటనే మిగతా శాఖల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. మే నాటికి జిల్లాలోని అన్ని శాఖలలో బీఏఎస్‌ను పూర్తిస్థాయిలో అమలు చేస్తారు. బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టం అమలవుతున్న ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులు కార్యాలయానికి వచ్చే పనివేళలు హెచ్‌వోడీ నుంచి అన్ని స్థాయిల అధికారులు ఆన్‌లైన్‌లో చూసే వీలుంటుంది. రాష్ట్ర స్థాయి అధికారులు కూడా జిల్లాలోని తమ కార్యాలయాల్లో హాజరు శాతాన్ని, ఒక ఉద్యోగి సమయ పాలనను తెలుసుకోవచ్చు. సాధారణ ప్రజలు సైతం ఆంధ్రప్రదేశ్, ప్రభుత్వ ఉద్యోగుల అటెండెన్స్ హోమ్ పేజీలో బీఏఎస్ అమలవుతున్న కార్యాలయాల్లో ఆ రోజుకు సంబంధించి వస్తున్న, వెళుతున్న సమయం, పనిగంటలు తెలుసుకోవచ్చు. ఉద్యోగులు కూడా ఇంటి నుంచే మందస్తు సెలవులు, అత్యవసర సెలవులను వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యి నోడల్ అధికారికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఉద్యోగుల వేతనాల చెల్లింపు కోసం ట్రెజరరీలకు అనుసంధానం చేసేలా అప్‌డేట్ చేయనున్నారు.

## శ్రీలాస్య కూచిపూడి ఆర్ట్ అకాడమీ అభినయ కౌశలం

**రాజధాని ప్రతినిధి :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో (ఇంద్రకీలాద్రి)"పంచహారతుల" సందర్భముగా విజయవాడకు చెందిన శ్రీ లాస్య కూచిపూడి ఆర్ట్ అకాడమీ విఖ్యాత నాట్యాచార్యులు శ్రీ దేవరకొండ చంద్రశేఖర్ శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు రమణీయంగా అలరించి భక్తుల అభినందనలందుకున్నాయి. తొలుత విఘ్నేశ్వర స్తుతితో కిలారు లక్ష్మీ తేజస్వి తమ ప్రదర్శనకు విఘ్నాల కల్పించ వద్దంటూ నృత్య ప్రదర్శనతో వేడుకుంది. తదుపరి 'అదిగో అల్లదిగో' అనే అంశంలో తిరుమల శ్రీహరి వాసాన్ని నయనానందంగా మేఘన,అఖిలశ్రీ, జ్యోతికపల్లవి, త్రినయన, ప్రజ్ఞ సత్యశ్రీ నర్తించారు.తదుపరి దేవరకొండ శ్రీ లాస్య ప్రదర్శించిన ఒకపరి- ఒకపరి, శ్రీరాజగోపాల, నటరాజశబ్దం, శివానీ- భవానీ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.నటరాజశబ్దంలో ఒక కాలు భువి నిల్వ, ఒక కాలు దివి గొల్వ అన్నట్లు చేసిన తాండవం శబ్దించి అందెల రవళులు పోటీపడి అంశాన్ని రక్తి కట్టించాయి. జావళి కనకపూర్ణ, భాను, నీరజ ప్రదర్శించిన చేరి యశోదకు అనే అన్నమాచార్య కీర్తనలో నీలమేఘశరీరుడైన శ్రీకృష్ణుని వర్ణన రమణీయంగా అభినయించారు. తదుపరి కొలువై ఉన్నాడే, కొండలలో నెలకొన్న, శివాష్టకం, ఇదిగో భద్రాద్రి, తందనాన, శ్రీమన్నారయణ, లింగాష్టకం తదితర అంశాలను చిన్నారులు నర్తించారు. అనంతరం దేవస్థాన కార్యవర్గం నాట్యాచార్యులు దేవరకొండ చంద్రశేఖర్ వారి శిష్యబృందాన్ని ఘనంగా సన్మానించారు.




## జూన్ 13న భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక

### కాపు ఉద్యమ నేత ముద్రగడ వెల్లడి

**రాజధాని ప్రతినిధి- పొన్నూరు :** కాపుల రిజర్వేషన్ ఉద్యమంపై జూన్ 13న జిల్లాల నాయకులతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను తెలియజేస్తామని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తెలిపారు. గుంటూరు జిల్లా పొన్నూరులో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో కాపులకిచ్చిన హామీలను ప్రభుత్వం నీరుగార్చడంతో తాము ఉద్యమాన్ని చేపట్టాల్సి వచ్చిందన్నారు. జన్మభూమి కమిటీల ప్రమేయం లేకుండా కాపులకు రుణాలు ఇవ్వాలన్నారు. తాము ఏ పార్టీకీ, ఏ కులానికి వ్యతిరేకం కాదన్నారు. ఉద్యమం తీవ్రరూపం దాల్చడానికి దారితీసిన పరిస్థితులను వివరిస్తూ నీళ్ల కోసం బోర్లు వేసుకుంటే కరెంటు ఆపేశారని, భోజనాలు వండుకోవడానికి ప్రైవేటు వ్యక్తులు స్థలాలు ఇస్తే వారిపై బెదిరింపులకు దిగారని చెప్పారు. రాష్ట్రం వారి జాగీరు కాదని ఆయన హెచ్చరించారు. అనంతరం పొన్నూరు మండలంలోని కసుకర్రు గ్రామంలో వినాయకుడి దేవాలయ శంకుస్థాపన కార్యక్ర మంలో ముద్రగడ పాల్గొన్నారు. తొలుత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు.

**రిజర్వేషన్ సాధించే వరకు పోరాడదాం**



రిజర్వేషన్ ఫలాలు అందేవరకు కాపులెవరూ నిద్రపోవద్దని ముద్రగడ పద్మనాభం పిలుపుని చ్చారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలోని ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో అవనిగడ్డ కాపు యువ సంఘం ఆధ్వర్యంలో ముద్రగడతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీసీల్లో ప్రస్తుతం ఉన్న కేటగిరీ ల్లో చేర్చమని కాకుండా వారికి నష్టం కలగ కుండా అదనపు కేటగిరిలో చేర్చమని చేస్తున్న పోరాటంలో మిగిలిన కులా లను కలుపుకొని ముందుకెళ్లా ల్సిన అవసరం ఉందన్నారు.

## టీఎస్ ఎంసెట్ పరీక్షా కేంద్రాల మార్పులు

**రాజధాని ప్రతినిధి -విజయవాడ :** ఏపిలో తెలంగాణ ఎంసెట్ రాయాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో పరీక్షా కేంద్రాలు మార్చుకునేందుకు మార్చి నెల 13 వరకు గడువ ఇచ్చినట్లు టీఎస్ ఎంసెట్ కన్వీనర్ రమణారావు తెలిపారు. ఆయన సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఎంసెట్‌ను మే 2న నిర్వహిస్తున్నామని, ఇందుకుగానూ ఏపీలోని విజయవాడ, కర్నూలు, విశాఖ, తిరుపతిలో ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి పరిధిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. టీఎస్ ఎంసెట్‌కు ఏపీ నుంచి ఇప్పటివరకు44,496 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఇందులో ఇంజనీరింగ్‌కు సంబంధించి 17,815, మెడిసిన్‌కు 26,681 దరఖాస్తులు ఉన్నాయన్నారు. ఇంజనీరింగ్ పరీక్ష మే 2న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మెడిసిన్ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతుందని తెలిపారు. మే 10న ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. తెలంగాణలో లక్షన్నర ఇంజినీరింగ్ సీట్లు, ఆరు వేల మెడిసిన్ సీట్లుండగా.. ఏపీ విద్యార్థులకు 15 శాతం సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. కాగా, ఆన్‌లైన్ పరీక్షను హైదరాబాద్, వరంగల్ సెంటర్లలో మాత్రమే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో కో-కన్వీనర్ జీవే విశ్వనాథ్, విజయవాడ రీజియన్ కన్వీనర్ ఏవీ రత్నప్రసాద్, పీవీపీ సిద్ధార్థ ప్రిన్సిపాల్ శివాజీబాబు, అడిషన్ డీసీపీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ 'నీట్'

- వైద్య విద్యలో ఉమ్మడి ప్రవేశ పరీక్ష రద్దు నిర్ణయం ఉపసంహరణ
- సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు
- నాడు న్యాయమూర్తుల మధ్య చర్చ జరగకుండానే తీర్పు వెలువడింది
- ఈ కేసుపై మళ్లీ విచారణ
- రాజ్యాంగ ధర్మాసనం వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** దేశంలో వైద్య కళాశాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహించే విధానాన్ని రద్దు చేస్తూ లోగడ ఇచ్చిన వివాదాస్పద తీర్పును సుప్రీం కోర్టు ఉపసంహరించుకుంది. నాటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అల్తామస్ కబీర్ పదవీ విరమణ రోజున ముగ్గురు సభ్యుల ధసనం 2:1 మెజార్టీతో ఆ తీర్పు చెప్పిందని వివరించింది. దానికి ముందు ధర్మాసనంలోని సభ్యుల మధ్య ఈ అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ ఎ.ఆర్.దవే నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గత సోమవారం ఏకగ్రీవంగా ఆదేశాలను వెలువరించింది. నాటి తీర్పుపై పున్ణసమీక్ష అవసరమని, దీనిపై తాజాగా మళ్లీ విచారణ జరుగుతుందని పేర్కొంది. అప్పటి ధర్మాసనంలోనూ జస్టిస్ దవే సభ్యుడిగా ఉన్నారు. నాడు ఆయన మెజార్టీ తీర్పును విభేదిస్తూ విడిగా తీర్పు రాశారు. తాజా ఉత్తర్వులతో 'నీట్'పై 2011లో వెలువడిన నోటిఫికేషన్ పునరుద్ధరణకు నోచుకుంది.

2013 జులై 18న నాటి తీర్పు వెలువడింది. జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) చెల్లుబాటు కాదన్న జస్టిస్ కబీర్ వాదనతో మరో న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌జిత్‌సేన్ (ఆ తర్వాత పదవీ విరమణ పొందారు) ఏకీభవించారు. మూడో న్యాయమూర్తి జస్టిస్ దవే దీనిని విభేదించారు. నీట్‌ను సమర్థిస్తూ తీర్పు రాశారు. తీర్పులు వెలువరించడానికి ముందు వాటి పై ధర్మాసనంలోని సభ్యుల మధ్య సాధారణం చర్చ జరుగుతుందని, అయితే ప్రస్తుత కేసులో సమయాభావం వల్ల అలాంటిది చోటుచేసుకోలేదని నాడు కూడా ఆయన పేర్కొనడం గమనార్హం. ధర్మాసనంలోని మెజార్టీ నిర్ణయానికి అనుగుణంగా నీట్ రద్దయింది. సొంతంగా ప్రవేవ పరీక్షను నిర్వహించుకోవడానికి ప్రైవేటు వైద్య కళాశాలలకు ఇది వీలు కల్పించింది. జస్టిస్ కబీర్ పదవీ విరమణ రోజున ఈ తీర్పు వెలువడింది.

అప్పట్లో ఇది సుప్రీం కోర్టు కారిడార్లలో తీవ్ర చర్చనీయాంశమైంది. తీర్పు ఇలా వస్తుందంటూ ఒక న్యాయవాది సామాజిక మాధ్యమంలో ముందే పేర్కొనడం ఇందుకు కారణం. అయితే తీర్పు లీకైన సంగతి తనకు తెలియదని జస్టిస్ కబీర్ పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి.

ఆ తీర్పును సమీక్షించాలంటూ అదే ఏడాది రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. 2013 అక్టోబర్ 23న వీటిని పరిశీలించిన ఒక త్రిసభ్య ధర్మాసనం.

ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది. వీటిని విచారించిన జస్టిస్ దవే, జస్టిస్ ఎ.కె.సిక్రి,జస్టిస్ ఆర్.కె.అగర్వాల్, జస్టిస్ ఆదర్శ్‌కు మార్ గోయల్, జస్టిస్ ఆర్.భానుమ తిలతో కూడిన ధర్మాసనం ఏకగ్రీవంగా ఉత్తర్వులు వెలువరించింది. "2013 జులై 18న వెలువడిన మెజార్టీ తీర్పులో కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. మరీ ముఖ్యంగా నాటి తీర్పును వెలువరించడానికి ముందు ధర్మాసనంలోని సభ్యుల మధ్య ఎలాంటి చర్చ జరగలేదని మేం గుర్తించాం" అని పేర్కొంది. ఆ తీర్పును వెనక్కి తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

ఈ అంశంపై తాజాగా వాదనలు జరుగుతాయని స్పష్టం చేసింది. దాదాపు మూడేళ్ల నాటి తీర్పును పున్ణసమీక్షిం చడానికి సవివర కారణాలను ఈ దశలో వెల్లడించడంలేదని పేర్కొంది. తాజా విచారణ పై ప్రభావం పడకుండా చూసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

**నీట్ నిబంధనల పునరుద్ధరణ**

తాజా ఉత్తర్వుల వల్ల 'నీట్' నిబంధనలు పునరుద్ధరణకు నోచుకున్నట్లేనని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి. తదుపరి విచారణ అనంతరం వెలువడే తుది తీర్పునకు లోబడి మళ్లీ పరీక్షలను భారత వైద్య మండలి (ఎంసీఐ) నిర్వహించుకోవచ్చని వివరించాయి. నీట్‌పై 2011లో జారీ అయిన నోటిఫికేషన్ ఇప్పుడు అమల్లోకి వచ్చినట్లేనని ఎంసీఐ తరపు న్యాయవాది కూడా తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం కోసం మేలో జరగాల్సిన వైద్య ప్రవేశపరీక్షలపై ఎలా ముందడుగు వేయాలన్నది కేంద్ర ప్రభుత్వం, ఎంసీఐ నిర్ణయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు.


## క్లాసిఫైడ్స్

రాజధాని ప్రాంతంలో స్థలాలు, పొలాలు కొనదలచిన, అమ్మాలన్నా సంప్రదించగలరు.
దాదా : 9441754056, రాయపూడి
వి. రవిశంకర్ : 9989360960, విజయవాడ.
ఎస్‌కె నాగుల్ : 9912192112, తుళ్ళూరు
ఎస్. రామోహనరావు : 8801933160, మందడం.

**దాదా మెడికల్ ఫాన్సీ స్టోర్స్**
& జిరాక్స్ తీయబడును
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి, రాజధాని ప్రాంతం
కౌసర్ : 9989035143, రాయపూడి.

**ఖాజా ఖాదర్ రైస్ & జనరల్ స్టోర్స్**
సరసమైన ధరలకు అన్ని కంపెనీల బియ్యం
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి పోస్ట్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా .
షేక్ జానీ, సెల్ : 9948450791

**వివాహ బంధం**
అన్ని కులముల, మతముల వారికి పెళ్ళి సంభంధములు చూడబడును.
షేఖ్ జానీ : 9985394613
అయ్యప్పనగర్, విజయవాడ.

**REALESTATE**

అనంతవరం గ్రామంలో పూలింగ్‌లో లేనిది, దారి, నీటివసతికల 5 నుంచి 10 ఎకరముల పొలము కావలెను. సంప్రదించండి 9440662699

కంచికచర్ల,దొనబండ ఏరియాలలో 25 ఎకరముల పొలం కావలెను. ఫోన్ : 9676844442

నవ్యాధ్రరాజధాని అమరావతి సీడ్ క్యాపిటల్ రింగులో ల్యాండుపూలింగ్‌లో ఇచ్చిన జరీబు పొలం 40 సెంట్లు కలదు. సంప్రదించండి 9440662699
Google Co-ordinates
16.561657, 80.476594

**రేమండ్ టైలర్స్**
మెయిన్ బజారు, తుళ్ళూరు

**చంద్రిక ట్రేడర్స్**
సిమెంట్, ఐరన్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్స్, సానిటరి వేర్ హోల్‌సేల్ అండ్ రిటేల్
రాయపూడి, తుళ్ళూరు మం. గుంటూరు జిల్లా.
ఫోన్ : 9908073516

**కె.జి.ఎన్ కార్ ట్రావెల్స్**
24 గంటలు కార్లు సప్లయ్ చేయబడును
ఫోన్ : 97040748420

సన్నిధి వెంకట పున్నారావు ,ఎల్ఐసి ఏజెంట్
కేరాఫ్ వైభవ్ డ్రస్సెస్
బ్యాంక్ రోడ్డు, తుళ్ళూరు
సెల్ నెం. 9848407935

### సచివాలయ ఉద్యోగుల

# డిమాండ్లకు ఆమోదం

**30 శాతం హెచ్ఆర్ఏ, అయిదురోజుల పనిదినాలకు సుముఖం**

**ఉన్నతస్థాయి అధికార బృందం నిర్ణయం**

**జూన్ 15 కల్లా సచివాలయంలో మూడొంతులు తరలింపు**

**రాజధాని ప్రతినిధి - విజయవాడ :** విజయవాడ తరలివెళ్లే ఉద్యోగులకు హైదరాబాద్‌లో మాదిరిగానే 30% హెచ్ఆర్ఏ చెల్లించడానికి, వారానికి అయిదు రోజుల పని దినాలకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉంది. ప్రధానమైన ఈ రెండు డిమాండ్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపినందున తరలింపులో ఎలాంటి ఇబ్బందులు ఉండబోవన్న నిర్ణయానికి వచ్చింది. మంగళవారం సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లింగరాజ్ పాణిగ్రహి నేతృత్వంలో ఉన్నతస్థాయి అధికారుల బృందం సచివాలయంలో సమావేశమై ఉద్యోగుల తరలింపునకు సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. ఏయే శాఖలను ముందుస్తుగా తరలించాలన్న అంశంపై ప్రాథమిక జాబితా సిద్ధం చేశారు. ఈనెల 18వ తేదీ తర్వాత మంత్రి నారాయణతో చర్చించి దీన్ని ఖరారు చేయనున్నారు. జూన్ 15 నాటికి సచివాలయం మూడొంతుల భాగం వెలగపూడికి తరలిపోతుందని ఉన్నతస్థాయి అధికారవర్గాలు తెలిపాయి. జూన్ 15 నాటికి తాత్కాలిక సచివాలయ భవనంలో రెండు అంతస్తులు సిద్ధం చేస్తామని నిర్మాణదారులు హామీనిచ్చారని చెప్పారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీని పూర్తి చేయడానికి జూన్ 30 అవుతుందని చెప్పారని వెల్లడించారు. అందువల్ల జూన్ 15 నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ తరలింపు జరుగుతుందని స్పష్టం చేశారు. మంత్రి నారాయణతో సమావేశం తరువాత తొలి దశలో తరలివెళ్లాల్సిన శాఖాధిపతులను పిలిచి చెబుతామని తరలింపుపై చర్చిస్తున్న అధికార బృంద సభ్యులు తెలిపారు. తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి, వెలగపూడి చుట్టపక్కల గ్రామాల్లో కొత్త అపార్ట్‌మెంట్లు, విల్లాలు, వ్యక్తిగత గృహాల నిర్మాణం వేగంగా జరుగుతోందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ కంటే తక్కువ ధరకే అక్కడ ఇళ్ల అద్దెలు ఉన్నట్లు చెప్పారు. విజయవాడలో కాస్త ఎక్కువగా ఉన్నప్పటికీ తాత్కాలిక పచివాలయ సమీపంలోనా గ్రామాలు, మంగళగిరి, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో అద్దెలేమీ పెద్దగా లేవని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం బ్యాచ్‌లెర్ అకామిడేషన్ కూడా కల్పించదని అన్నారు. అయిదు రోజుల పనిదినాలకు అంగీకరిస్తున్నందున మిగతా రోజుల్లో రోజుకు గంటపాటు విధి నిర్వహణ సమయాన్ని పెంచుతామన్నారు. అది ఎంతనుంచి ఎంతవరకు ఉండాలన్న దానిపై ఉద్యోగ సంఘాలతో మాట్లాడి నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. వారాంతంలో హైదరాబాద్‌కు రావడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా వాహన సౌకర్యం ఏమీ కల్పించబోదన్నారు. విజయవాడ ప్రాంతంలో ప్రైవేటు రవాణా వ్యవస్థ వేళ్లూనుకున్నందున ప్రైవేటు ఆపరేటర్లే డిమాండ్‌కు అనుగుణంగా హైదరాబాద్‌కు బస్సులు నడుపుతారని చెప్పారు. అక్కడ స్థానికంగా సచివాలయానికి వచ్చి వెళ్లడానికి మాత్రం ప్రత్యేక వాహన సౌకర్యం ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. పదవీ విరమణకు దగ్గరపడ్డ వారిని, ఆరోగ్య సమస్యలున్నవారిని స్కెలెటెన్ స్టాఫ్ కింద హైదరాబాద్‌లోనే ఉంచుతామని స్పష్టం చేశారు. అంతా తరలివెళ్లినా పదేళ్ల పాటు హైదరాబాద్‌లోని సచివాలయం ఏపీ ప్రభుత్వం ఆధీనంలోనే ఉంటుందని పేర్కొన్నారు.

### ప్రవాస భారతీయులకు

## స్వదేశంలో బ్యాంకు ఖాతాలు-వాటి వివరాలు

**ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) స్వదేశంలో బ్యాంకు ఖాతా తెరిచే విషయంలో ఎన్నో సందేహాలు వస్తుంటాయి. అందుబాటులో ఉన్న రకరకాల ఖాతాల్లో ఏవి అనువైనవి, ఏవి ఎలా పనిచేస్తాయన్న విషయం తెలిస్తేనే గానీ ఆ గందరగోళానికి ఫుల్ స్టాప్ పడదు.**

**నాన్ రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ అకౌంట్**

ఈ ఖాతాను వ్యక్తిగతంగాను, భారత్‌లోని మరొక వ్యక్తితో కలసి ఉమ్మడిగాను ప్రారంభించవచ్చు. ఇన్ఫోసిస్‌లో పనిచేసే సుబ్రహ్మణ్యానికి అమెరికాలో ప్రముఖ కంపెనీలో ఉద్యోగ అవకాశం లభించింది. ఎగిరి గంతేసి రెండు రోజుల్లోనే అమెరికా విమానం ఎక్కేశాడు. సుబ్రహ్మణ్యానికి హైదరాబాద్ మాదాపూర్ ఎస్‌బీఐ శాఖలో ఖాతా ఉంది. ఇకపై అతడి ఖాతాను ఎన్ఆర్ఓ ఖాతాను పరిగణిస్తారన్నమాట. భారత్‌లో ఏదేనీ ఆదాయ వనరున్నవారు అంటే సొంత ఇంటికి వచ్చే అద్దెలు, వడ్డీలు, పెన్షన్ ఇలా ఏ రూపంలోనైనా స్వదేశంలో ఆదాయం ఉన్నవారికి ఈ ఖాతా ఉపయోగంగా ఉంటుంది. ఆ ఆదాయాన్ని ఈ ఖాతాలో జమ చేసుకోవచ్చు. ఎందుకంటే ఎన్ఆర్ఈ ఖాతాల్లో భారతీయ కరెన్సీ డిపాజిట్‌కు అవకాశం లేదు. ఈ ఖాతా ద్వారా డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయం పన్ను పరిధిలో వస్తుంది. విదేశీ, భారత కరెన్సీ రెండు రూపాల్లోనూ జమ చేసుకోవచ్చు. భారత కరెన్సీ రూపంలోనే తీసుకోవాలి. ఈ ఖాతా నుంచి ఎన్ఆర్ఈ ఖాతాకు నగదు బదిలీకి అవకాశం లేదు. ఈ ఖాతా నుంచి విదేశాలకు అసలు, వడ్డీ ఆదాయం పూర్తిగా తరలించుకుపోవడానికి కూడా కుదరదు. ఒక ఏడాదిలో పది లక్షల డాలర్ల వరకే బదిలీకి అవకాశం ఉంది.

**మార్చుకోవాలంటే జరిమానా**

ఎన్ఆర్ఈ, ఎన్ఆర్ఓ ఖతాలను సేవింగ్స్, కరెంటు, రికరింగ్, ఫిక్స్ డ్ డిపాజిట్ ఖాతాల రూపంలో ప్రారంభించవచ్చు. కనీస నగదు నిల్వ ఉండాలి. విదేశాల్లో ఉంటూ భారతీయ పౌరుడి హోదాలో బ్యాంకు ఖాతాను కొనసాగించడం నేరం. అందుకే ఉద్యోగ రీత్యా, లేదా స్థిరనివాసం కోసం విదేశాలకు వెళితే వెంటనే స్వదేశంలోని బ్యాంకు ఖాతాను ఎన్ఆర్ఓ ఖాతాగా మార్చుకోవాలి. లేదా ఖాతా మూసివేయడం నయం. లేదంటే భారీగా జరిమానాలు విధిస్తారు. 180 రోజులకు మించి విదేశాల్లో ఉండే వారికి ఈ నిబంధనలు వర్తిస్తాయి.

**ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ బ్యాంకు అకౌంట్**

విదేశాల్లో ఉన్న భారతీయులు ఆ దేశ కరెన్సీ రూపంలోనే భారత్‌లో డిపాజిట్ చేసి వడ్డీ గడించేందుకు ఈ ఖాతా ఉపయోగపడుతుంది. విదేశాల్లోని బ్యాంకు ఖాతా నుంచి నేరుగా ఎఫ్‌సీఎన్ఆర్ ఖాతాను నగదు బదిలీ చేసుకుని డిపాజిట్ చేసుకోవచ్చు. ఎన్ఆర్ఈ ఖాతాలో ఉన్న నగదును ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. కనీసం ఏడాది నుంచి ఐదేళ్ల వరకు కాల పరిమితిలో ఈ ఖాతాను ప్రారంభించుకోవచ్చు. డిపాజిట్ మొత్తాన్ని విదేశీ కరెన్సీ రూపంలోనే వెనక్కి తీసుకోవచ్చు. కరెన్సీ మారకపు రేట్లలో తేడా కారణంగా నష్టపోకుండా ఉండేందుకు విదేశీ కరెన్సీ రూపంలోనే డిపాజిట్ చేసుకోవడానికి ఈ ఖాతా వీలు కల్పిస్తుంది. ఈ ఖాతాలకు సంబంధించి రిజర్వ్ బ్యాంకు గైడ్ లైన్స్, తరచూ అడిగే సందేహాలను సమాధానాల కోసం కింది వెబ్ లింకులు చూడవచ్చు.

## కమీషన్ చైర్మన్ పదవికి వన్నె తెస్తా - కారెం శివాజీ

**రాజధాని ప్రతినిధి,తూగో :** యస్.సి, యస్.టి. కమిషన్ చైర్మన్ పదవి చేపట్టి మొట్టమొదటి సారిగా స్వగ్రామం చేరుకున్న కారెం శివాజీకి మాల మహానాడు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు,ఘన స్వాగతం పలికారు. వారంతా 4 రోడ్ల కూడలి నుండి పాదయాత్రగా బయలుదేరి డా.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవికి వన్నెతెస్తానని హామి ఇచ్చారు.జస్టిస్ పున్నయ్యగారి స్పూర్తితో దళిత, బడుగు, బలహీన వర్గాలు, వికలాంగులు, వితంతువులకు సేవ చేస్తున్నారని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధికి శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజారెడ్డి, వెలగల నగేష్, గుబ్బల నాగేశ్వరరావు, వైయస్.ఆర్, సి.పి మండల కన్వీనర్ కర్రె వేణుబాబు, బుర్రారవి,రవిచంద్ర, సర్పంచ్‌లు చవ్వాకుల లక్ష్మీ, కారిపల్లి మహాలక్ష్మీ, భాస్కరరావు, కాకోలు మమత కుమారి, విజయ్,కారిపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి?

# ఆయన ఆశయాలకు తూట్లు



**(రాజధాని వార్తలు ప్రత్యేకప్రతినిధి)**

"అంబేద్కర్ 125వ జయంతిని ప్రపంచ వ్యాప్తంగా గురువారం అట్టహాసంగా నిర్వహించారు. మనదేశంలో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తెలుగువారు భారత రాజ్యాంగ నిర్మాత జయంతిని గతంలో కన్నా ఘనంగా జరుపుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల అధినేతలు, ముఖ్యమంత్రులు అంబేద్కర్ జయంతి రోజున ఎన్నో కొత్త సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించారు. ఆయన పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో 6 లక్షల గృహనిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్రంలో 15 అంతస్తుల అంబేద్కర్ టవర్, స్మృతివనం, అంబేద్కర్ స్టడీ సర్కిల్‌కు నూతన భవనాలు, 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు శంకుస్థాపనలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ. 6 వేల కోట్లతో అంబేద్కర్ గృహనిర్మాణ పథకానికి శంకుస్థాపన చేశారు. నూతన రాజధాని అమరావతిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ స్థాపనకు, స్మృతివనానికి ఆయన కూడా శ్రీకారం చుట్టారు. ఈ విధంగా దేశవ్యాప్తంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సహా అన్ని రాష్ట్రాల అధినేతలు, ఆయా రాజకీయ పార్టీల అగ్రనేతలు అంబేద్కర్ నామస్మరణ చేశారు. అయితే ఆయన చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి? ఆత్మపరిశీలన చేసుకోవలసిన సమయం ఆసన్నమైంది".

ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగ రచనకు నడుం బిగించారు. ఆనాడు దేశంలో ఎందరో మేధావులు, ప్రముఖ ప్రజాప్రతినిధులు, తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుండి అగ్రనేతలందరూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను రాజ్యాంగ రచనా సంఘం ఛైర్మన్‌గా నియమించాలని నిర్ణయించి ఆయనను కలిసి విన్నవించారు. అందుకు అంబేద్కర్ అంగీకరించి తనతోపాటు మరికొందరు సభ్యులను కూడా నియమించాలని కోరారు. పేరుకు మాత్రం కమిటీలో సభ్యులున్నప్పటికీ కొందరు అకాలమరణం చెందడం, మరికొందరు రాజ్యాంగ రచనా ప్రక్రియలో పాల్గొనడానికి, సమయం కేటాయించడానికి ఆసక్తి చూపక పోవడం, మరికొందరు వృద్ధ నేతలు అనారోగ్యంతో వుండడంతో మొత్తం బాధ్యతంతా అంబేద్కర్‌పైనే పడింది. దీంతో ఆయన ఎంతో శ్రమించి, ఓడలో ప్రయాణించి, ఇతర దేశాలను సందర్శించి అక్కడి రాజ్యాంగాలను సమీక్షించారు. అధ్యయనం చేశారు. భారతదేశానికి సర్వసత్తాక, లౌకిక, గణతంత్ర, ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రచించి భళా అనిపించుకున్నారు. ఆయన ముందుచూపుతో రాసిన పవిత్ర రాజ్యాంగం ఈనాటికీ, ఏనాటికీ కూడా తీసిపోనివిధంగా, అన్ని కాలాల్లో ఇనుమడించేవిధంగా ఉంది. అతి సామాన్యులు కూడా దేశ అధినేతలయ్యే విధంగా ప్రజాస్వామ్య భారతావనికి ఆయన రూపకల్పన చేసి, ముందుచూపుతో వ్యవహరించారు. 'కులం పునాదులమీద మీరు దేనిని నిర్మించలేరు. ఒక జాతిని నిర్మించలేరు, ఒక నీతిని నిర్మించలేరు, కులం పునాదుల మీద ఏది నిర్మించినా అది ముక్కలు కావడం తథ్యం' అని ఉద్బోదించారు. భారతదేశానికి రెండు రాజధానులు ఉండడం అవసరమన్నారు. ఢిల్లీ మహానగరం ప్రధాన రాజధానిగా ఉండాలని, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా, జనాభా, ఇతర రాష్ట్రాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఆయన దక్షిణ భారతదేశానికి హైదరాబాద్‌ను రెండవ రాజధానిగా చేయాలని సూచించారు. అంతేగాకుండా భారతదేశంలో చిన్న రాష్ట్రాల ఏర్పాటు అవసరం వుందని కూడా పేర్కొన్నారు. దళితులకు రిజర్వేషన్లు అనే భిక్ష కాకుండా వారిని అన్నివిధాల చిత్తశుద్ధితో, ఒక నిర్దిష్ట కాలపరి మితితో జనజీవన స్రవంతిలోకి తీసుకురావాలన్నారు. వారిని ఓటు బ్యాంక్‌గా కాకుండా అందరితో మమేకమయ్యేవిధంగా, రాజ్యాంగ పరిధిలో రక్షణలతో, విద్యా, ఉద్యోగ రంగాల లో, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో అభివృద్ధిలో పయనించేవిధంగా చేయాలన్నారు. దళితులు విద్యావంతులు కావాలని, రాజ్యాధికారం కోసం పోరాడాలని 'నోరు లేని మేకల్ని బలి ఇస్తారు కానీ సింహాలను బలి ఇవ్వలేరని, దళితులు సింహాల్లా జీవించాలని, అని కోరారు. ఈ విధంగా ఆయన అంటరానితనం, బానిసత్వం సంకెళ్ళు తెంచుకుని వీరోచితంగా జీవించాలని దళితులకు ఉద్బోదించారు. ఈవిధంగా ఆయన ఎన్నో ఆశలు, ఆశయాలతో జీవితమంతా పోరాటాలతో, అధ్యయనాలతో సాగించారు. కానీ ఈనాడు దళితులు కానీ, రాజకీయ పార్టీలు కానీ ఆయన చెప్పిన బాటలో, ఆయన బోధించిన ఆశయాలను అమలు చేయడంలో ఎటువైపు వెళ్తున్నారో ఆలోచించుకోవాలి. ఆయన చెప్పిన ఆశయాలను పాటించినవారే ఆయనను స్మరించాలి. ఆయన ఆశయాలకు అనుగుణం గా పనిచేసినవారే ఆయనను కీర్తించాలి. అంతేగానీ అంబేద్కర్ జయంతి, వర్ధంతులను ఘనంగా జరిపి ఆయన పేరిట స్మృతి చిహ్నాలు, సంక్షేమ పథకాలు ప్రారంభించినంతమాత్రాన ఆయన బాటలో పయనించినట్లు కాదని గ్రహించాలి. ప్రజాస్వామ్యవాదులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, దళిత నాయకులు, విద్యార్థులు, యువకులు, అంబేద్కర్ జీవితాన్ని, ఆశయాలను ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళి.

# పాలకులలకు దిశానిర్దేశం చేసిన దార్శనికుడు అంబేద్కర్

## ఎం.ఎల్.ఏ. శ్రీనివాసరావు

**అన్నంరెడ్డి సుబ్బారావు,- రాజధాని ప్రతినిధి - కొయ్యలగూడెం :**

బి.ఆర్. అంబేద్కర్ తాను లిఖించిన భారత రాజ్యాంగం ద్వారా దేశంలో పాలకులకు, పాలనకు దిశానిర్దేశం చేసి దార్శనికుడుగా చరిత్రలోని నిలిచిపోయారని పోలవరం ఎం.ఎల్.ఏ. ఎం.శ్రీనివాసరావు శ్లాఘించారు. అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా మండలంలోని గవరవరం జడ్.పి.హైస్కూల్ ప్రాంగణంలో స్థానిక అంబేద్కర్ యవజన సేవా సంఘం ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సి.డబ్లు.సి. చైర్‌పర్సన్ టి.ఎన్. స్నేహన్ అధ్యక్షతన జరిగిన సభలో ఎం.ఎల్.ఏ. ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఈ ఏడాది పొడుగునా జరపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అంబేద్కర్ చలవవల్లనే ఎస్.సి. ఎస్.టి, బి.సి.లకు, మహిళలకు రిజర్వేషన్లు, రాజ్యాధికార హక్కులు దక్కాయని శ్రీనివాసరావు అన్నారు. గత పదేళ్ల కాంగ్రెస్ పాలనలో ఎస్.సి., ఎస్.టి.ల అభివృద్ధికి, సంక్షేమానికి కేటాయించిన నిధులలో 69 శాతమే వినియోగించి, మిగిలిన 31 శాతం నిధులను ఇతర పథకాలకు మళ్లించారని ఆయన గుర్తు చేశారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన నాటి నుంచి తెలుగుదేశం ప్రభుత్వం ఎస్.సి, ఎస్.టి.ల అభివృద్ధికి, సంక్షేమానికి కేటాయించిన నిధులు, సబ్‌ప్లాన్ నిధులు మొత్తం నూటికి నూరు శాతం ఆ వర్గాల పురోభివృద్ధి కోసమే ఖర్చు చేస్తోందని ఎం.ఎల్.ఏ. తులిపారు. ఎస్.సి., ఎస్.టి.ల అభివృద్ధికి గతంలో కన్నా 68 శాతం అధికంగా ముఖ్యమంత్రి కేటాయించారన్నారు. కొయ్యలగూడెంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేయగలనని ఆయన అన్నారు. జడ్.పి.వైస్‌చైర్‌పర్సన్ చింతల వెంకటరమణ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన హిందూ కోడ్ బిల్లు వల్లనే ప్రజాప్రతినిధుల చట్టంలో మహిళలకు అవకాశం దక్కిందన్నారు. ఎం.పి.పి. పర్తి చందనశ్రీదేవి మాట్లాడుతూ రాజ్యాంగంలోని 273,74 నిబంధనల ద్వారా మహిళలకు ఉండే హక్కులను బహిరంగపరిచి వారిని రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఘనత తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు, నాటి ముఖ్యమంత్రి ఎన్.టి..ఆర్. కే దక్కుతుందన్నారు. పోలవరం ఎ.ఎం.సి. చైర్మన్ పారేపల్లి రామారావు మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక అసమానతల లేని సమసమాజం స్థాపనకు అంబేద్కర్ చూపిన బాటలో అందరూ నడవాలని కోరారు. మాజీ.ఎం.పి.పి. మట్టా సత్తిపండు, డి.వై.ఇ.ఓ. తిరుమలదాసు, గవరవరం సర్పంచ్ మద్దిపాటి రాజ్‌కుమార్, ఎస్.ఐ. చెన్నారావు, స్నేహన్, సత్యనారాయణ కూడా ప్రసంగించారు. ఎం.పి.టి.సి.నల్లూరి, టి.పి.పి. నాయకులు ఎస్.ఆర్.ఆర్. జయబాబు, మాజీ ఎం.పి.టి.సి. గోపి గోపాలకృష్ణ తదితరులు వేదికపై ఆశీనులయ్యారు. అంతకుముందు కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద, ఆర్.టి.సి. బస్‌స్టేషన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహాల దగ్గర ఎం.పి.పి. చందన శ్రీదేవి, జడ్.పి. వైస్‌చైర్‌సర్సన్ వెంకటరమణ, గంగిరెడ్ల మేఘాలాదేవి, ఎ.ఎం.సి. చైర్మన్ పాలేపల్లి రామారావు, టి.డి.పి. నాయకులు పాల్గొన్నారు. ఎన్.టి.ఆర్ గృహం పథకాల నిర్మాణానికి ఇంటికి ఎం.పి.పి. చందన శ్రీదేవి శంకుస్థాపన చేశారు. ఈ వారంలో 11న ఎం.ఎల్.ఏ. శ్రీనివాసరావు కొయ్యలగూడెం చెక్‌పోస్టు వద్ద కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన మంచినీరు, మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. రాజవరంలో డ్వాక్రా గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా వారు ప్రారంభించారు. కొయ్యలగూడెంలో 12వ తేదీ ఉపాధిహామీ నిధులలో నిర్మించిన డంపింగ్ యార్డును ప్రారంభించారు. బయ్యనగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల మానవ వనరుల శాఖ కార్యాలయం ప్రత్యేక అవసరాలు గల బాలలకు ట్రైసైకిళ్లు అందజేశారు. బోడిగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. బత్తుల వెంకటరమన, చందన శ్రీదేవి పాల్గొన్నారు.



### పెదపాడులో అంబేద్కర్‌కు ఘన నివాళి

**(రాజధాని వార్తలు- పెదపాడు-ఏలూరు)**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 వ జయంతి ఉత్సవాన్ని పెదపాడు మండలం పెదపాడుగ్రామంలో గ్రామ సర్పంచ్ ఖండవల్లి ఏసుకుమారిజరహో దంపతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యాలయం సిబ్బంది డాక్టర్ అంబేద్కర్ అభిమానులు, గ్రామ పంచాయితీ కార్యాలయం సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

# నూరుశాతం అభివృద్ధిపరచడమే ఆశయం

(మొదటి పేజీ తరువాయి)

తెలుపుకుంటున్నానని శ్రీనివాసరావు అన్నారు. ఈ నెలలోనే సి.ఎం. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించడానికి రానున్నారని, ఈలోగా ప్రాజెక్టు ముంపు గ్రామాల నుంచి నిర్వాసితులందరినీ నూరుశాతం పునరావాస కాలనీలకు తరలించడానికి ముమ్మరంగా ఆర్.డి.జి. సహా అధికారులందరూ కృషి చేస్తున్నారని ఎం.ఎల్.ఏ చెప్పారు. చింతలపూడి ఎత్తి పోతల పథకం పనులు కూడా వేగవంతమవుతున్నాయని ఆయనతెలిపారు. మండలంలోని కొన్ని గ్రామాల మీదుగా వెళుతున్న తాడిపూడి ఎత్తిపోతల పథకం ఉపకాల్వ నిర్మాణం పనులు పొంగుటూరు, గంగన్నగూడెం, యర్రంపేటు గ్రామాల పొలాల మధ్య అక్కడక్కడా జరగలేదని, దాదాపు ఏడెనిమిది సంవత్సరాలుగా భూసేకరణ సమస్య కారణంగా తవ్వకం పనులు నిలిచిపోయాయని రాజధాని ప్రతినిధి ఆయన దృష్టికి తీసుకువెళ్లగా విషయం తన దృష్టికి రాలేదని ఎం.ఎల్.ఏ. చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన తర్వాత సమస్యను రాష్ట్ర జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులను ప్రభుత్వం ఇస్తున్నా ఆర్.ఆర్. ప్యాకేజీ, భూములకు నష్ట పరిహారం చెల్లింపులను కొత్త చట్టం ప్రకారం ఇవ్వటానికి ముఖ్యమంత్రి ప్రకటించడం ఎంతో సంతోషదాయకమని, నిర్వాసితులకు పూర్తి న్యాయం జరిగిందని, తాను ఈ విషయంలో నూరుశాతం సంతృప్తిలో ఉన్నానని శాసన సభ్యుడు హర్షం వ్యక్తం చేశారు. అందుకు ముఖ్యమంత్రికి ధన్యావాదాలు తెలుపుకుంటున్నారని ఆయన తెలిపారు. అయితే... మొదట్లో పాతచట్టం ప్రకారం భూమి ఇచ్చి పరిహారం అందుకున్న వారికి నిబంధనల ప్రకారం కొత్త చట్టం వర్తించదని ఆయన చెప్పారు. ఈ విషయమై ముంపు ప్రాంతాలకు చెందిన నలుగురు ఎం.ఎల్.ఏలు కలసి చర్చించామని, ముఖ్యమంత్రి కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చట్టం జరగటం, రాష్ట్రంలో 50 అసెంబ్లీ నియోజకవర్గలు పెరగటం ఖాయమని, ముఖ్యమంత్రి కూడా ఈ విషయమై స్పష్టత ఇచ్చారని ఎం.ఎల్.ఏ శ్రీనివాసరావు వెల్లడించారు. పోలవరం ఎస్.టి. రిజర్వుడు నియోజకవర్గం నుంచి కొయ్యలగూడెం, టి.నర్సాపురం మండలాలు విడిపోయే అవకాశం ఉందని, పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్.టి. రిజర్వుడు నియోజకవర్గాలు పెరగవని పోలవరం ఒక్కటే ఎస్.టి. నియోజకవర్గంగా ఉంటుందని ఆయిన స్పష్టం చేశారు. అయితే షెడ్యూలు తెగల జనాభా, ఓటర్లు అధికంగా ఉన్న తూర్పుగోదావరి వైజాగ్, శ్రీకాకుళం జిల్లాలో మాత్రం నాలుగైదు రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాలు పెరిగే పరిస్థితి ఉందని ఆయిన వివరించారు.

పోలవరం నియోజకవర్గంలోని జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వరకు గల రాష్ట్ర రహదారి జాతీయ రహదారుల శాఖకు అప్పగించామని, నేషనల్ హైవే శాఖ అధికారులు ఈ రహదారిని స్వాధీనం చేసుకున్నారని ఎం.ఎల్.ఏ. తెలిపారు. త్వరలో సర్వే ప్రారంభించి రోడ్డు జాతీయ రహదారుల ప్రమాణాల స్థాయికి తగినట్లుగా విస్తరించి అభివృద్ధి పనులు చేపడతారని ఆయన చెప్పారు. కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామ పరిధిలో 610 మీటర్లు బి.టి. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. మండల కేంద్రం కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డిగ్రీ తరగతులు వచ్చే జూన్ నుంచి ప్రారంభించటానికి అనువైన వసతులు, వనరులు, స్థలం గురించి పరిశీలన, చర్చలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. నియోజకవర్గంలోని 4 పంచాయతీలు (12 గ్రామాలు) పోలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో కాకుండా 42 కిలోమీటర్ల దూరంలోని కొవ్వూరు మార్కెట్ కమిటీ పరిధిలో ఉండటం వల్ల ఆ గ్రామాలకు రైతులకు ఇక్కడి పోలవరం కమిటీ సేవలు అందటం లేదని, దూరంగా ఉన్నందుకు కొవ్వూరు మార్కెట్ కమిటీ పాలకవర్గం ఈ గ్రామాలను పట్టించుకోవడం లేదని, సేవలు అందించటం లేదని 'రాజధాని ప్రతినిధి' ఎం.ఎల్.ఏ. దృష్టికి తీసుకువెళ్లగా నియోజకవర్గాల వారీగా మార్కెట్ కమిటీల పునర్వ్యవస్థీకరణ జరగవలసి ఉందని, అయితే రైతులకు సేవలు అందించే విషయమై అధికారులతో మాట్లాడతానని ఆయిన చెప్పారు.

కొయ్యలగూడెం మండలంలో మండల పరిషత్ అధ్యక్షురాలు, ఎం.పి.డి.ఓ.కి సయోధ్య సమన్వయం లేక గత 16 నెలలుగా ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఇబ్బంది పడుతున్నారని, అభివృద్ధి పనులు అమలుకు విఘాతం కలుగుతున్న పరిస్థితి గురించి ప్రశ్నించగా..ఈ విషయమై దృష్టి పెట్టామని, త్వరలోనే చక్కదిద్ది గాడిన పెడతామని ఎం.ఎల్.ఏ. చెప్పారు. రాష్ట్ర కేబినెట్‌ను విస్తరిస్తే మంత్రి అవుతారా అని ప్రశ్నించగా.. అంతా సీ.ఎం. ఇష్టం..అంటూ ఎంఎల్ఏ నవ్వేశారు.

# ఎన్‌హెచ్ఆర్సీ నిర్వాసితుల గోడు

జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యుల (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) పర్యటన

పునరావాస గ్రామాల సందర్శన

**అన్నంరెడ్డి సుబ్బారావు- రాజధాని ప్రతినిధి- కొయ్యలగూడెం :**

పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు మానవ హక్కుల సంఘ సభ్యులు,(అసిస్టెంటు రిజిస్ట్రారు, న్యాయం) ఇంద్రజీత్ సింగ్, డిప్యుటీ ఎస్.పి.రజబీర్‌సింగ్ నిర్వాసిత గ్రామం రామయ్యపేటలో పర్యటించారు. అక్కడి నిర్వాసితుల సమస్యలు, గోడువిని, వారి నుంచి లిఖిత పూర్వకంగా అర్జీలు సేకరించిన అనంతరం కొత్త రామయ్యపేట పునరావాస కాలనీని జాతీయ మానవహక్కుల సంఘం సభ్యులు సందర్శించారు. అక్కడ మౌలిక సదుపాయలు కల్పన పై సంతృప్తి వ్యక్తం చేశారు. తమకు కొత్త భూసేకరణ చట్టం అమలు పరచాలని రామయ్యపేట నిర్వాసితులు మనవ హక్కుల సంఘానికి లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. అధికారుల సమక్షంలో తాము ఏమీ చెప్పలేమని నిర్వాసితులు తెలపడంతో సభ్యులు రెండు బృందాలుగా విడిపోయి గ్రామంలోని నిర్వాసితులకు ఇళ్లకు వెళ్లి, వారు చెప్పిన వివరాలు నమోదు చేసుకున్నారు. పునరావాస కాలనీలో ఇంటినిర్మాణం పూర్తి కాకుండానే ఇక్కడ నుంచి ఇల్లు ఖాళీ చేసి వెళ్లి పొమ్మని అధికారులు పోలీసులతో వచ్చి బెదిరిస్తున్నారని ఒక నిర్వాసితుడు ఫిర్యాదు చేశారు. భార్యా బిడ్డలను గ్రామంలో వదిలి జీవనోపాధి కోసం వేరే ప్రాంతానికి వెళితే పునరావాస ప్యాకేజీ ఇవ్వనంటున్నారని మరో నిర్వాసిత బాధితుడు వాపోయాడు. లేదంటే ఇచ్చిన పునరావాస ప్యాకేజీ డబ్బును బ్యాంకులు తమ బాకీలకు జమ చేసుకున్నాయని. తమకు ఒక్క రూపాయి కూడా మిగల లేదని, తామెలా బతకాలని మరోక బాధితుడు ప్రశ్నించారు. పునరావాస ప్రాంతంలో తమకు ఇప్పటివరకు నివేశన స్థలాలు చూపించలేదని, అద్దె ఇళ్లలో ఉండండి అద్దె చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారని కొందరు మహిళలు తమ గోడును వినిపించారు. నిర్వాసిత గ్రామాలలోని తమ ఇళ్లను ఖాళీ చేసి పొమ్మని అధికారులు బలవంతం చేస్తున్నారని, పునరావాస కాలనీలలో ఇప్పటి వరకు మరుగుదొడ్ల నిర్మాణం జరగలేదని అక్కడ మహిళలు ఎలా ఉండాలని నిలదీశారు. చేగొండపల్లి నిర్వాసిత గ్రామానికి చెందిన మహిళలు రామయ్యపేటలో ఉన్న మానవహక్కుల సంఘం సభ్యుల వద్దకు వచ్చి అధికారులు తమను గ్రామం నుంచి బలవంతంగా ఖాళీ చేయించి తరలించిన తీరును వారికి వివరించారు.

పోలీసులను వెంటపెట్టుకొని వచ్చిన అధికారులు రాత్రంతా గ్రామాలలో మకాం వేసి ఒత్తిడి చేసి ఇళ్లను, గ్రామాన్ని ఖాళీ చేయించారని ఆరోపించారు. ఆ సంఘటనలకు సంబంధించిన ఫొటోలనూ బాధితులు మానవ హక్కుల సంఘ సభ్యులకు చూపించారు. గ్రామాన్ని ఖాళీ చేయలేదని విద్యుత్, నీటి సరఫరాలను నిలిపి వేయించారని ఫిర్యాదు చేశారు. 2007-08 సంవత్సరంలో పునరావాస ప్యాకేజీని ఇచ్చిన అధికారులు ఇప్పుడు ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టారని, ఇప్పటికీ కొందరు నిర్వాసితులకు ఇళ్లస్థలాలు చూపించలేదని రామయ్యపేట నిర్వాసితులు విన్నవించారు. అప్పుడు ఎకరం పొలానికి రూ.1.85 లక్షలు ఇప్పించారని, నిర్వాసితులకు ముంపు భూములకు బదులుగా భూమిని ఇస్తామని చెప్పిన అప్పటి జిల్లా కలెక్టరు, జాయింటు కలెక్టరు తార్వాత మాట మార్చి ఎకరానికి రూ.1.85 లక్షలు మాత్రమే ఇచ్చారన్నారు.. ఆ డబ్బు తీసుకోకపోతే పరిహారం సొమ్మును కోర్టులో కడతామని భయపెట్టి తమపై ఒత్తిడి తెచ్చారని బాధితులు వాపోయారు.

పూర్తి ప్యాకేజీతో పాటు, నివేశన స్థలాలు కూడా ఆనాడే ఇచ్చి ఉంటే తమకు ఇన్ని బాధలు ఉండేవి కావని నిర్వాసితులు ఆవేదన చెందారు పునరావాస ప్యాకేజీ కింద భూములు కోల్పోయిన వారికి, నిరుపేదలకు 2 లక్షల రూపాయలు వంతున పరిహారంగాను, మేజరులైన యువకులకు లక్షా 40 వేల 2 వందల రూపాయలు, అవివాహిత యువతులకు రూ.5.83 లక్షల వంతున ఇచ్చారని, 18 సంవత్సారాల లోపు వయసు గల పిల్లలకు మాత్రం ప్యాకేజీ ఇవ్వలేదని రామయ్యపేట గ్రామ నిర్వాసితులు తెలిపారు. 18 ఏళ్ల వయసు గల తమ పిల్లకు ప్యాకేజీ ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారని, వారి జీవనోపాధి, చదువు సంధ్యలు ఎలా సాగుతాయని ప్రశ్నించారు.

18 ఏళ్లలోపు పిల్లలకు కూడా ప్యాకేజీ ఇవ్వాలని మానవ హక్కుల సంఘం సభ్యులకు వినతిపత్రం అందచేశారు. వారి భవిషత్తును తీర్చిదిద్దిటానికి ప్యాకేజీ అవసరమని అన్నారు. సామాజికవేత్త పెంట పాటి పుల్లారావు కూడా వారి వెంట ఉన్నారు. నిర్వాసిత గ్రామాలలోకి ఎందుకు వెళ్లారని పౌర హక్కుల సంఘం సభ్యులు ఇంద్రజీత్‌కుమార్ అక్కడ ఉన్న బఎస్.ఐ శ్రీహరిరావును ప్రశ్నించారు. నిర్వాసితులు అనుచితంగా వ్యవహరిస్తున్నారని, రక్షణగా తమతో రావాలని అధికారులు కోరటం వల్లనే తాము వెళ్లామని ఎస్.ఐ. సమాధాన మిచ్చారు. అధికారులు ఇచ్చిన ఫిర్యాదులపై కొన్ని కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని డి.ఎస్.పి. జె.వెంకట్రామ్ వివరించారు.

తమ విధులకు అడ్డగించినందునే కేసు పెట్టటం జరిగిందని ఆర్.డి.ఓ. లవన్న వివరించారు. అనంతరం పోలవరం ప్రాజెక్ట క్యాంపుకార్యాలయనికి వెళ్లి ఇంద్రజీత్‌కుమార్ ,రజబీర్‌సింగ్ ప్రాజెక్టు నమూనాను పరిశీలించారు. తొలుత వారు పోలవరం సర్పంచ్ సంకురు వెంకాయమ్మ వాంగ్మూలం తీసుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కోటేశ్వరరావు, ప్రాజెక్టు భూసేకరణ అధికారులు, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గన్నారు.

## అమరావతిలో పెట్టుబడులకు మలేషియన్ల ఆసక్తి

**కౌలాలంపూర్, ఏప్రిల్ 15 :** ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టడానికి మలేషియాకు చెందిన అనేక సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్. కృష్ణంరాజు గత గురువారం కౌలాలంపూర్‌లో జరిగిన మలేషియా గ్లోబల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశానికి పరిశీలకుడిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మలేషియా గ్లోబల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దాతో కనగరాజ రామన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి సుమారు యాభైకి పైగా మలేషియన్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. విజయవాడ, విశాఖ పట్నంలో చేపట్టబోతున్న మెట్రో రైలు ప్రాజెక్టుపై ఆయన మాట్లాడుతూ యాభై లక్షల జనాభా దాటిన నగరాల్లోనే మెట్రో రైలు ప్రాజెక్టు లాభసాటిగా ఉంటుందని 30 లక్షల జనభా కన్నా తక్కువ ఉన్న నగరాలకు మోనోరైలు పథకం ఉత్తమమైనదని అన్నారు. విజయవాడ, విశాఖ పట్నంలో మోనోరైలు నిర్మాణానికి పవర్‌ట్రెక్ సిద్ధంగా ఉందని దాతో కనగరాజ రామన్ తెలిపారు. మోనోరైలుకు పెట్టుబడులు కూడా తక్కువేనని మెట్రో రైలుతో పోల్చితే మూడింట ఒకవంతు మాత్రమే ఖర్చు అవుతుందని ఆయన వివరించారు. మలేషియాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఇన్‌ఫ్రా కంపెనీలు ఉన్నాయని సింగపూర్‌తో పాటు అనేక దేశాల్లో వందలాది ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను ఈ కంపెనీలు పూర్తి చేశాయని ఆయన చెప్పారు. మలేషియాలో నిర్మించిన పుత్రజయ నగరం ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటని అటువంటి నగర నిర్మాణంలో తన కంపెనీ మోష్పా కూడా పాలుపంచుకుందని ఆయన తెలియజేశారు. టోన్ ఆయిల్ సి.ఇ.వో. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ సరఫరా, పోర్టులు, ఎకో టూరిజం తదికర రంగాల్లో తమ కంపెనీ వివిధ దేశాల్లో భారీ పెట్టుబడులు పెట్టిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు సహజవాయువు అవసరం చాలా ఉందని, ఆ రాష్ట్రానికి అవసరమయ్యే సహజవాయును సరఫరా చేసే సామర్థ్యం తమకు ఉందని ఆయన తెలిపారు. సహజవాయువుతో పాటు పోర్టులు కూడా అభివృద్ధి చేస్తామని దీనివల్ల వేలాది మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. తమ పూర్వీకులు ఆంధ్రా ప్రాంతంనుంచే మలేషియాకు వచ్చి స్థిర పడ్డారని అందుకే ఆంధ్ర ప్రాంతంలో పెట్టుబడులకు తాము ఆసక్తి చూపిస్తున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్రాయిట్ కాలేజ్ సలహాదారుడు రాజా మోహన్, మలేషియా ప్రాపర్టీస్ జనరల్ మేనేజర్ సుబ్రమణ్యం, శ్రీరాములు సిమెంచలం తదితరులు పాల్గొన్నారు.



మలేషియా గ్లోబల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దాతో కనగరాజ రామన్ తదితరులతో ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్. కృష్ణంరాజు

## పోలీసుల 'అతి' పై అలిగిన ఎంపీ బాబు...

**అన్నంరెడి సుబ్బారావు- రాజధాని ప్రతినిధి -కొయ్యాలగూడెం :**

కుకునూరులో ఈనెల 13న జరిగిన సి.ఎం.చంద్రబాబు బహిరంగాసభ సందర్భంగా వి.ఐ.పి.లు, ప్రజా ప్రతినిధుల పట్ల పోలీసులు 'అతిగా' వ్యవహరించి అడ్డంకులు కలిగించటంపై ఏలూరు ఎం.పి మాగంటి బాబు ఆగ్రహించి, అలిగి వేదిక దిగి వెళ్లిపోయారు. సి.ఎం. కుకునూరు చేరుకోవటానికి దాదాపు అరగంట నుంచి ఎం.పి బాబు వేదిక పై నిలచుట మైకు తీసుకొని జిల్లాలోని కామవరపుకోట, బుట్టాయగూడెం, టి.నర్సాపురం, కొయ్యలగూడెం తదితర మండలాల జడ్.పి.టి.సి.లను, ఎం.పి.పి.లను జాబితా ప్రకారం వేదికపైకి రావలసిందిగా పేర్లు చదివి ఆహ్వానించారు. ప్రొటోకాల్ జాబితాలో పేర్లులేవంటూ వేదిక పైకి వస్తున్న ఎం.పి.పి.లు, జడ్.పి.టి.సి.లను పోలీసులు వెనక్కి పంపారు. దానిపై ఎం.పి. పోలీసుల పై ఆగ్రహించి చేతిలోని మైకును వేదికమిద గట్టిగా విసిరికొట్టి వేదిక మిద నుంచి దిగి వెళ్లిపోయారు. సి.ఎం. చంద్రబాబు వేదిక పైకి వచ్చిన తర్వాత కూడా ఆయన వేదికపైకి రాలేదు. సభ ముగిసిన తర్వాత సి.ఎం. హెలీప్యాడ్ దగ్గరకు తిరిగి వెళ్లినప్పుడు మాత్రం ఎం.పి. మాగంటిబాబు, జడ్.పి.వైస్‌చైర్‌పర్సన్ చింతల వెంకట రమణ, ఎ.పి.పి. చందన శ్రీదేవి తదితరులతో కలిసి అక్కడికి వెళ్ళి కలిశారు. వేదిక దిగిపోయిన మాగంటిబాబు జడ్.పి. వైస్‌చైర్ పర్సన్ చింతలవెంకట రమణ, కొయ్యలగూడెం ఎం.పి.పి. చందన శ్రీదేవి, మరికొందరు అనుచ రులతో కలిసి గత వారం అగ్ని ప్రమాదం జరిగిన వెంకటాపురంలోని ఎస్.సి కాలనీకి వెళ్లి బాధితులను పరామర్శించారు.

అగ్ని ప్రమాదబాధితులలో ఒక కుటుంబం తమ కుమార్తె వివాహం కోసం.. ఉన్న కొద్దిపాటి భూమిని అమ్మి తెచ్చి ఇంటిలో దాచుకున్న మూడు లక్షలు రూపాయలు అగ్ని ప్రమాదంలో అగ్నికి ఆహుతి అయ్యాయి. దీంతో వివాహం అగిపోయింది. ఆ కుటుంబాన్ని ఓదార్చిన మాగంటిబాబు వారి కుమార్తె వివాహానికి లక్షరూపాయలు విరాళంగా ఇచ్చారు. తనలోపాటు పరామర్శకు వచ్చిన జడ్.పి. వైస్ చైర్‌పర్సన్, ఎం.పి.పి.లను కూడా తరువాత సాయం చేయమని సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిన మూడవ రోజునే ఎం.పి. మాగంటిబాబు గ్రామాన్ని దర్శించి బాధితులను పరామర్శించి తన వంతుగా బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు.

## ఆహార ప్రియులకు గేట్‌వేలో విందు

**(మొదటి పేజీ తరువాయి)** మసాల, చిక్కుడుకాయ్ బంగాళదుంప కూర, మలబార్ ఏవియల్ , కాకరకాయ వేపుడు, బీరకాయ పాలు, వడ మోర్ కోజంబు, కరమని మజ్జగు పెరటి

**దాల్** : కీరాయ్ మసియాల్, గోంగూరపప్పు, పీర్‌కంగల్ కూటు, దోసకాయపప్పు, సాంబార్, రసం

**రైస్ :** కేరళ రెడ్ రైస్, పొడిసాదం, పులిహోరా, కరువేపిల్లై సదం, అవకాయ అన్నం, కొబ్బరి అన్నం, బిర్యానీ, పులావ్, స్టీమ్డ్ రైస్ ఇంకా మలబార్ పరోట, కొట్టుపరోట, పరియారం కౌంటర్, సైలోన్ పరోట, అప్పం వెజ్, నాన్‌వెజ్ డిసర్ట్స్: పాల్ పనియారం, కోజ్‌కొట్టాయ్, మవు ఉర్ధాల్, ఆదిరసం, ఇనిప్పు పనియారం, పరుపు పాయసం, ఎలానీర్ పాయసం, పూతరేకులు, అరిసెలు, సేమ్యాపాయసం, చక్కెర పొంగలి, పాలతాలికలు, ప్రతిరోజు ఉదయం 7.30 నుంచి 11.30 వరకు అందుబాటులో ఉంటాయని గేట్‌వే హోటల్ యాజమాన్యం తెలిపింది.

## 'స్త్రీశక్తి' భవనం నిర్మాణ పనులు జాప్యంపై

ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆగ్రహం



కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయ సముదాయము ఆవరణ పునాదుల దశలో దాదాపు ఏడాది క్రితం నిలిచిపోయిన మండల స్త్రీ శక్తి భవన నిర్మాణ పనులు

**అన్నంరెడ్డి సుబ్బరావు- రాజధాని ప్రతినిధి- కొయ్యాలగుడెం :**



ఎమ్మెల్యే శ్రీనివాసరావు


పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని మండలాలతో పాటు కొయ్యాలగుడెం మండలానికి కూడా మండల మహిళా సమఖ్య కార్యాలయం కార్యకలాపాలు నిర్వహణ కోసం మండల స్త్రీ శక్తి, భవనం మంజూరు అయింది. రెండు అంతస్తులుగా ఉండే ఈ భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో మండల స్త్రీశక్తి (మండల మహిళా సమఖ్య) కార్యాలయం పై అంతస్తులో మండల ఎన్.ఆర్.ఇ.జి.ఎస్.కార్యాలయం నిర్వహించటానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి ప్రభుత్వం రూ.25 లక్షలు నిధులను 2013లో మాంజురు చేసింది. అప్పటి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పితాని సత్యనారాయణ 2013 మార్చి 9వ తేదీన ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టెండర్ విధానంలో కాకుండా, నామినేషన్ ప్రక్రియలో ఈ భవనం నిర్మాణానికి ఏజెన్సీని నిర్ణయిచవలసి ఉంటుంది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణలో ఈ భవన నిర్మాణ పనులు జరగవలసి ఉంది.

పర్సంటేజీలు ఇచ్చి భవనాన్ని నిర్మించడానికి ఏజన్సీలు ఎవరు ఎందుకు రాలేదు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 ఆరంభంలో పంచాయితీ తరుపున ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. భూమిలోపలి నుంచి ఆరు అడుగుల ఎత్తు వరకు ఈ భవన నిర్మాణానికి సంబంధించి కాంక్రీటు స్తంభాలు, బేస్‌మెంట్ నిర్మాంచారు. తర్వాత పనులు నిలిపివేస్తారు. పనులు నిలిపి దాదాపు 10 నెలలు దాటింది. ఈ మధ్య కాలంలో ఇసుక కొరత సమస్య ఏర్పడింది. తరువాత ఆ సమస్య పరిష్కారం అయినప్పటికే నిలిచిపోయిన భవనం నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించకపోవటంపై అధికారులు, ప్రజాప్రతినిధులలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ భవన నిర్మాణానికి తొలుత మాంజూరైన రూ.25 లక్షలకు అదనంగా మరో 30 శాతం నిధులు మంజురైనట్లు అధికారులు చెప్పారు. ఈ నెల 11న కొయ్యాలగుడెంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన డంపింగ్ యార్డు ప్రారంభించటానికి వచ్చిన ఎం.ఎల్.ఎ. మొడియం శ్రీనివాసరావు దృష్టికి ఎం.పి.పి. అయిన పర్తి చందన శ్రీదేవి, జడ్.పి.వైస్ చైర్మన్ చింతల వెంకటరమణ, ఎ.ఎం.సి. చైర్మన్ పారేపల్లి రామరావు తీసుకువెళ్ళారు.

ఎం.పి.డి.ఓ ఎం. రాజును ఎం.ఎల్.ఏ. ఈ స్త్రీ శక్తి భవన నిర్మాణంలో జాప్యం గురించి ప్రశ్నించారు. సత్వరం నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేసేటట్లు చర్యలు తీసుకోవాలని ఆయన ఎం.పి.డి.ఓ.ను ఆదేశించారు.పి.ఆర్. ఇంజనీరింగ్ అధికారులతో కూడా ఎం.ఎల్.ఏ. ఫోన్‌లో మాట్లాడారు. తక్షణం స్త్రీశక్తి భవన పనులు ప్రారంభించటానికి చర్యలు చేపట్టాలని, పునాదుల దశ పనులు నిర్వహించిన సర్పంచ్‌తో మాట్లాడాలని, సర్పంచ్ పనులు చేపట్టాటానికి నిస్సహాయత వ్యక్తం చేస్తే నిర్మాణ పనులు వేరొకరికి అప్పగించి భవన నిర్మాణం పూర్తిచేయాలని పి.ఆర్.ఇంజనీరింగ్ అధికారులను ఎం.ఎల్.ఏ. ఫోన్‌లోనే ఆదేశించారు. ఈ విషయంపై పరింపూడి సర్పంచ్ గంజిమాల దేవిని 'రాజధాని ప్రతినిధి' ఫోన్‌లో సంప్రదించగా స్త్రీశక్తి భవనం నిర్మాణా పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అయితే నిలిచిపోయిన పనులు పున్ణప్రారంభించటానికి ఉన్నత అధికారుల నుంచి అనుమతి రావలసి ఉందని, ఈ విషయమై మండల పరిషత్ ఎ.ఇ.ని కలిసి తాను మాట్లాడానని సర్పంచ్ చెప్పారు.

# డెల్టా పంట పండింది

- రబీ దిగుబడులు ఆశాజనకం
- రబీ ముగుస్తుండగానే డెల్టాలో అపరాల సాగు
- మెట్టలో అపరాలు, కూరగాయల సాగు
- అదనపు ఆదాయ మార్గాలపై రైతుల దృష్టి





**రాజధాని వార్తలు ప్రతినిధి- కొవ్వూరు :** వ్యవసాయరంగంలో అనేక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. గతంలో రెండు పంటలకే రైతులు మొగ్గు చూపేవారు. కొన్నేళ్ళుగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం, దానికి తగ్గట్టుగా వ్యవసాయ యాంత్రీకరణ వినియోగం పెరగడంతో వరితో పాటు ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. దాశాబ్దాల క్రితం వరకు వాణిజ్య పంటల జోరు ఎక్కువగా కొనసాగినా ఇప్పుడు ఆదాయం వచ్చే పంటలు పండించడానికే రైతులు ఎక్కువగా మొగ్గు చుపుతున్నారు. దీనికి కారణం సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం, తరచూ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతినడం వంటి పరిస్థితులు వ్యవసాయాన్ని కొంతవరకు ఇబ్బందులకు గురిచేశాయి. ఈ క్రమంలో రైతులు ఇతర పంటలపైనా దృష్టి సారిస్తున్నారు. సాగులో రైతులు మెళకువల పాటించడంతోపాటు వివిధ రకాల పంటల సాగు ద్వారా ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. మెట్టలో కూరగాయలు, వాణిజ్య పంటల సాగు, డెల్టాలో వరి పంటలతోపాటు మూడో పంటగా అపరాల దిశగా రైతులు అడుగు వేస్తున్నారు.

**రబీ దిగుబడులు ఆశాజనకం :** జిల్లాలో వరి మాసూళ్ళ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. జిల్లాలో సుమారు లక్షా 72 వేల హెక్టార్లలో రబీ వరి సాగు చేయగా ఇప్పటివరకు సుమారు 35 వేల హెక్టార్లలో 25 శాతం వరకు వరి మాసూళు పూర్తయ్యాయి. అపరాల సాగు చేసే రైతులు తేమ శాతం అధికంగా ఉన్న ప్రాంతాల్లో విత్తనాలను గంటసేపు నానబెట్టి చల్లుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో మినుమ విత్తనాలు 2,500 క్వింటాళ్ళు, పెసర 400 క్వింటాళ్ళు, మొక్కజొన్న విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు అంచనా. వేసవిలో డెల్టా ప్రాంతంలో మూడో పంటగా అపరాలు సాగు చేస్తున్నారు. రబీ సాగులో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు 45 నుండి 55 బస్తాల వరకు దిగుబడి వస్తున్నాయి. గతడాది రబీలో ఎరువుల వినియోగం, కోతల ఖర్చులు పెరిగి ఆదాయం తక్కువగానే లభించినా, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఈ రబీలో ఆదాయం ఎక్కువగా సమకూరే అవకాశాలు ఉన్నాయి.

**డెల్టాలో అపరాల సాగు :** కొంతకాలంగా పప్పు దినుసులకు విపరీతంగా ధర పలకుతుండటంతో అపరాల సాగుపై రైతులు దృష్టి సారించారు. డెల్టా ప్రాంతంలో రబీ పంట పూర్తి కాగానే అపరాల సాగు చేయడానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. జిల్లాలో డెల్టా ప్రాంతంలో ఇప్పడిప్పుడే రబీ వరికోతలు జోరుగా సాగుతున్నాయి. అపరాల సాగులో భాగంగా మినుము, పెసర, మొక్కజొన్న పంటలను పండించాలని రైతులు నిర్ణయించారు. దీంతో డెల్టా ప్రాంతంలో మూడో పంట సాగు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇక మెట్ట ప్రాంతంలో ఇప్పటికే రబీ వరి సాగు చేయని ప్రాంతాల్లో అపరాల సాగు చేశారు. ప్రస్తుతం మెట్టలో కూడా వరి సాగు చేసిన పొలాల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో అపరాల సాగు ముమ్మరంగానే జరుగుతోంది. మినుము, పెసర, వేరుశెనగ వంటి పంటలను ఎక్కువగా పండిస్తున్నారు.



**అపరాలు.. మూడు ప్రయోజనాలు :** వరి దిగుబడి ఆశాజనకంగా ఉన్నా డెల్టా ప్రాంతంలో అపరాల సాగు చేయడం వల్ల మూడు రకాల ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. పెసర, మినుములు, పంట సాగు చేసిన ప్రాంతాల్లో పంట పండితే మంచి ఆదాయం లభిస్తుంది. ఇది మొదటి ప్రయోజనం. ఒకవేళ దిగుబడి రాకపోతే ఆ పంటను భూమిలో కలియ దున్నితే భూసారం పెరుగుతుందని, ఇది రెండవ ప్రయోజనం అని అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వి. రమేష్ తెలిపారు. ఒకవేళ అనుకోకుండా అకాల వర్షాలు కురిసి చేను ఏపుగా ఎదిగితే అది పశువులకు మేతగా ఉపయోగపడుతుందని వ్యవసాధికారులు చెబుతున్నారు. భూసారం పెరగడం వల్ల ఎరువులు వినియోగాన్ని తగ్గించవచ్చని, తద్వారా పర్యావరణ సమతుల్యత పాటించవచ్చని అధికారులు తెలిపారు.



## విశాఖలో.. పుణే మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-9లో భాగంగా మహారాష్ట్ర నుంచి తరలించే కొన్ని మ్యాచ్‌లను విశాఖలో నిర్వహించనున్నారు. మహారాష్ట్రలో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ ఆడాల్సిన మ్యాచ్‌లు విశాఖపట్టణంలో జరుగనున్నాయి. ఈ మేరకు శుక్రవారం లీగ్ ఫ్రాంచైజీలతో లీగ్ చైర్మన్ రాజీవ్ శుక్లా సమావేశమైన అనంతరం నిర్ణయం తీసుకున్నారు. విశాఖను పుణె హోం గ్రౌండ్‌గా ఎంచుకోవడంతో కొంత వరకూ స్పష్టత రాగా, ముంబై ఇండియన్స్ జట్టు తమ నిర్ణయాన్ని చెప్పడానికి మరికొంత సమయాన్ని కోరింది. ఏప్రిల్ 17వ తేదీ తరువాత తుది నిర్ణయం చెబుతామనడంతో ముంబై ఇండియన్స్ హోం గ్రౌండ్ ఇంకా ఖరారు కాలేదు. అయితే తొలి క్వార్టర్ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌ను బెంగళూరుకు మార్చే అవకాశం ఉండగా, రెండో క్వార్టర్ ఫైనల్, ఎలిమినేటర్ మ్యాచ్‌ను కోల్‌కతాలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై త్వరలో బీసీసీఐ నిర్ణయం తీసుకోనుంది. మహారాష్ట్రలో నీటి సమస్య కారణంగా ఆ రాష్ట్రంలో నిర్వహించే ఐపీఎల్ మ్యాచ్‌లను తరలించాలం టూ బాంబే హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈనెల 30 అనంతరం ముంబై ఇండియన్స్, రైజింగ్ పుణే సూపర్‌జెయింట్స్‌లకు చెందిన 13 మ్యాచ్‌లను ఇతర వేదికలకు మార్చాల్సిన అవసరం ఏర్పడింది.



# ఉప సభాపతి

## మండలి బుద్ధ ప్రసాద్



**"జగమెరిగిన బ్రహ్మణునకు జంధ్యమేల"** అన్నట్లు పరిచయం అక్కర్లేని నాయకుడు. అవనిగడ్డ నుంచి ఎన్నికైన మండలి బుద్ధప్రసాద్, కృష్ణా జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా రాష్ట్రమంత్రిగా సేవలందించి, రాష్ట్ర ప్రజలకు చిరపరిచితుడే. అంతకు మించి తెలుగువారికి అత్యంత ఆప్తుడు. ప్రపంచ దేశాలలోని తెలుగువారికి బాగా తెలిసిన వ్యక్తి. రాజకీయ,ప్రజాసేవ బుద్ధప్రసాద్‌కు వారసత్వపు హక్కు అనవచ్చు. ఉగ్గుబాలతోనే ఆయనకు రాజకీయం అబ్బింది. వీరి తండ్రి వెంకట కృష్ణారావు ఎదురులేని నేత.తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నారు.

విలక్షణత బుద్ధప్రసాద్‌లో కనిపిస్తుంది. ఊహ తెలిసినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీతో కలిసిమెలిసి జీవించారు. అది కూడా వారికి వారసత్వమనే చెప్పాలి. కృష్ణాజిల్లాలో కాంగ్రెస్ పార్టీకి మండలి వంశం ఆయువుపట్టుగా పరిశీలకులు అభివర్ణిస్తుంటారు. ఆయన ఆ పార్టీలో ఎంతగానో మమేకమయ్యారు. అంటే కేవలం 21 ఏళ్ళ వయసులో (1977లో) జిల్లా యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబరుగా నియమితులయ్యారు. ఆయన కార్యదక్షతను, పట్టుదలను గుర్తించిన నాయకత్వం అంచెలంచెలుగా వారి హోదాలను పెంచింది. కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా పనిచేశారు. ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా సేవలందించారు. ఎ.పి.సి.సి. ఎగ్జిక్యూటివ్‌గా, ఎ.పి.సి.సి.జనరల్ సెక్రటరీగా పనిచేస్తూ, అపార అనుభవం సంపాదించారు. క్షణం తీరికలేని పనుల్లో కొనసాగుతూ కూడా జర్నలిజంకు అపార సేవలందించారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలను తు.చ. తప్పకుండా ఆచరించటం కోసం స్వస్థలం అవనిగడ్డలో గాంధీక్షేత్రం స్థాపించారు. 'గాంధీ క్షేత్రం' అనే మాసపత్రికను స్థాపించి, దీనికి సంపాదకత్వం కూడా వహించారు. మంత్రిగా కొనసాగారు. క్యాబినెట్ హోదా కలిగిన తెలుగు అధికారభాషా సంఘం అధ్యక్షునిగా తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని సేవలందించారు. 1987లో ఆంధ్రప్రదేశ్ చిన్నతరహా తెలుగు పత్రికల సంఘం వారు ఉత్తమ సంపాదకుల అవార్డును అందించారు. 1999 భారత్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకున్నారు. పుస్తక పఠనంపై ఆయన ఆసక్తి మెండు. సాహిత్యం, చరిత్రకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువ చదువుతారు. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా, 60 ఏళ్ళ స్వతంత్ర భారతదేశంలో వివిధ రంగాల అభివృద్ధిని, తెలుగువారి ప్రగతిని సమీక్షిస్తూ వివిధ రచయితల 216 వ్యాసాల సంపుటి "వజ్రభారతి"కి ఆయన సంపాదకత్వం వహించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ స్వర్ణోత్సవాలనే పద్యంలో 50 ఏళ్ళ తెలుగు భాష,సంస్కృతి, సాహిత్య వికాస పరిణామాల సమీక్షగా 112 వ్యాసాల సంకలనం "తెలుగుపసిడి"కి కూడా సంపాదకత్వం వహించారు. పాఠశాల విద్య తెలుగు మాధ్యమంతో జరిపించటానికి అహర్నిశలూ శ్రమించి, అందుకవసరమైన జి.ఓ.ను తెప్పించారు. తెలుగును పాలనా భాషగా గుర్తింపుతేవటానికి అవిశ్రాంత పోరాటం జరిపారు.

తండ్రి వెంకట కృష్ణారావు జీవితాశయమైన పులిగెడ్డ- పెనుమూడి వారధిని సాకారం చేశారు. దీని ఏర్పాటువల్ల దివిసీమ వాసులు గుంటూరు జిల్లాకు వెళ్లటానికి దగ్గరి దారి ఏర్పడింది.

సమస్యలతో పోరాటం చేయటం, ప్రజలకు అండగా నిలవడం మినహా స్వలాభంకోసం పనిచేయటం ఆయనకు తెలియదు. నమ్మిన సిద్ధాంతాల కోసం పదవులను కూడా త్యజించే ముక్కుసూటి మనిషి బుద్ధప్రసాద్. తెలుగు భాషకు వన్నెతేవటం కోసం అధికార భాషాసంఘం అధ్యక్ష పదవి బుద్ధప్రసాద్ కట్టబెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆ పదవిలో కొనసాగుతుండగానే కృష్ణా డెల్టా, దివిసీమలో సాగునీటి సమస్య తలెత్తి సుమారు 50 వేల ఎకరాల్లో సాగును నీరు అందకుండా పోయింది. సస్యశ్యామలంగా కనిపించాల్సిన పొలాలు బీళ్ళుగా మారటాన్ని చూసి బుద్ధప్రసాద్ సహించలేక పోయారు. సాగునీటికోసం గాంధీక్షేత్రంలో ఆమరణ నిరాహారదీక్షను చేపట్టారు. ఆ తరువాత అంతకన్నా ఆయన మనసును కలిచి వేచింది రాష్ట్రవిభజన నిర్ణయం. విభజన జరిగితే రాష్ట్ర అభివృద్ధికుంటుపడుతుందని వారి ప్రగాఢవిశ్వాసం, కాంగ్రెస్ తన నిర్ణయాన్ని పున: పరిశీలించుకునే స్థితిలో లేదని తెలిసి, తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన సమైక్య ఆంధ్రప్రదేశ్ అభిమాని బుద్ధప్రసాద్.

ఆయన 'పదవుల కన్నా ప్రజాసేవమిన్న' అంటారు. 'రాజకీయం కన్నా రాష్ట్రాభివృద్ధి మిన్న' అని కూడా అంటారు. ఆ రెండు దృఢ నిర్ణయాలతోనే తాను ఎంతగానో పెరగటానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. రాష్ట్రపునర్విభజన తర్వాత,"రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే, చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం" అని నిక్కచ్చిగా, నిర్మోహమాటంగా చెప్పి, తెలుగుదేశం పార్టీలో చేరారు. అవనిగడ్డ అసెంబ్లీ సీటు సందిగ్ధంగా ఉన్న సమయంలో కూడా ఆయన ఎంతో నిబ్బరంగా మాట్లాడారు. "పదవుల కోసం నేను తెలుగుదేశం పార్టీలో చేరలేదు. పదవులు లేనిరోజుల్లో కూడా నేను ప్రజలకు దూరంగా పోలేదు. సీటు వచ్చినా, రాకున్నా నేను ప్రజలకు దగ్గరగానే ఉంటాను. పదవుల కన్నా ప్రజాసేవ నాకుమిన్న" అన్నారు. ప్రజాసేవకు అంకితమయ్యే వారికి గెలిపించు కోవాలి కాబట్టి బుద్ధప్రసాద్‌ను ప్రజలు గెలిపించారు. తెలుగుభాష అంటే ఆయనకు ప్రాణం. అంతకన్నా రాష్ట్రం ముఖ్యం. రాష్ట్రానికి నష్టం జరుగుతుందని అభిప్రాయపడి, తెలుగుభాషకు సేవచేసే సువర్ణావకాశం కూడా త్యజించారు. తెలుగుపై ఆయన ఎంత మక్కువ, మమకారం అంటే, 2014 ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసే సమయంలో అచ్చ తెలుగులోనే అఫిడవిట్ దాఖలు చేసిన అసలు సిసలు తెలుగుభాషాభిమాని బుద్ధప్రసాద్. అంతేకాదు. ఉపసభాపతి పదవికి సమర్పించిన దరఖాస్తు కూడా తెలుగులో ఉండటం గమనార్హం. ఈ నియోజక వర్గం నుంచి వై.కా.పా., కాంగ్రెస్, సి.పి.ఐ., జై సమైక్యాంధ్ర, బి.యస్.పి., లోక్‌సత్తా, యం.యస్.పి., పిరమిడ్ పార్టీల అభ్యర్థులతోపాటు, మరో ఏడుగురు స్వతంత్రులు కూడా పోటీ చేశారు. ఈ నియోజకర్గంలో అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, చల్లపల్లి మండలాల గ్రామాలు ఉన్నాయి.

మంత్రి పదవులకు వారసత్వపుహక్కు "అవనిగడ్డ" అవనిగడ్డ నియోజకవర్గానికి పలు ప్రత్యేకతలు, ప్రాధాన్యతలు ఉన్నాయి. కృష్ణాజిల్లా నుంచి పోటీలేకుండా, ఏకగ్రీవంగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టిన, ఘనత ,కీర్తి మండలి వెంకట కృష్ణారావుకే దక్కింది.

**హ్యాట్రిక్ విజయాలు:**

హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఘనుడు కూడా జిల్లాలో ఆయనే. 1972లో మండలి వెంకట కృష్ణారావు అవనిగడ్డ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తండ్రి, తనయులిద్దరూ రాష్ట్రమంత్రులుగా కొనసాగిన చరిత్ర కూడా ఈ నియోజకవర్గానిదే. బుద్ధప్రసాద్ తెలుగు అధికారభాషా సంఘం అధ్యక్షులుగా కొనసాగుతూ తెలంగాణా విభజనకు కాంగ్రెస్ సుముఖత వ్యక్తం చేయటంతో, క్యాబినెట్ హోదా కలిగిన ఆ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మరో తండ్రీ కొడుకులు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 2009లో ఎన్నికైన అంబటి బ్రాహ్మణయ్య అకాలమరణం చెందటంతో 2013లో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆ సందర్భంగా నామమాత్రంగా జరిగిన ఉపఎన్నికలో వారి కుమారుడు అంబటి శ్రీ హరిప్రసాద్ విజయం సాధించారు. మంత్రి పదవులకు ఈ నియోజకవర్గం ఆయువుపట్టు. అవనిగడ్డ నుంచి విజయం సాధించిన శివరామప్రసాద్ సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గాల్లోను, వెంకట కృష్ణారావు సరసింహారావు, వెంగళరావు మంత్రివర్గాల్లో కొనసాగారు. 1952-1955లలో దివి నియోజకవర్గంగా చరిత్రలో స్థానం పొందింది. ఆ రెండు ఎన్నికలకు ఇది ద్విసభ్య నియోజకవర్గం. 1952లో సి.పి.ఐ. తరఫున పోటీచేసిన చంద్ర రామలింగయ్య, గుంటూరు బాపనయ్యలు విజయం సాధించారు. ఆ పార్టీ తరఫున పోటీచేసిన ఆ ఇద్దరూ 1955లో ఓటమి పాలయ్యారు.

# అమెరికాలో చదువుకోవాలంటే ..



## పూర్తి సమాచారం... సంక్షిప్తంగా !

అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించడం అన్నది భారతీయ విద్యార్థులకు అదొక ఎయిమ్! ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలు, యూనివర్సిటీలు అక్కడ గణనీయ సంఖ్యలో ఉన్నాయి. వాటిల్లో చదివితే ఆ గుర్తింపే వేరు. పైగా అక్కడే ఉద్యోగం చేసుకోగల అవకాశాలు, రూపాయితో పోలిస్తే డాలర్ విలువ, సౌకర్యం జీవనం ఇవన్నీ కూడా భారతీయ విద్యార్థులను ఎంతగానో ఆకర్షిస్తున్నారు. అంతేకాదు చదువుతూనే ఉద్యోగం (పార్ట్ టైం) చేసుకుంటూ తగినంత ఆదాయాన్ని పొందే వెసులుబాటు కూడా ఉంది. అందుకే పేరొందిన విద్యా సంస్థలు ఆస్ట్రేలియా,యూకే, కెనడా తదితర దేశాల్లో ఎన్నో ఉన్నప్పటికీ ఎక్కువ మంది మాత్రం అమెరికాకే మొగ్గు చూపుతుంటారు. ఎం.ఎస్.తో బాటు బిజినెస్ అండ్ మేనేజ్ కోర్సుల కోసం ఎక్కువ మంది అమెరికాను ఎంచుకుంటున్నారు.

### స్వేచ్ఛతో కూడిన అత్యుత్తమ విద్య

స్వేచ్ఛతో కూడిన విద్య, బహుముఖ సంస్కృతి అమెరికాలోని అనుకూలతలు. అమెరికాలోని విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం ముందుగా అభ్యర్థులు కొన్ని అర్హతలు సాధించాల్సి ఉంటుంది. టోఫెల్, శాట్ వంటి పరీక్షలు ఇందుకు అవకాశం కల్పిస్తాయి. అమెరికాలోని కళాశాలలు సాధారణంగా ప్రవేశాలు కల్పించే ముందు అభ్యర్థుల గ్రేడ్ పాయింట్ యావరేజ్ , ప్రవేశం పరీక్షల్లో మార్కులు, ఇంగ్లీష్ భాషా నైపుణ్యం ఇతరత్రా అంశాల ఆధారంగా ఓ నిర్ణయానికి వస్తాయి. స్కాలస్టిక్ అసెస్‌మెంట్ టెస్ట్ (శాట్), అమెరికన్ కాలేజీ టెస్టింగ్ (ఏసీటీ), శాట్ 2 పరీక్షలను కళాశాలలు నిర్వహిస్తుంటాయి. తమ ఇంగ్లీష్ పరిజ్ఞానం తగినంత లేదని భావిస్తే కొన్ని కళాశాలలు కోర్సు ప్రారంభానికి ముందుగా ఇంగ్లీష్ క్లాసులకు హాజరు కావాలనే నిబంధన మేరకు అవకాశం కల్పిస్తాయి. అడ్వాన్స్ డ్ ప్లేస్‌మెంట్ ప్రొగ్రామ్ (ఏపీ) కాలేజి క్రెడిట్‌కు అవకాశం కల్పిస్తుంది. ఏపీ ఎగ్జామ్స్ స్కోరు ఉంటే ప్రవేశాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఈ పరీక్షను అమెరికాతోపాటు 60 దేశాల్లోని కళాశాలలు గుర్తించాయి. అమెరికా ప్రభుత్వం విద్యా సంస్థలకు గుర్తింపు ఇస్తాయి. అడ్మిషన్ తీసుకునే ముందు ఆయా సంస్థలకు గుర్తింపు ఉందా లేదా? పరిశీలించుకోవాలి.

### మూడు రకాల వీసాలు...

అమెరికాలో విద్యకు సంబంధించి స్టూడెంట్ వీసాల్లో ఎఫ్1,ఎం1,జే1 అని మూడు రకాలు ఉన్నాయి. అకడమిక్ కోర్సులైన పుల్ టైమ్ బ్యాచిలర్స్ డిగ్రీ,మాస్టర్స్, డాక్టరేట్ ప్రోగ్రామ్స్ చేయాలనుకునే విద్యార్థుల ఎఫ్ 1వీసా తీసుకోవాల్సి ఉంటుంది. ఎఫ్2 అనే మరో వీసా ఉంది. ఎఫ్ 1 వీసా తీసుకునే వారిపై ఆధారపడినవారు... అంటే భార్య, పెళ్లి కాని పిల్లలు (21 ఏళ్ల లోపు) కోసం ఉద్దేశించినది. ఎఫ్2 వీసాతో అమెరికా వెళ్లన పిల్లలు అక్కడ ఎలిమెంటరీ స్కూళ్లలో చదువుకునేందుకు అవకాశం ఉంది. పైన చెప్పినవి కాకుండా నాన్ అకడమిక్ లేదా ఒకే స్పెషనల్ కోర్సుల కోసం ఎం 1 వీసా తీసుకావాల్సి ఉంటుంది. వృత్తిపరమైన సర్టిఫికెట్ కోర్సుల్లాంటివి ఈ విభాగంలోకి వస్తుంటాయి. అలాగే, ఎం1 వీసా హోల్డర్లపై ఆధారపడిన వారి కోసం ఎం2 వీసా. మూడో విభాగమైన జే 1వీసా విద్యా సంస్థల మధ్య ఒప్పందంలో భాగంగా విద్యార్థుల మార్పిడి, పరిమిత కాలంపాటు శిక్షణ కోసం వెళ్లే వారికి ఉద్దేశించినది. యూనివర్సిటీ ప్రొఫెసర్లు , పరిశోధక విద్యార్థులు, డాక్టరేట్ కోర్సుల తర్వాత పరిశోధనల కోసం ఈ వీసా తీసుకోవాల్సి ఉంటుంది. వీరిపై ఆధారపడిన వారు అమెరికా వెళ్లేందుకు జే2వీసా తీసుకోవాలి.

### నిబంధనలు పాటిస్తేనే...

స్టూడెంట్ వీసా తీసుకునే వారు అమెరికా చట్టాలకు అనుగుణంగా అన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలి. వీసా జారీ చేయాలా ? లేదా? అన్న సంపూర్ణ అధికారం కాన్సులర్ ఆఫీసర్ కు ఉంటుంది. కోర్సు ముగియగానే అమెరికా విడిచి వెళ్లిపోతామని స్పష్టంగా పేర్కొనాలి. కోర్సు పూర్తి చేసేందుకు అవసరమైన ఫీజులు, అమెరికాలో నివాసానికి అవసరమైన ఖర్చులకు తగినన్ని ఆర్థిక వనరులు ఉన్నాయని అందుకు ఆధారాలు చూపాల్సి ఉంటుంది. ఎఫ్2, ఎం2, వీసా తీసుకునే వారు తమని తాము పోషించుకోవడానికి అవసరమైన ఆర్థిక వనరులు ఉన్నాయని కాలపరిమితి ముగియగానే అమెరికాను విడిచి వెళ తామని ఆధారాలు చూపాల్సి ఉంటుంది. ఎఫ్2, ఎం2, జే2 వీసా కలిగిన వారు అమెరికాలో ఉద్యోగం, సంపాదించుకునేందుకు అవకాశం లేదు.

### వీసా కోసం ముందు ఇవి

ఎఫ్,ఎం వీసాలకు దరఖాస్తు చేసుకోవాలంటే ... ముందుగా అమెరికాలో సంబంధిత విద్యా సంస్థలు ఐ20 పత్రాన్ని జారీ చేయాల్సి ఉంటుంది. జే వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారు డీఎస్ 2019 పత్రాన్ని పొందాలి. ఈ పత్రాలతోనే వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కోర్సు ప్రారంభానికి 120 రోజుల్లోపు వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ,కోర్సు ప్రారంభానికి 30 రోజుల ముందుగానే అమెరికాలో ప్రవేశించడానికి అనుమతిస్తారు. ఎఫ్ 1 వీసా హోల్డర్లకు పాస్ పోర్ట్ విషయంలో వెసులుబాటు ఉంది. కోర్సు పూర్తి కాకముందే పాస్ పోర్ట్ గడువు తీరిపోయినా కూడా అక్కడ ఉండేందుకు అనుమతి ఉంటుంది. ఆయితే, స్వదేశానికి తిరిగి వెళ్లాలంటే మాత్రం ముందుగా అక్కడి భారత ఎంబసీ నుంచి నూతన పాస్ పోర్ట్ తీసుకోవాలి.

అమెరికాలోని స్కూళ్లల్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విదేశీయులు చదువుకోవడానికి అవకాశం లేదు. సెకండరీ విద్య అంటే 9,10 తరగతులు చదవాలని అనుకుంటే వారికి కూడా ఎఫ్1 వీసా జారీ చేస్తారు. అయితే, దీనికింద గరిష్ఠంగా 12 నెలల మాత్రమే అక్కడ చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. విద్యకయ్యే వ్యయాన్ని సంబంధిత విద్యార్థి చెల్లించినట్టుగా ఆయా స్కూళ్లు 20 పత్రంలో పేర్కొంటేనే వీసా జారీ అవుతుంది.

ఎఫ్ 1వీసా మొదటి ఏడాది క్యాంపస్ బయట పార్ట్ టైమ్ ఉద్యోగం చేయడానికి నిబంధనలు అనుమతించవు. అమెరికా పౌర, వలసవాదుల సేవా విభాగం కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మొదటి ఏడాది తర్వాత క్యాంపస్ వెలుపల పార్ట్ టైమ్ ఉద్యోగ అవకాశం వస్తే ఎవరి అనుమతి లేకుండా చేసుకోవచ్చు. అది కూడా వారంలో 20 గంటలకు మించకూడదు. సెలవుల్లో, సమ్మర్ బ్రేక్‌లో వారంలో 40 గంటల వరకు పని చేసుకోవచ్చు. నిబంధనలను ఉల్లంఘిస్తే మాత్రం అమెరికా నుంచి అర్థాంతరంగా పంపించేస్తారు. ఎం1,జే1 వీసా హోల్డర్లు కూడా ఉద్యోగం చేయడానికి వీలు లేదు.

***ఫెడరల్ గవర్నమెంట్ చట్టాల ప్రకారం*** .... 20 ఏళ్లలోపు వయసు ఉన్న పనివారికి గంటకు కనీసం 4.25 డాలర్లు వేతనంగా చెల్లించాలి. ఇది ఆ ఏడాదిలో మొదటి 90 రోజులు దాటిన తర్వాత లేదా 20 ఏళ్ల వయసు వచ్చిన వారికి (ఈ రెండింటిలో ఏది ముందు అయితే అది వర్తిస్తుంది) గంటకు కనీసం 7.25 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తున్న విద్యార్థులకు ఈ కనీస వేతనాల్లో 85 శాతానికి తగ్గకుండా చెల్లించాలి.

### కొన్నింటిలో ఎక్కువే...

అయితే ఇవి కనీస వేతనాలు మాత్రమే. ఇంతే ఇవ్వాలని లేదు. డిమాండ్ ను బట్టి పనిచేస్తున్న రంగాన్ని బట్టి ఇంతకంటే వేతనాలు ఎక్కువే చెల్లించవచ్చు. ఉదాహరణకు ట్యూటర్లు గంటకు సగటున 17 డాలర్లు వేతనంగా పొందుతున్నారు. అనుభవం ఎక్కువగా ఉంటే ఈ వేతనం కూడా అధిక స్థాయిలోనే ఉంటుంది. రెస్టారెంట్లలో ఫుడ్ వర్కర్ల వేతనం సగటున గంటకు 8 డాలక్లుగా ఉంది. కనీసం 7డాలర్ల నుంచి గరిష్ఠం 9 డాలర్ల వరకు చెల్లిస్తుంటారు. అనుమతి లేకపోయినా చట్టవిరుద్ధంగా చాలా మంది విదేశీ విద్యార్థులు అమెరికాలో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తుంటారు. అక్కడి వ్యాపారస్థులు వీరి అవసరాన్ని అవకాశంగా తీసుకుని తక్కువ మొత్తాలకే పని చేయించుకుంటుంటారు. పట్టుబడితే ఇరువురిపై చర్యలు తప్పదు.

### *ఎలా ఉండాలో తెలుసా...?*

మొదటి సారి అమెరికా వెళ్లిన వారికి అక్కడ అంతా కొత్తగా అనిపిస్తుంది. తెలియని ప్రాంతం, పరిచయాలు లేని మనుషులు. కొత్త వాతావరణం, వేష భాషలు వేరు. ఇటువంటి పరిస్థితుల్లో కొత్తదనాన్ని స్వీకరించి దానిలో ఇమిడిపోయేలా ప్రయత్నించాలి. అమెరికా వర్సిటీలు అన్నింటిలోనూ విదేశీ విద్యార్థులకు ప్రత్యేకంగా ఓ కేంద్రం ఉంది. విద్యార్థులు తమకు కావాల్సిన సమాచారాన్ని, సాయాన్ని ఇక్కడ పొందవచ్చు. విదేశీ విద్యార్థులకు తరచూ ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుంటారు. ఇతర విద్యార్థులు మీతో మాట్లాడుతున్నప్పుడు అడ్డు పడకుండా శ్రద్ధగా వినడమే మంచిది.

భారతీయ విద్యార్థులు డార్మిటరీలు, ప్రైవేటు గదుల్లో ఉండేందుకు మొగ్గు చూపుతుంటారు. అయితే ఎందులో ఉన్నప్పటికీ యూనివర్సిటీకి దగ్గర ఉండేలా చూసుకోవాలి. యూనివర్సిటీ దగ్గర్లోని మెట్రో స్టేషన్‌కు సమీపంలోనైనా ఉండేలా చూసుకోవాలి. ప్రైవేటు గదిలో ఉండడం కన్నా డార్మిటరీల్లో ఉండడమే తగినది, గ్యాస్,నీరు, కరెంటు బిల్లుల సమస్య ఉండదు. విదేశీ విద్యార్థులు మెడికల్ ఇన్సూరెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇది లేకుండా వైద్యం పొందడం గగనమే అవుతుంది. అందుకే యూనివర్సిటీలోని విదేశీ విద్యార్థుల సేవా కేంద్రాన్ని సంప్రదించడం ద్వారా మెడికల్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి.

***మాట నిదానం...***

అమెరికన్లతో మాట్లాడేప్పుడు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే... వారితో నిదానంగా స్పష్టంగా మాట్లాడాలి. అమెరికన్ల మాట తీరు చాలా వేగం. వారితో వేగంగా మాట్లాడాలని భారతీయులు ప్రయత్నిస్తుంటారు. దీంతో స్పష్టత లోపించి, భారతీయులు ఏం మాట్లాడుతున్నారో అర్థం కాక అమెరికన్లు జుట్టు పీక్కోవాల్సి వస్తుంది. ప్రొఫెసర్లు, అమెరికన్ విద్యార్థులతో ముచ్చటించడం ద్వారా అక్కడి చరిత్ర, సంస్కృతి తదితర విషయాలను తెలుసుకోవచ్చు. సాధారణంగా భారతీయ విద్యార్థులు ఇతర భారతీయ విద్యార్థులతో కలసి వెళుతుంటారు. అయితే, అన్ని సార్లూ అలా చేయకుండా... అప్పుడప్పుడు అమెరికన్ అమెరికన్ సహచర విద్యార్థులతోనూ కలసి పనిచేయడం, ప్రయాణించడం వల్ల వారితో ఉన్న అంతరం తగ్గుతుంది. అమెరికాలో భారతీయ వంటకాలు చాలా ఖరీదు. కనుక సొంతంగా వండుకోవడం వల్ల ఎంతో ఖర్చు ఆదా అవుతుంది. ఇంటి ఆహారమే తింటున్నామన్న సంతృప్తి కూడా ఉంటుంది. అమెరికాలో షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లలో కావాల్సిన వన్నీ అభిస్తాయి. ఇక్కడ వినియోగదారులపై అన్ని రకాల నిఘా ఉంటుంది. కనుక తీసుకున్న ప్రతీ వస్తువును బిల్ చేయించి చెల్లించడం మంచిది.

సోషల్ సెక్యూరిటీ నంబర్లు, క్రెడిట్ కార్డ్ నంబర్లు తదితర సున్నితమైన సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దు. అలాగే, ఏటీఎం, ఆన్ లైన్ బ్యాంకింగ్ పాస్ వర్డ్‌లు తెలపాలంటూ వచ్చే మెయిల్స్‌కు కూడా స్పందించవద్దు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. చుట్టూ ఉన్న వారిపై, పరిసరాలపై కన్నేసి ఉంచాలి. అప్రమత్తంగా ఉండడం ద్వారా చాలా నేరాలను తప్పించుకోవచ్చని అక్కడి పోలీసులు చెబుతుంటారు. రాత్రి సమయాల్లో క్యాంపస్ నుంచి బయటకు ఒంటరిగా రాకూడదు. గ్రూపుగా వెళ్లాలి. కంప్యూటర్, బుక్స్, సెల్‌ఫోన్ ఇలా వ్యక్తిగత వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలి. లేదంటే చోరులు చిటికెలో మాయం చేసేస్తారు. ఎవరో వచ్చి తలుపు తడితే తీయవద్దు. సాధారణంగా అమెరికన్లు తెలిసిన వారయితేనే అదీ కనుక్కున్న తర్వాతే తీస్తారు. అదే సురక్షిత విధానం. పిలవకుండా తమంతట తాము ఎవరైనా వచ్చి తలుపు తడితే లోపలి నుంచి మాట్లాడడమే మంచిది. తలుపులు ఎప్పుడూ లాక్ చేసి ఉంచుకోవాలి.

### అమెరికాలో టాప్ వర్సిటీలు...

2015-16 సంవత్సరానికి సంబంధించి ప్రపంచంలోని టాప్ 100 యూనివర్సిటీల్లో 30 వరకు అమెరికా నుంచే ఉన్నాయి... వాటిపై ఓ సారి లుక్కేద్దాం... ఒక్క అమెరికాలోనే కాదు, ప్రపంచంలోనే ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నిలిచింది. ఫిజికల్ సైన్సెస్, ఇంజనీరింగ్, బయాలజీ, ఎకనామిక్స్, లింగ్విస్టిక్స్, మేనేజ్ మెంట్ కోర్సులకు ఈ యూనివర్సిటీకి మంచి పేరుంది. హార్వర్డ్ యూనివర్సిటీ రెండో ర్యాంకులో ఉంటుంది. ఈ వర్సిటీ అందించే లైఫ్ సైన్సెస్, మెడిసిన్ కోర్సులకు మంచి గుర్తింపు ఉంది. స్టాన్ ఫర్డ్ యూనివర్సిటీ (3)లో బిజినేనెస్ కోర్సులు చదివితే తిరుగుతు ఉండదు. అంతేకాదు, ఈ యూనివర్సిటీ ఇంజనీరింగ్ అండ్ టెక్నాటజీ కార్సుల విషయంలో ఎంఐటీ తర్వాత వరల్డ్ నంబర్ 2 స్థానంలో ఉంది. తర్వాతి స్థానం ప్రిన్స్‌టన్ యూనివర్సిటీది. 1746లో ఏర్పాటైన ఈ యూనివర్సిటీ అందించే ఆర్ట్స్, హ్యుమానిటీ కోర్సులకు చక్కని గుర్తింపు కలదు. యేల్ యూనివర్సిటీ అమెరికాలో టాప్ 7స్థానంలో ఉంది. ప్రపంచంలో 15వ ర్యాంకు సొంతం చేసుకుంది. అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన వారిలో ఐదుగురు ఈ వర్సిటీ విద్యార్థులే. అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన వారిలో ఐదుగురు ఈ వర్సిటీ విద్యార్థులే. అమెరికాలో తొలి పీహెచ్ డీ అందించింది కూడా ఇదే యూనివర్సిటీ. ప్రపంచంలో 16వ ర్యాంకులో ఉన్న జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ పరిశోధనల పరంగా విశిష్టత కలిగినది. కార్నెల్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. స్వార్త్ మోర్ కాలేజ్. ద కాలేజీ ఆఫ్ విలియమ్ అండ్ మేరీ, విలియమ్స్ కాలేజీ, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా, డ్యూక్ యూనివర్సిటీ, వాషింగ్టన్ అండ్ లీ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా, వాండర్ బిల్ట్ యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, అండ్ ఆస్టిన్, యూనివర్సిటీ ఆఫ్ చికాగో, యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా ఎట్ లాస్ ఏంజెల్స్ నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ, కొలంబియా, జార్జిటౌన్ యూనివర్సిటీ వంటివి ప్రముఖ వర్సిటీల జాబితాలో ఉన్నాయి.

### విద్యకు కేంద్రాలుగా ఉన్న ప్రముఖ నగరాలు...

**న్యూయార్క్ సిటీ:** నిద్రించని నగరంగా దీనికి పేరు కొలంబియా యూనివర్సిటీ, న్యూయార్క్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలకు ఇది కేంద్రంగా ఉంది.

**బోస్టన్ :** మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హార్వర్డ్ యూనివర్సిటీ, బోస్టన్ యూనివర్సిటీ, బ్రాండీస్ యూనివర్సిటీ, బోస్టన్ కాలేజీ, నార్త్‌ఈస్ట్రన్ కాలేజీ, నార్త్‌ఈస్ట్రన్ యూనివర్సిటీలు ఇక్కడే ఉన్నాయి. సమీపంలోనే కేంబ్రిడ్జ్ సిటీ కూడా ఉంది.

**చికాగో :** యూనివర్సిటీ ఆఫ్ చికాగో, నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ ఎట్ అర్బన్ క్యాంపెయిన్, ద యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ చికాగో, ఇల్లినాయిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తదితర విద్యాసంస్థలు ఇక్కడ కొలువై ఉన్నాయి.

**శాన్ ఫ్రాన్సి స్కో :** స్టాన్ ఫర్డ్ యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా, బెర్క్ లీ ప్రపంచంలో టాప్ 50లో చోటు దక్కించుకున్న విద్యా సంస్థలు ఈ నగరంలో కొలువైయున్నాయి..

**లాస్‌ఏంజెల్స్ :** ప్రపంచంలో 27వ ర్యాంకు సొంతం చేసుకున్న యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా, లాప్ ఏంజెల్స్ ఇక్కడే ఉంది.

అమెరికాలో విద్యకు సంబంధించి పూర్తి వివరాలు, సహాయ సహకారాల కోసం చాలా సంస్థలు, విభాగాలు, సంఘాలు పనిచేస్తున్నాయి. యునైటెడ్ ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ అందులో ఒకటి. వివరాలకు http :// www.usief.org.in/ study 'in -the .US.aspx సైట్ చూడవచ్చు. http :// www.usembassy .go0v /, http :// travel. State .gov / content / visas/ en. html సైట్ల నుంచి కూడా సమాచారం పొందవచ్చు. అలాగే, దగ్గర్లోని అమెరికా ఎంబసీ, కాన్సులేట్‌లోనూ సంప్రదించవచ్చు

# దూకుడు



## రెండో మ్యాచ్‌లో పుణేపై గెలుపు

రాజ్‌కోట్ : ఒక వైపు ధోనీ సేన.. మరో వైపు రైనా జట్టు.. ఈ రెండు జట్లలో గత ఐపీఎల్ చెన్నై సూపర్ కింగ్స్‌లో ఆడిన ఆటగాళ్లు ఉన్నారు. గత గురువారం రాత్రి ఈ రెండు జట్లు తలపడగా రైనా నాయకత్వంలోని గుజరాత్ లయన్స్ విజయం సాధించింది. టోర్నీలో లయన్స్‌కు ఇది రెండో విజయం. తమిళుల కొత్త సంవత్సరం రోజున రెండు పాత తమిళ జట్ల పోరాటంలా సాగింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పుణే సూపర్ జెయింట్స్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. డు ప్లెసిస్ (43 బంతుల్లో 69 పరుగులు, 5 ఫోర్లు, 4 సిక్సర్లు), కెవిన్ పీటర్సన్ (31 బంతుల్లో 37 పరుగులు, 2 ఫోర్లు, 1 సిక్స్) రెండో వికెట్‌కు 61 బంతుల్లో 86 పరుగులు జోడించగా... చివర్లో ధోని (10 బంతుల్లో 22 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. జడేజా, తాంబే చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లయన్స్ 18 ఓవర్లలో 3 వికెట్లకు 164 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఆరోన్ ఫించ్ (36 బంతుల్లో 50, 7 ఫోర్లు, 2 సిక్సర్లు), బ్రెండన్ మెకల్లమ్ (31 బంతుల్లో 49, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) తొలి వికెట్‌కు 51 బంతుల్లోనే 85 పరుగులు జత చేసి జట్టు విజయాన్ని సులువు చేశారు. లయన్స్‌కు ఓపెనర్లు ఫించ్, మెకల్లమ్ మెరుపు ఆరంభాన్ని అందించారు. వీరిద్దరు ఒకరితో మరొకరు పోటీ పడి పరుగులు సాధించారు. ఆర్పీ సింగ్ ఓవర్లో మెకల్లమ్ రెండు సిక్సర్లు బాదగా, ఆ తర్వాత ఇషాంత్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టాడు. తన తొలి ఓవర్లో నాలుగే పరుగులు ఇచ్చి అశ్విన్ కాస్త తెరిపి ఇచ్చినా... తర్వాతి రెండు ఓవర్లు గుజరాత్ పంట పండించాయి. మురుగన్ అశ్విన్ వేసిన మరుసటి ఓవర్లో నాలుగు ఫోర్లు కొట్టిన ఫించ్... భాటియా తర్వాతి ఓవర్లో రెండు భారీ సిక్సర్లు కొట్టడంతో రెండు ఓవర్లలో కలిపి 33 పరుగులు వచ్చాయి. ఇదే జోరులో 33 బంతుల్లోనే ఫించ్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఎట్టకేలకు అశ్విన్ ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత తన దూకుడు కొనసాగించిన మెకల్లమ్, అశ్విన్ ఓవర్లో ఫోర్, సిక్స్ బాదడంతో 13 పరుగులు వచ్చాయి. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి మెకల్లమ్, కొద్ది సేపటికే రైనా (24 బంతుల్లో 24, 1 ఫోర్) కూడా వెనుదిరిగినా... బ్రావో (10 బంతుల్లో 22 నాటౌట్, 3 ఫోర్లు, 1 సిక్స్) మ్యాచ్‌ను ముగించాడు.

**ఆరంభంలో అదగొట్టినా..**

సూపర్‌జెయింట్స్ ఆరంభంలో బ్యాటింగ్‌తో అదరగొట్టినా చివరిలో వేగం తగ్గడంతో భారీ స్కోరు చేయడంలో విఫలమైంది. ఓపెనర్ రహానే (17 బంతుల్లో 21, 4 ఫోర్లు) చకచకా పరుగులు చేసినా తాంబే బంతికి వెనుదిరిగాడు. దీంతో డు ప్లెసిస్, పీటర్సన్ జట్టు ఇన్నింగ్స్‌ను నడిపించారు. వరుసగా రెండు ఓవర్లలో కలిపి 29 పరుగులు రాబట్టడంతో పవర్‌ప్లే ముగిసే సరికి స్కోరు 57 పరుగులకు చేరింది. క్రీజ్‌లో నిలదొక్కుకున్న ఇద్దరు బ్యాట్స్‌మెన్ కొన్ని చక్కటి షాట్లతో అలరించారు. అయితే గుజరాత్ బౌలర్లు కట్టడి చేయడంతో ఒక్కసారిగా పరుగుల వేగం తగ్గింది. ఒక దశలో డు ప్లెసిస్, పీటర్సన్ ధాటిగానే ఆడినా... తమ స్థాయికి తగినట్లుగా మెరుపులు ప్రదర్శించలేకపోయారు. ఈ క్రమంలో 33 బంతుల్లో ప్లెసిస్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత బ్రేవో చక్కటి బంతితో ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. తర్వాత తక్కువ వ్యవధిలోనే డుప్లెసిస్, స్మిత్ (5), మార్ష్ (7) వెనుదిరిగారు. దాంతో రన్‌రేట్ తగ్గిపోయి జట్టు 150 పరుగులు కూడా దాటుతుందా అనిపించింది. అయితే చివర్లో ధోని మెరుపులతో పుణే చెప్పుకోదగ్గ స్కోరు సాధించింది. బ్రేవో వేసిన ఈ ఓవర్లో ధోని 2 ఫోర్లు, 1 సిక్స్ సహా 20 పరుగులు రాబట్టాడు. తొలి 10 ఓవర్లలో వికెట్ నష్టానికి 87 పరుగులతో పటిష్టంగా ఉన్న పుణే... చివరి 10 ఓవర్లలో 76 పరుగులు మాత్రమే చేయగలిగింది. తన చివరి రెండు ఓవర్లలో జడేజా 3 పరుగులే ఇచ్చాడు.




# నటించడం చాలా కష్టం : సచిన్

**ముంబై :** క్రికెట్ ఆడటం కంటే నటించడం చాలా కష్టమని మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ అన్నారు. 'చాలా సంవత్సరాలుగా నేను ఆడుతూ ఉంటే కెమెరాలు రికార్డ్ చేసేవి. కానీ ఇప్పుడు కావాలని చేస్తున్న ఓ పనిని కెమెరాలు రికార్డు చేస్తున్నాయి. ఆడటం అంటే నాకు చాలా ఇష్టం. అలాగే నటనంటే కూడా ఇష్టం. కానీ నటించడం చాలా కష్టం' అని తన బయోపిక్ టీజర్ విడుదల సందర్భంగా సచిన్ అన్నాడు. బ్రిటిష్ డైరెక్టర్ జేమ్స్ ఎరిస్కిన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా సచిన్ జీవితచరిత్ర ఆధారంగా రూపొందింది. ఇందులో సచిన్ తన పాత్రను తానే పోషించాడు.

**సచిన్ బయోపిక్ టీజర్ విడుదల**

సచిన్ టెండూల్కర్ స్వయంగా నటించిన ఆయన బయోపిక్ టీజర్ వచ్చేసింది. యూట్యూబ్‌లో విడుదల చేసిన ఈ టీజర్‌ను స్వయంగా సచిన్ టెండూల్కర్ నుంచి ఈ సినిమాకు సంగీతం అందించిన ఆస్కార్ విజేత ఏఆర్ రెహ్మాన్, బాలీవుడ్ హీరో అభిషేక్ బచ్చన్.. ఇలా చాలామంది రీట్వీట్ చేశారు. ఈ టీజర్‌లో చిన్నతనంలో సచిన్ తన తండ్రి వేలు పట్టుకుని వెళ్లడం, తొలిసారి బ్యాట్ పట్టుకున్న ఆనందం, అన్నతో కలిసి ఆడటం, స్కూల్లో తోటి పిల్లలతో కొట్లాటలు.. ఇవన్నీ ముందు కనిపిస్తాయి. తర్వాత బీచ్ ఒడ్డున తనకు ఎంతో ఇష్టమైన నీలిరంగు షర్టు వేసుకున్న సచిన్ కనిపిస్తాడు. ఆ తర్వాత మళ్లీ హెల్మెట్ పెట్టుకుని గ్రౌండులోకి వెళ్లడం, మిడిల్ వికెట్ మీద నాణెం పెట్టి ఆడటం, ఒళ్లంతా మూడు జెండా రంగులను పులుముకుని జెండా ఊపుతూ కనిపించే సచిన్ వీరాభిమాని.. ఇవన్నీ కూడా టీజర్‌లో జోడించారు. మధ్యలో తన తండ్రి చెప్పిన సందేశాన్ని కూడా సచిన్ వినిపించాడు. "మా నాన్న ఎప్పుడూ చెప్పేవారు.. నువ్వు క్రికెట్ ఆడాలని నిర్ణయించుకున్నావు. కానీ అది నీ జీవితంలో ఒక భాగం మాత్రమే. కానీ ఏదో ఒకటి మాత్రం శాశ్వతంగా నీతో ఉండిపోతుంది అది.. నీ వ్యక్తిత్వం" అని సచిన్ టెండూల్కర్ చెప్పడం కూడా ఈ టీజర్‌లో కనిపిస్తుంది. మొత్తమ్మీద మైదానంలోనే కాదు వెండితెర మీద కూడా అభిమానులను అలరించేందుకు సచిన్ టెండూల్కర్ సిద్ధమయ్యాడు.

# మ్యాచ్‌ల తరలింపు సరి కాదు : సన్నీ



**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలో ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) మ్యాచ్‌లను తరలించడం ద్వారా నీటి కరువుకు శాశ్వత పరిష్కారం దొరకదని మాజీ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్‌లు అభిప్రాయపడ్డారు. ప్రధానంగా క్రికెట్‌ను, ఐపీఎల్‌ను కొంతమంది కావాలని టార్గెట్ చేస్తూ వివాదాలు సృష్టిస్తున్నారన్నారు. 'నీటి కరువు అనేది చాలా తీవ్రమైన అంశం. ఆ కారణంగా రైతులు చనిపోతున్నారనేది వాస్తవమే. అయితే ఐపీఎల్ మ్యాచ్‌ల తరలింపుతో ఆ సమస్యకు పరిష్కారం దొరకదు. కావాలనే ఐపీఎల్‌కు, నీటి సమస్యకు ముడి పెడుతున్నారు. ఒకవేళ ఐపీఎల్ సమస్యకు పరిష్కారం చూపకపోతే.. అప్పుడు క్రికెట్ మొత్తాన్ని ఆపేయాలా?'అని ద్రవిడ్ ప్రశ్నించాడు. నీటి ఎద్దడి కారణంగా రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం అనే అంశం చాలా తీవ్రమైంది. రైతులు సమస్యకు కచ్చితంగా ప్రాధాన్యత ఇవ్వాలి. అందుకు సరైన శాశ్వత పరిష్కారం వెదకాలి. ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించకపోతే నీరు వృథా కాదా? ఒకవేళ అదే నిజమైతే ఎలా?, తాగునీటిని వాడమని, మురుగునీటిని రీసైకిల్ చేసి వినియోగించుకుంటామని బీసీసీఐ హామీ ఇచ్చింది. బీసీసీఐ, ఫ్రాంచైజీలు డొనేషన్ కూడా ఇస్తామని స్పష్టం చేశాయి. క్రికెట్‌ను రాజకీయ అంశాలతో ముడిపెడుతున్నారు. అందులోనూ క్రికెట్ గేమ్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకుని రాద్ధాంతం చేస్తున్నారు' అని గవాస్కర్ మండిపడ్డాడు. పిచ్‌ల నిర్వహణ కోసం 60 లక్షల లీటర్ల నీటిని వృథా చేస్తున్నారని లోక్‌సత్తా ఎన్‌జీఓ మూవ్‌మెంట్ బాంబే హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేసింది. దీనిపై విచారించిన హైకోర్టు.. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 30 తర్వాత మహారాష్ట్రలో జరిగే అన్ని మ్యాచ్‌లను తరలించాలని ఆదేశాల్లో పేర్కొంది. దీంతో మే 29న జరగాల్సిన ఫైనల్‌తో సహా 13 మ్యాచ్‌లకు ఆటంకం ఏర్పడింది.

# రాజధాని విద్యుత్‌కు రూ.7,500 కోట్లు


### నిరంతర సరఫరా లక్ష్యం
### అన్నీ భూగర్భ విద్యుత్ లైన్లే
### 2019-20 నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక

**రాజధాని ప్రతినిధి -అమరావతి :** రాజధాని అమరావతికి నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. నాలుగు లక్షల జనాభాను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ ప్రణాళికను తయారు చేస్తున్నారు. 2019-20 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కావాలన్నది ఆశయం. విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.7,500 కోట్లు ప్రభుత్వం సమకూర్చే అవకాశం ఉంది. మిగిలిన మొత్తాన్ని ఆర్థిక సంస్థల నుంచి అప్పుగా తీసుకోవచ్చుని భావిస్తున్నారు. రాజధాని విద్యుత్ రంగానికి రూ.ఆరు వేల కోట్ల రుణం ఇవ్వడానికి గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్‌ఈసీ) ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేసింది. దీని కోసం ఆర్‌ఈసీతో సంప్రదించేందుకు ఒక బృందం త్వరలో ఢిల్లీ కూడా వెళుతోంది. విద్యుత్ ప్రణాళిక ప్రకారం.. రాజధాని పరిధిలో గాలిలో వేలాడే విద్యుత్ తీగలు కనిపించవు. అన్నీ భూగర్భ విద్యుత్ లైన్లే. పెనుగాలులు వీచినా సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు భూగర్భ విద్యుత్ కేబుళ్లను వేయాలన్నది ఆలోచన. విద్యుత్‌లోపాటు టెలికం, తదితర లైన్లు కూడా అందులోనే వచ్చే అవకాశం ఉంది. రాజధానిలో ఇంధన పొదుపు చర్యలకు అత్యధిక ప్రాధాన్యమిస్తారు. వీధి దీపాలకు ఎల్ ఈడీ బల్బులనే ఉపయోగిస్తారు. విద్యుత్ వ్యవస్థ నిర్వహణకు అత్యాధునికి పరిజ్ఞానాన్ని వాడతారు. స్మార్ట్ మీటరింగ్ వ్యవస్థ రానుంది. దీనివల్ల ఒక వినియోగదారుడు ఏ నిమిషంలో ఎంత విద్యుత్ వాడారన్న విషయం విద్యుత్ కార్యాలయంలో ఉండి తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్రం (వీటీపీఎస్)లో కొత్తగా నిర్మిస్తున్న 800 మెగావాట్ల విద్యుత్‌ను ప్రత్యేకంగా రాజధానికి కేటాయించాలన్నది ఆలోచన. రాజధాని విద్యుత్ వ్యవస్థను అంతర్ రాష్ట్ర విద్యుత్ లైన్లతో అనుసంధానించడం వల్ల ఉత్తరాదిలో తక్కువ ధరకు అభించే విద్యుత్‌ను వాడుకునే వెసులుబాటు కల్పించాలన్నది లక్ష్యం. రాజధాని చుట్టూ విద్యుత్ సరఫరా (400 కేవీ ట్రాన్స్‌మిషన్ లైను) వలయం రానుంది. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ల స్థాయి పెంచనున్నారు. కొన్ని కొత్త సబ్‌స్టేషన్లూ రానున్నాయి. తుళ్ళూరులో కూడా ఒక సబ్‌స్టేషన్‌ను ప్రతిపాదించారు. ఇవి అన్నీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్లు. దీనివల్ల సబ్‌స్టేషన్లుకు తక్కువ స్థలం సరిపోతుంది.

## నవయుగారంభవేళ నిలబడిన నవ మానవుడు..
# తొలి యూనివర్సల్‌మేన్...' కందుకూరి వీరేశలింగం...

**అన్నంరెడ్డి సుబ్బారావు- రాజధానిప్రతినిధి- కొయ్యలగూడెం**

" ఈ మనవ మహా సాగర మధ్యాన నవయుగారంభవేళ నిలబడిన నవమానవుడు, తొలి యూనివర్సల్‌మేన్" అని భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రశంసలు అందుకున్న నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు. రాయప్రోలు సుబ్బారావు, అల్లూరి వీరేశలింగ మహర్షి యొక్క ప్రస్తుతాంధ్రోయమునకు బ్రహ్మయగుచు." అని కీర్తించారు. ఆ మహానుభావుడు కందుకూరి వీరేశలింగం పుట్టినరోజు ఏప్రిల్ 16. తెలుగుజాతిని ముందుకు నడిపించిన ఘనుడాయన. వ్యక్తిగా తనను తాను సంస్కరించుకుంటూ తెలుగుభాషను, నవీన బాటలో నడిపించి, సంఘంలోని దురాచారాలను మాన్పించారాయన. ప్రజోపయోగ భావాలను తెలియజెప్పి, మతంలోని మర్మాలను ప్రజలకు వివరించి తెలుగుజాతిని జాగృత పరిచిన వైతాళికుడాయన. 1848 ఏప్రిల్ 16న వీరేశలింగం రాజమహేంద్రవరంలో జన్మించారు. ఆయన పూర్వీకులది పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం ఏలూరే. వీరేశలింగం ముత్తాత కందుకూరి చంద్రమౌళి ఏలూరు వాసి. చంద్రమౌళి పూర్వీకులది నెల్లూరు జిల్లాలోని కందుకూరు. సుబ్బారాయుడు, పున్నమ్మ దంపతుల ఏకైక సంతానం వీరేశలింగం. ఆయన పసితనంలోనే తండ్రి మరణించగా, పెదతండ్రి ఇంటనే ఆయన కుటుంబం పెరిగింది. రాజమహేంద్రవరం సమీపాన ఉన్న కాతేరుకు చెందిన అద్దంకి బాపమ్మతో తన 13వ యేటనే ఆయనకు వివాహం జరిగింది. బాల్యంలోనే ఆయన రఘువంశం, ఆంధ్రనామ సంగ్రామం, వసు చరిత్ర గ్రంథాలను, సుమనోరంజనం అనే ప్రబంధాన్ని చదివారు. విద్యాభ్యాసం పూర్తయిన అనంతరం ఆయన ఉపాధ్యాయవృత్తిని ఎంచుకున్నారు. సహాయ పాలనలో వీరేశలింగం అందరికీ ఆదర్శ ప్రాయుడుగా నిలిచారు. ఉద్యోగ నిర్వహణతో పాటు నిరంతర గ్రంథరచన, మరోవైపు ప్రతికానిర్వహణ ఇంకోవైపు సాంఘిక దురాచార నిర్మూలన కార్యక్రమాలు విధివిభవాప్యనర్వివాహ, ప్రయత్నాలు వితంతు పునర్వివివాహం వ్యతిరేక వాదులతో వాదోపవాదాలలో పాల్గొనటానికి ఆయన నిరంతరం సాధన చేశారు. స్త్రీ జనోద్ధరణ కోసం అందుకు పునాది అయిన స్త్రీ విద్య ప్రోత్సాహానికి విద్యాసంస్థలను స్థాపించటానికి ఆయన అహర్నిశలు పాటుపడ్డారు. 1881లో రాజమహేంద్రవరంలోని ఇన్నాను పేటలో బాలికా పాఠశాలను ఆయన స్థాపించారు. నాటకాలు రాసి విద్యార్థులతో ప్రదర్శనలు ఇప్పించేవారు. వాటిలో వ్యవహార ధర్మబోధిని అనే ప్రహసనం (వ్యంగనాటిక) అప్పట్లో ప్రజల ఆదరణ పొందింది. పండిత శివనాథశాస్త్రి ప్రేరణతో ఉత్తేజితమై ప్రత్యేక ప్రార్థనా సమాజాలను ఏర్పాటు చేసి ఏకేశ్వరోపాసనలు వేసేవారు. పేదవారికోసం రాత్రి పాఠశాలలు ప్రారంభించి శ్రామికులకు చదువు చెప్పేవారు. వీరేశలింగం పేదలకు అన్నదానం చేయటంలో మందుండేవారు. రాజమండ్రిలోని వారి ఇంటికి సమీపంలోనే ఉన్న మార్కెండేయస్వామి ఆలయానికి, వేణుగోపాలస్వామి ఆలయానికి ఆయన ప్రతిరోజు సాయంత్రం సమయాలలో వెళ్లేవారు. ఆయనకు తెలుగు, ఇంగ్లీషు భాషలలో మంచి ప్రావీణ్యం విద్యార్థి దశనంచే అబ్బింది. మహ్మదీయులు కోరిక మేరకు వారి విద్యా సంఘానికి వీరేశలింగం కార్యదర్శిగా ఉండి, మహమ్మదీయ విద్యార్థి భోజన గృహాన్ని నిర్వహించారాయన. అప్పట్లో రాజమండ్రి పురపారిశుద్ధ్య విచారణ సంఘం పేరున ఉండే పురపాలక సంఘం తాలుకా స్థల నిధి సంఘం, మండల స్థలనిధి (డిస్ట్రిక్ట్ లోకల్ ఫండ్ బోర్డు) సంఘంలో ఆయన సభ్యుడిగా ఉండేవారు. వీరేశలింగం సేవలకు మెచ్చి నాటి బ్రిటీష్ ప్రభుత్వం ఆయనకు 1893 ప్రాంతాల్లో రావు బహుద్దూర్ బిరుదును ప్రదానం చేసింది. 1898లో ఆయన సర్వకళాశాలలో సభ్యునిగా ఉన్నప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను ఫిలో ఆఫ్‌ది మద్రాస్ యూనివర్సిటీగా నియమించింది. 1894 వేసవిలో ఉద్యోగానికి సెలవుపెట్టి ఆయన చెన్నపట్నం వెళ్లారు. అక్కడి పరశువాకంలో ఒక ఇంటికి కొనుగోలు చేసి పునర్నిర్మించారు. 1897 ఆఖరులో వీరేశలింగం కుటుంబమేతంగా మద్రాస్ వెళ్లారు. మద్రాసులో ఉండటానికి రాజమండ్రిలోని కళాశాల అధ్యాపక ఉద్యోగానికి జీతం లేని షరతు పై రెండు సంవత్సరాలు సెలవు పెట్టారు. రాజమండ్రిలో ఉన్న కాలంలో తాను రచించిన పుస్తకాలు అన్నీ కలిపి 10 పెద్ద సంపుటాలుగా ముద్రణ చేయించుకున్నారు. ఆ రెండేళ్ల కాలంలో చింతామణి ప్రతికను నడిపారు. అదే సమయంలో చెన్నపురిలో ఉన్న సంస్కరణ సమాజానికి, దక్షిణ హిందుస్థాన్ బ్రహ్మ సమాజానికి వీరేశలింగం ప్రథమ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అక్కడి సర్వకళాశాల యాజమాన్యం ఆయనకు తమ ద్రావిడ భాషాద్యయన సభ సభ్యుడిగా నియమించింది. ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్ స్థాయి ఉద్యోగాలను నియమించే తెలుగు భాషా పరీక్షకులలో ఆయనకు ఒక పరీక్షకునిగా నియమించింది. చెన్నపురిపాఠశాల పుస్తకదేశ భాషా సంఘాలు కార్యనిర్వాహణ సభ్యుడిగా కూడా ఆయన నియమితులయ్యారు. ఏకకాలంలోనే ఆయన ఈ పదవులన్నింటిలో నియమితులు కావటం విశేషం.



1898లో మద్రాసులో జరిగిన హైందవ దేశాయ మహసభ నిర్వహణకు అగ్రాసనాధిపత్యానికి వీరేశలింగం ఎన్నికై మహాదేవగోవింద రనడే నుంచి " దక్షిణ హిందూ దేశ విద్యా సాగరుడు" అనే బిరుదును అందుకున్నారు. తర్వాత 1902 జూన్ 14న కాకినాడలో నిర్వహించిన చెన్న రాజధాని దేశీయ సాంఘిక మహాసభకు, 1903లో విజయవాడలో ఏర్పాటు అయిన హిందూ దేశాస్తిక మహాసభకు కూడా వీరేశలింగమే అగ్రస్థానాధిపత్యం వహించారు. మద్రాసులో వితంతు శరణాలయాన్ని కూడా నిర్వహించారాయన. యాభై అయిదేళ్ల వయసులో 1904లో ఆయన 24 రూపాయల నెలసరి పెన్షన్‌తో ఉద్యోగ విధుల నుంచి విశ్రాంతి తీసుకున్నారు. ఎనిమిదేళ్ల తర్వాత 1905లో మద్రాసులోని ఆస్తులన్నింటినీ అమ్మివేసి జన్మభూమి రాజమండ్రికి ఆయన చేరుకున్నారు. వీరేశలింగం రచనలు : ఆయన నవల, కథలు, ప్రసిద్ధ స్త్రీ, పురుషుల జీవిత చరిత్రలు, వ్యాసాలు, ప్రహసనాలు, గ్రంథవిమర్శలు, చారిత్రక గ్రంథాలు, పత్రికా రచనలు , ఉపన్యాసాలుగా కవి పండితులు, రచయితలు విశ్లేషిస్తారు. వీరేశలింగం తన పాతికేళ్ల వయస్సులో కోరంగిలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న సమయంలో పద్యాంధ్ర ఉత్తర రామాయణం, సంగ్రహ వ్యాకరణం అనే పుస్తకాలు రాశారు. వాటిలో సంగ్రహ వ్యాకరణం అనే పుస్తకాన్ని పాఠ్యగ్రంథంగా నాటి విద్యా విచారణాధికారి అనుమతించారు. 1902లో ఈ వ్యాకరణ పుస్తకాన్ని 'అముద్రిత గ్రంథ చింతామణి' అనే పత్రిక సమీక్షించింది. అప్పటి ఈ సంగ్రహ వ్యాకరణ పుస్తకం 11 సార్లు ముద్రింపబడినట్లు ఆ పత్రిక పేర్కొంది. 1994లో కూడా ఈ పుస్తకంలో మరోసారి ముద్రణ జరిగినట్లు సమాచారం ఉంది. వీరేశలింగం రచనలలో తెలుగు భాషను అభివృద్ధి చేయాలనే తపన, ఆకాంక్ష కనిపిస్తోందని పెద్దలు చెబుతుంటారు. 1874 అక్టోబరులో వీరేశలింగం కవి వివేకవర్ధని అనే మాసపత్రికను ప్రారంభించారు. 1876లో రాజమండ్రిలో ఈ పత్రిక ముద్రణ కోసం సొంత ముద్రణాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 1890లో ఈ పత్రిక నిలిచిపోయింది. 1891లో చింతామణి పేరుతో పత్రికను ప్రారంభించారు. మద్రాసులో స్త్రీ హితబోధిని, సత్యసంవర్ధిని పేరుతో మరో రెండు పత్రికలను కూడా ఆయన స్థాపించారు.



# మహానాడు తర్వాతే మంత్రివర్గ విస్తరణ ?

**(రాజధాని వార్తలు ప్రత్యేకప్రతినిధి, ఏలూరు)**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రమంత్రివర్గాన్ని విస్తరిస్తామని ముస్లిం కన్వెన్షన్‌లో బహిర్గతం చేశారు. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి వరుసగా తెలుగుదేశంలోకి చేరుతున్న శాసనసభ్యుల్లో కొందరికి మంత్రివర్గ విస్తరణలో స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముస్లిం మైనార్టీ నేత ఒకరిని రాష్ట్ర కేబినెట్‌లో తీసుకుంటానని ఆయన చెప్పారు. గిరిజన, ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర మంత్రివర్గంలో ఇప్పటివరకు స్థానం దక్కలేదు. ఈసారి ఆ రెండు వర్గాలకు అవకాశం, అదృష్టం దక్కే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఏడు గిరిజన రిజర్వుడు స్థానాలు ఉండగా అందులో ఆరు స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఒక్క పశ్చిమగోదావరి జిల్లా పోలవరం నియోజకవర్గం నుండి మాత్రమే తెలుగుదేశం అభ్యర్థి ఎన్నికయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి గిరిజన ఎమ్మెల్యేను అధికార తెలుగుదేశంలో చేర్చుకుని మంత్రి పదవి ఇవ్వాలా? లేక తెలుగుదేశంలో గెలిచిన పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్‌కు అవకాశం కల్పించాలా అనే మీమాంస పార్టీ వర్గాల్లో జరుగుతున్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గ విస్తరణ తొలుత ఉగాది రోజు జరుగుతుందని కొందరు భావించారు. అయితే మే నెల 29, 30, 31 తేదీలలో అమరావతిలో జరిగే మహానాడు తర్వాత జరుగుతుందా? రాష్ట్ర కేబినెట్ ప్రమాణస్వీకారం చేసిన జూన్ 8వ తేదీన నూతన మంత్రివర్గ విస్తరణ జరుగుతుందా? అనే చర్చ ఆ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. కొత్తగా ప్రతిపక్ష పార్టీ నుండి వచ్చిన జలీల్‌ఖాన్, భూమా నాగిరెడ్డి, జ్యోతుల నెహ్రూ తదితరులకు స్థానం కల్పిస్తారని భావిస్తున్నారు. మరో గిరిజన నేతకు అవకాశం ఉండవచ్చునని తెలుస్తోంది. ప్రస్తుత మంత్రుల్లో వారి పనితీరును, సర్వే ఆధారంగా ఇద్దరిని లేదా నలుగురిని తొలగించి కొత్తవారికి అవకాశం ఇచ్చే పరిస్థితులు కూడా లేకపోలేదని సమాచారం. మంత్రివర్గంలో మార్పులు కూడా జరగవచ్చని తెలుస్తోంది. శాఖల మార్పులు కూడా జరగనున్నట్లు సమాచారం. అయితే వలస వచ్చినవారిలో

**- జూన్ 8న కొత్త మంత్రుల ప్రమాణం !**
**- సీఎం చంద్రబాబు మదిలో ఉన్న ఇన్, అవుట్ ఎవరు?**

కొందరికి, తెలుగుదేశం పార్టీలోని మరికొందరికి కేబినెట్‌లో అవకాశం దక్కుతుందా? అయితే వారు ఎవరు? అనే అంశంపై ముఖ్యమంత్రి, పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ కసరత్తు ప్రారంభించారని తెలుస్తోంది. మొత్తంమీద రాష్ట్ర రాజకీయ రంగంలో మంత్రివర్గ విస్తరణ మార్పులు, కూర్పులుపై చర్చ అధికార పార్టీలో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది.

# బుద్ధుడి బోధనలే అహింసామార్గానికి మూలం

**(ఈనెల 21న బుద్ధ జయంతి సందర్భంగా)**



సిద్ధార్థ గౌతముడు నాటి ఆధ్యాత్మిక బౌద్ధ ధర్మానికి మూల కారకులు. బౌద్ధులందరిచే మహా బుద్ధుడిగా కీర్తింపబడేవాడు. బుద్ధుని జనన మరణాల కాలం.. క్రీ.పూ 563 నుండి 483 మధ్యలో జననం అని, 410 నుండి 400 మధ్యలో మరణం ఉండవచ్చు అని భావిస్తున్నారు. గౌతముడిని శాక్యముని అని కూడా పిలుస్తారు. ఆయన జీవిత సంఘటనలు, బోధలు మరియు భిక్షువుల నడవడికలు మొదలగునవి అన్ని ఆయన మరణం తరువాత సంఘముచే తరతరాలుగా పారాయణం చేయబడ్డాయి. మొదట, నోటి మాటగా బోధింపబడినా, దాదాపు నాలుగు వందల సంవత్సరాల తరువాత త్రిపీఠిక అనే పేరుతో మూడు పీఠికలుగా విభజింపబడి భద్రపరిచారు.

సిద్ధార్థుడు కపిలవస్తు దేశానికి చెందిన లుంబిని పట్టణంలో జన్మించాడు. భౌగోళికంగా ఈ ప్రాంతం ప్రస్తుత నేపాల్ దేశంలో ఉంది. కానీ చారిత్రకంగా ఈ ప్రాంతం ప్రాచీన భారతదేశంలోకి వస్తుంది. గౌతమ అనునది సిద్ధార్థుని ఇంటి పేరు కాదు. సిద్ధార్థుడిని పెంచిన తల్లి గౌతమి. అందుకు గాను అతనికి ఆ పేరు వచ్చింది. తండ్రి శుద్దోధనుడు, తల్లిమహామాయ (మాయాదేవి, కోళియన్ దేశపు రాకుమారి). సిద్ధార్థుడు గర్భమందున్నప్పుడు, మాయాదేవి, ఒక ఆరు దంతముల ఏనుగు తన గర్భములో కుడి వైపు నుండి ప్రవేశించినట్లుగా కల కన్నారు. అది జరిగిన పది చంద్ర మాసముల తర్వాత సిద్ధార్థుడు జన్మించాడు. శాక్యవంశాచారము ప్రకారం మాయాదేవి, ప్రసవానికి తన తండ్రిగారింటికి బయలుదేరింది. కానీ మార్గమధ్యంలో, లుంబిని అనే ప్రాంతంలో ఒక సాలవృక్షం కింద ఒక మగ బిడ్డను ప్రసవించింది.

అనేక ఆధారాలను బట్టి, ప్రసవ సమయంలోగాని లేదా మగబిడ్డ జన్మించిన కొద్ది రోజుల తర్వాత గానీ మాయాదేవి మరణించినదని తెలుస్తోంది. అలా పుట్టిన బిడ్డకి సిద్ధార్థుడని నామకరణం చేశారు. సిద్ధార్థుడు అనగా అనుకున్న లక్ష్యాన్ని సాధించేవాడని అర్థం. సిద్ధార్థుడు జన్మించిన ఐదవ దినము నాడు, అతనికి నామకరణం చేసి, అతని భవిష్యత్తుని చెప్పమని, ఎనిమిది మంది జ్యోతిష్కులని శుద్దోధనుడు ఆహ్వానించెను. వారిలో కౌండిన్యుడనే పండితుడు, సిద్ధార్థుడు భవిష్యత్తులో, బుద్ధుడవుతాడని జోస్యం చెప్పాడు. అప్పటి చరిత్ర, ఆచారాలను బట్టి చూస్తే, శుద్దోధనుడు, సూర్య వంశపు రాజైన ఇక్ష్వాకుని వారసుడని తెలియుచున్నది.

**జ్ఞానోదయం..** సిద్ధార్థుడు ధ్యానం, అనాపనసతి(ఉశ్వాస, నిశ్వాసలు) ద్వారా మధ్యయ మార్గాన్ని (ఐహిక సుఖాలను, కోరికలను త్యజించడం) కనిపెట్టాడు. ఈ సమయంలో సుజాత అనే పల్లె పడుచు తెచ్చే కొద్ది అన్నాన్ని, పాలను ఆహారంగా తీసుకునేవాడు. తర్వాత సిద్ధార్థుడు, బుద్ధ గయలో ఒక బోధి వృక్షం నీడలో పరమ సత్యం తెలుసుకొనుటకు భగవత్ ధ్యానం చేశాడు. చివరకు, తన 35వ ఏట, 49 రోజుల ధ్యానం తర్వాత, సిద్ధార్థునికి జ్ఞానోదయమయ్యింది. కొందరి అభిప్రాయం ప్రకారం, సిద్ధార్థునికి బాధ్రపద మాసంలో జ్ఞానోదయ మయ్యిందని, ఇంకొందరి అభిప్రాయం ప్రకారం, ఆయనకు ఫాల్గుణ మాసంలో జ్ఞానోదయమయ్యిందని చెప్తారు. అప్పటి నుండి, గౌతమ సిద్ధార్థుడు, గౌతమ బుద్ధునిగా మారాడు. బౌద్ధ మతంలో ఇతనిని శాక్యముని బుద్ధుడని భావిస్తారు.

జ్ఞానోదయమయ్యాక, గౌతమ బుద్ధుడు, మానవుని అజ్ఞానానికి, కష్టాలకు కారణాలను, వాటి నుండి విముక్తి పొందడానికి మార్గాలను తెలుసుకోగలిగాడు. వీటిని 4 పరమ సత్యాలుగా విభజించాడు. దీనినే బౌద్ధ మతంలో నిర్యాణమంటారు. అప్పుడు గౌతమ బుద్ధుడు, ప్రతి బుద్ధునకు ఉండవలసిన 9 లక్షణాలను ప్రతిపాదించాడు.. కోరికలే సమస్త దు:ఖాలకు కారణమని, కోరికలు జయిస్తే జీవనం శాంతియుతంగా కొనసాగుతుందని బుద్ధుని బోధనలు అవగతం చేస్తాయి.

పరులకు, పశుపక్ష్యాదులకు, క్రిమికీటకాలకు కూడా హానిని తలపెట్టని బుద్ధుని బోధనలే అహింసా మార్గానికి మూలకారణం బుద్ధుడి బోధనలను ఆంధ్రరాష్ట్రంలో బోధించి, ప్రాముఖ్యత కల్పించిన వారిలో నాగార్జునుడు ప్రముఖుడు. బుద్ధుడు ప్రవేశపెట్టిన అష్టాంగ సూత్రాలను మధ్యేమార్గంగా విభజించారు. నాగార్జునుడు ఆయన అపార జ్ఞాన సంపన్నుడు. ప్రారంభంలో ఐరోపావాసులు అతని బోధనలు తిరస్కరించినప్పటికీ ఆ తరువాత వాటిని అంగీకరించారు. 2000 ఏళ్లు బుద్ధుడి బోధనలతో శాంతి, సహవాసాలతో విలసిల్లిన ప్రదేశమే నేటి అమరావతి నగరం. నేటి నవ్యాంధ్ర రాజధానిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షదాయకం. శాతవాహనులు రాజధానిగా ప్రసిద్ధిగాంచిన ఈ ధాన్యకటకాన్ని ధరణికోటగా కూడా పిలిచేవారు. ఆ తరువాతి కాలంలో అమరావతి నగరంగా భాసిల్లింది. ఈ నగరం క్రీ.పూ. 500 నాటిదని చరిత్రకారులు తెలిపారు. బ్రాహ్మణుల ఆధిపత్యానికి, కుల విభజనతో విసిగిన సమాజానికి బుద్ధుడి మార్గం అనుసరణీయమైంది. నేటికీ విద్యా సంపన్నులంతా ఆయన మార్గంలో ప్రయాణించడం శుభ సూచకం.

# రాష్ట్రం నిప్పుల కొలిమి



**రాజధాని వార్తలు, విజయవాడ :** రాష్ట్రం రోజురోజుకూ నిప్పుల కొలిమిగా మారిపోతోంది. రాయలసీమ, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, ఉత్తరాంధ్ర, విశాఖల్లో వడగాడ్పులు తీవ్రంగా ఉంటాయని, రాత్రి ఉష్ణోగ్రతలు ఏప్రిల్ 12 నుంచి 21 వరక సాధారణం కన్నా అధికంగా నమోదు కానున్నట్టు వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. స్కైమెట్ అనే ప్రైవేట్ వాతావరణ సంస్థ మాత్రం దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో వడగాడ్పులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్‌లో వేడిగాలులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తాయని పేర్కొంది. అనేక ప్రాంతల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. కడప 44, రెంటచింతల 43, పిడుగురాళ్ల 42, రాజమహేంద్రవరం 41, అనంతపురంలో 46, విజయవాడలో 42, డిగ్రీలు నమోదైంది.

### పశుపక్ష్యాదుల్ని పట్టించుకుందాం...

మండే ఎండల్లో మనుష్యులే మలమల మాడిపోతున్నారు. మరి పశుపక్ష్యాదుల సంగతేమిటి ? రోడ్డు పై నివసించే జంతువులు నీళ్లు దొరక్క ఎంత బాధపడుతుంటాయి ? వాటిని గమనించిన జంతు ప్రేమికులు ఒక విషయం వాటి కోసం నీళ్లు పెట్టాలని వాటిని చెట్ల నీడల కింద పడుకోనివ్వాలని కోరుతున్నారు. ఈ ఎండల్లో పక్షులు, జంతువులు నీళ్లు లేక ప్రతి రోజు పక్షలు చనిపోతున్నాయని వారు తెలిపారు. కాబట్టి ప్రతి ఇంటి వెలుపల ఒక గిన్నెలో వాటికి నీళ్లు పెట్టాలంటున్నారు. ఇలాంటి పనులను పిల్లలకు అప్పగిస్తే వారికి పర్యావరణం పట్ల, జంతువులు, పక్షుల పట్ల బాధ్యత పెంచిన వారిమ వుతాంమంటున్నారు వాళ్లు.... వేసవి సెలవుల్లో ఇంట్లో ఉన్న పిల్లలకు మంచి కాల క్షేపం కూడా...



# కొత్త భూసేకరణ చట్ట ప్రకారమే..



కుకునూరు బహిరంగ సభలో సి.ఎం. చంద్రబాబు ప్రసంగిస్తున్న దృశ్యం



సభలో పోలీసుల హడావుడి

- పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు పరిహారం
- రూ. 5 లక్షలు ప్యాకేజీ చెల్లింపు, ఇళ్ల నిర్మాణం
- నిర్వాసితుల పిల్లల చదువుకు, భవిష్యత్‌కు బాధ్యత...
- విలీన మండలాల్లో విద్యార్థులకు ఎ.పి. స్థానికత కల్పన
- మొదట్లో భూమి ఇచ్చి రూ.1.15 లక్షలు పరిహారం పొందిన రైతులకు కొత్తచట్టం వర్తింపచేయలేం...
- కుకునూరు బహిరంగ సభలో ముఖ్యమంత్రి వరాలు
- నిరాశపర్చిన ప్రకటనలు

**అన్నంరెడ్డి సుబ్బారావు- రాజధాని ప్రతినిధి- కొయ్యలగూడెం**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలకు, రైతులకు కొత్త భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని, ఇళ్లు నిర్మిస్తామని, 5 లక్షల రూపాయలు చెల్లిస్తామని, నిర్వాసితుల పిల్లలకు చదువు భవిష్యత్ బాధ్యత తాను అదుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరాలు ప్రకటించారు. తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలో విలీనమైన కుకునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు భరోసా కల్పించటం కోసం ఈ నెల 13వ తేదీ కుకునూరు మండలం మారేడుమాక గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రాజెక్టు ముంపునకు సంబంధించి మొదట్లో భూములు ఇచ్చి ఆనాడే పాతచట్ట ప్రకారం ఎకరానికి రూ.1.15 లక్షలు పరిహారం అందుకున్న వారికి మాత్రం కొత్త భూసేకరణ చట్టం ప్రకారం ఇప్పుడు అదనంగా ఏమీ ఇవ్వలేమని, వారికి కొత్త చట్టం వర్తించదని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో కుండబద్దలు కొట్టినట్టు స్పష్టం చేయటం సభలోని నిర్వాసితులను నిరాశపరిచింది. అనంతృప్తి కలిగించింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ గ్రామాలను, జీవనాధారమైన వ్యవసాయ భూములను, నివాస గృహాలను, వదులుకొన్న రైతులు, ప్రజల త్యాగాలను ఎన్నటికి మరువలేమని, వారి త్యాగానికి సరైనరీతిలోనే న్యాయం చేస్తామని చంద్రబాబు చెప్పారు. నిర్వాసితులకు మునుపటి ఆర్థిక పరిస్థితికన్నా మెరుగైన జీవన ప్రమాణాలు పెరిగే విధంగా చూస్తానని ప్రకటించారు. నదుల అనుసంధానంతో రాష్ట్రంలో కరువు కాటకాలు రాకుండా చేయటమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని అయన అన్నారు. పోలవరం ప్రాజెక్టుతో అందరి జీవన ప్రమాణాలు, ఆదాయం పెరుగుతాయని ఆయన భరోసా ఇచ్చారు. విలీన మండలాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలకు చెందిన పిల్లలు...భద్రాచలం, తదితర తెలంగాణ ప్రాంతాలలో చదవుకున్న విద్యార్థులకు స్థానికత విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆంధ్రప్రదేశ్‌లో స్థానికత కల్పించే విషయమై రాష్ట్రపతికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందని, త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత పోలవరం ముప్పు ప్రాంతంలో ఉన్న కుకునూరు, వేలేరుపాడు మండలాలు తెలంగాణా నుంచి ఆంధ్రప్రదేశ్‌లో విలీనం అయిన తర్వాత ఈ మండలాల్లో ఇప్పుడు మొదటి సారిగా సి.ఎం. పర్యటనకు వచ్చారు. ప్రాజెక్టు కోసం తమ సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయడం కోసమే తాను వచ్చానన్నారు. విలీన మండలాల ప్రజలకు 1250 ఇళ్లను ఎన్.టి.ఆర్. గృహపథకం ద్వారా నిర్మించనున్నామని, అర్హులైన మరో 4 వందల మందికి నిర్వాసితులకు కొత్తగా పక్కా గృహలు మంజురు చేస్తామని వెల్లడించారు. కుక్కుమురు మండలం వెంకటాపురం ఎస్.సి. కాలనీలో ఇటీవల జరిగిన ఆగ్నిప్రమాదం కారణంగా ఇళ్లు కాలిపోయిన 48 మంది కుటుంబాలకు, అక్కడ మిగిలిన మరో 75 కుటుంబాల వారికి దాదాపు 112 కుటుంబాల వారికి ఐ.ఏ.వై. పథకం ద్వారా ఇళ్లు మంజురు చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. విలీన మండలాల్లో ఉన్న అన్ని పాఠశాలలకు 1.1 మెగావాట్ల రూఫ్‌ట్యాప్‌లు అమర్చిన విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు.

విలీన మండలాల్లో గల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించటానికి ప్రతి 750 మంది చిన్నారులకు ఒక గురుకుల పాఠశాల వంతున ఏర్పాటు చేస్తామని, చదువుకున్న ప్రతి ఒక్కరికే నైపుణ్యభివృద్ధికి శిక్షణ ఇప్పిస్తామని చంద్రబాబు అన్నారు. షెడ్యుల తెగల వారి పిల్లలకు విలువలతో కూడిన ఉన్నత విద్యను అందించడంతో పాటు వారికి మేలైన పౌష్టికాహారం అందించటం కోసం తూర్పుగోదావరి జిల్లాలో క్యాంటీన్‌లను, సెంట్రల్ వంటశాలలు ఏర్పాటు చేసి అక్కడి నుంచి ప్రత్యేక వాహనాలలో ఆహారాన్ని పాఠశాలలకు సరఫరా చేయనున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. 50 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే ఎస్.సి.ఎస్.టి.లకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తున్నామని, విదేశీ చదువులకు వెళ్లే గిరిజన విద్యార్థులకు తోడ్పాటు అందించటంతో పాటు రుణాలు పొందేందుకు వయోపరిమితిని 50 సంవత్సరాలకు పెంచామని చెప్పారు. గిరిజనులు సేకరించిన అటువంటి ఉత్పత్తులు జి.సి.సి.ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా అమ్మే విధంగా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో ఎస్.సి.ఎస్.సి.ల ఉప ప్రణాళికలతో ఆ వర్గాల, ప్రాంతాలు పూర్తి అభివృద్ధిని సాధించటంతో పాటు వారికి ఆదాయం కూడా పెరుగుతుందని ఆయన వివరించారు. కుకునూరు, వేలేరుపాడు మండలాల నుంచి జంగారెడ్డిగుడెం వరకు రాష్ట్రంలో శాశ్వత రోడ్లు నిర్మిస్తామని, అందుకు అటువంటి భూములు అవసరమైతే అటవీశాఖ అనుమతులు తీసుకుని విలీన మండలాలను జిల్లాలోని మైదాన ప్రాంతాలకు అనుసంధానం చేస్తామని సి.ఎం.ప్రకటించారు. ఫైబర్ కేబుల్ ద్వారా విలీన మండలాల గ్రామాలకు, గృహాలకు 15 ఎసి.బి.పి.ఎన్. వేగంతో ఇంటర్నెట్, కేబుల్, ఫోన్ సదుపాయాలు కల్పిస్తామని ఆయన వివరించారు. ఈ-పాస్ విధానం అమలుతో పౌరసేవలు, పౌర సరఫరాల్లో పారదర్శకత ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో 43 లక్షల మందికి పెన్షన్‌లు ఇస్తున్నామని, ఇంకా పెన్షన్‌లు అందవలసిన అర్హులు ఎవరైనా ఉంటే లక్షమందికైనా 2 లక్షల మందికైనాసరే అదనంగా పెన్షన్‌లు మంజురు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. పోలవరం ముంపులేని గ్రామాలలో సి.సి.రోడ్డు, మౌలిక పదుపాయల అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర విభజన హేతుబద్దంగా లేకపోవటంతో ఆంధ్రప్రదేశ్ గణనీయంగా ఆదాయం కోల్పోయిందని, తలసరి ఆదాయం తక్కువగా ఉందని, ఆదాయంలో రాష్ట్రం వెనుకబడి ఉందని సీఎం అన్నారు. గత రెండేళ్లలో తీసుకున్న చర్యలతో రాష్ట్రం తలసరి ఆదాయాన్ని రెండు నుంచి మూడు శాతం వరకు పెంచుకోగలిగామని ఆయన అన్నారు. అన్ని విద్యా సంస్థలకు వైఫై సేవల సదుపాయం కల్పిస్తామన్నారు. ఆర్గానిక్ ఎరువులు, ఉత్పత్తులతో ఆరోగ్యకరమైన జీవితలలో వెలుగులు నింపుతానని, తనపై నమ్మకం ఉంచి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. మధ్యాహ్నం గం.3.15లకు హెలీపాడ్‌లో దిగిన ముఖ్యమంత్రి స్వాగతాలు, పరిచయలు అనంతరం గం.3.35లకు వేదిక వద్దకు వచ్చారు. పోలవరం ఎం.ఎల్.ఏ మొడియం శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం, మంత్రులు దేవినేని ఉమా, మాణిక్యాలరావు ప్రసంగించారు. మంత్రులు పీతల సుజాత, ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, జడ్.పి.చైర్మన్ బాపిరాజు, ఎ.ఎం.సి.చైర్మన్ రామారావుతో పాటు స్థానిక మారేడుపాక సర్పంచ్ రాధ, కుక్కునూరు సర్పంచ్ మడకం సుజాత, టి.డి.పి. మండల అధ్యక్షుడు గంగరాజు తదితరులు వేదికపై ఉన్నారు. తొలుత హెలీపాడ్ వద్దా, పోలవరం ఎంఎల్.ఏ.తోపాటు మంత్రులు ఎం.ఎల్.ఏలు, ఎంపీలు, జిల్లా కలెక్టర్ తదితరులు సీఎంకు ఘన స్వాగతం పలికారు. వేదిక పైకి ముఖ్యమంత్రి రాగానే టి.డి.పి. మండల అధ్యక్షుడు పార్టీ మండల కమిటీ తరుపున ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి సీతారామలక్ష్మణుల విగ్రహాన్ని సి.ఎం.కు జ్ఞాపికగా అందజేశారు. నిర్వాసితులకు మంచి ప్యాకేజి ఇచ్చి న్యాయం చేయాలని ఆయన సి.ఎంకు విజ్ఞప్తి చేశారు.

**పంపిణీలు, మంజూరులు, శంకుస్థాసనలు, ప్రారంభోత్సవాలు :**

విలీన మండలాల గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న గృహాల నిర్మాణ బిల్లుల రూ.1.60 కోట్ల బకాయిలలో తొలి విడతగా రూ.32 లక్షలను సి.ఎం.లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే 300 మందికి కొత్తగా ఫించన్లు, 400 మందికి పక్కా ఇళ్ళు మంజూరు చేశారు. హెలీకాప్టర్ దిగిన తర్వాత సభా ప్రాంగణంలోనే సీఎం కొన్ని పథకాలకు శంకుస్థాపనలు, మరి కొన్నింటికి ప్రారంభోత్సవాలు చేశారు. రాజీవ్‌నగర్ గ్రామంలోని నిర్మించనున్న 33-11 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు, ఐ.టి.డి.ఏ. నిధులతో నిర్మించిన సోలార్ రూఫ్‌నెట్ మీటింగ్ పథకానికి, జిల్లా కేంద్రం ఏలూరులో నిర్మించనున్న గిరిజన భవన్‌కు, ఐటిడిఎ నిధులతో నిర్మించే సోలార్ రూఫ్ నెట్ మీటరింగ్ పథకానికి, జిల్లా కేంద్రం ఏలూరులో నిర్మించనున్న గిరిజనభవన్‌కు, కుకునూరులో ఏర్పాటు చేసే సబ్ ట్రెజరీకి సీఎం శంకుస్థాపనలు చేశారు. కుకునూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వేదిక పైకి వస్తూ ఆయన సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వేలేరుపాడులో ఆంధ్రాబ్యాంకును ఏర్పాటు చేయిస్తామని హామీఇచ్చారు. సాయంత్రం 5.11.గంటలకు సి.ఎం. హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరానికి బయలుదేరి వెళ్లారు. అధికారులు 7 వేల మంది కూర్చునేందుకు సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని నర్సాపురం, జిలుగుమల్లి మండలా నుంచి 9 బస్సులలో ప్రజలను సభకు తరలించారు. సభా ప్రాంగణంలోను, వెలుపల పోలీసుల "అతి" ఎక్కువగా కనిపించింది. ఒక దశలో మంత్రి పీతల సుజాత, ఎంపి.మాగంటిబాబు వారిపై అసహనం వ్యక్తం చేశారు.

# అమ్రాపాలికి ధోనీ వీడ్కోలు

**న్యూఢిల్లీ :** రియల్ ఎస్టేట్ సంస్థ అమ్రాపాలి బ్రాండ్ అంబాసిడర్‌గా భారత క్రికెట్ జట్టు పరిమిత ఓవర్ల కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని తప్పుకున్నాడు. ఆ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోని వైదొలగాలంటూ ఇటీవల సోషల్ మీడియాలో కామెంట్లు పోటెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అమ్రాపాలికి ధోని గుడ్ బై చెప్పాడు. దీనిపై అమ్రాపాలి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ శర్మ స్పందించాడు. ' గత 6-7 సంవత్సరాల నుంచి ధోని మాకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నాడు. అమ్రాపాలికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ధోని ప్రతిష్టను తగ్గించాలనేది మా ఉద్దేశం కాదు. పరస్పర ఒప్పందంలో భాగంగా ధోని అమ్రాపాలి నుంచి బయటకొచ్చాడు' అని అనిల్ శర్మ తెలిపారు.



అతి త్వరలో ఆంధ్రప్రదేశ్ అన్నీ ప్రాంతాలలో విస్తరించనున్న
రాజధాని వార్తలు
దినపత్రికకు
విలేకరులు కావలెను, మరిన్ని వివరాల కోసం
సంప్రదించవలసిన నెం:9440662699
Email :Info@rajadhani varthalu.com

కె.లక్ష్మీ ఫోన్:9948462515
గణపతి ఫోన్:8142858619
శ్రీ విజయ గణపతి బ్రాహ్మణ హోటల్
వివాహములకు, అన్ని శుభకార్యములకు క్యాటరింగ్ చేయబడును
కాశీ,భద్రీనాథ్, గయా, అమరేశ్వర్,శ్రీశైలం, భద్రాచలం, షిరిడీ, మహానంది,
అన్ని పుణ్యక్షేత్రాలకు 365 రోజులు బస్సులసౌకర్యం కలదు.
మరియు ఇండ్ల స్థలములు అమ్మబడును, కొనబడును.
రామానగర్, ఎదురుగా,బ్రెస్ట్‌ఫ్రైజ్, నిడమానూరు

Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622.